www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఏటీసీలతో విప్లవాత్మక మార్పులు



ఏటా 65 ఐటీఐలలో 10 వేల మందికి శిక్షణ

1.2 లక్షల మందికి 3, 6 నెలల డిప్లొమా కోర్సులు

శిక్షణ అయ్యాక విదేశీ ఉద్యోగాలకూ పంపిస్తున్నాం

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ వెల్లడి

3

గురువారం | 14-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 137 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి రా2.07 తదుపరి సప్తమి; నక్షత్రం: రేవతి ఉ9.06 తదుపరి అశ్విని; వర్జ్యం: తె3.51-5.21; దుర్ముహూర్తం: ఉ10.13-11.04, మ3.16-4.06; అమృతఘడియలు: ఉ6.50-8.20, రా12.51-2.21; రాహుకాలం: మ1.30-3.00; సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.38 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





హైదరాబాద్‌లోని పుప్పాలగూడ వద్ద కాందిశీకుల భూముల్లో చేపట్టిన భారీ నిర్మాణాలు

భూ మాయ చేశారు!

పుప్పాలగూడలో రూ. 6 వేల కోట్ల భూకుంభకోణం!!

- ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న కాందిశీకుల భూముల్లో రూ.30 వేల కోట్ల విలువైన రియల్‌ఎస్టేట్ వ్యాపారం
- 2005లో నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూములవి
- 2021లో ఆ జాబితా నుంచి కొన్ని భూముల తొలగింపు
- 2022లో భారీ నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతులు
- 2025లో కొన్ని భూములు మళ్లీ నిషేధిత జాబితాలోకి
- మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి కనుసన్నల్లో సాగిన వ్యవహారం!
- వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి దాసోహమైన హెచ్ఎండీఏ
- కంపెనీ డైరెక్టర్‌గా రంజిత్‌రెడ్డి కుమారుడు రాజ్ ఆర్యన్
- మరో మాజీ ఎంపీ బంధువు కంపెనీది కూడా అదే దారి
- ఈ భూదందాపై లోకాయుక్తకు, ఈడీకి ఫిర్యాదులు

2005 నాటికి అవన్నీ ప్రభుత్వ భూములే.

2021 నాటికి వాటిలో కొన్నింటిని ప్రైవేటు భూములుగా చూపించారు.

2025 నాటికి మళ్లీ వాటిలో కొన్నింటిని ప్రభుత్వ భూముల జాబితాలో చేర్చారు.

ఎంతలేదన్నా ఎకరా రూ.100 కోట్ల ధర పలికే భూమి అది. 2005 నుంచి ఖాళీగా ఉన్న ఆ భూముల్లో.. 2021లో బహుళ అంతస్తులతో భారీ భవన నిర్మాణాలకు అనుమతులిచ్చారు. రూ.30 వేల కోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారానికి గేట్లెత్తారు. రాజకీయ నేతల అత్యాశకు అధికారుల వత్తాసు తోడైన ఫలితమిది! హైదరాబాద్‌లో ఔటర్ రింగ్‌రోడ్డును ఆనుకుని పుప్పాలగూడలో ఉన్న కాందిశీకుల భూముల కథ ఇది! అత్యంత విలువైన ఆ ప్రభుత్వ భూముల్ని ఇష్టం వచ్చినట్టుగా నిషేధిత జాబితా నుంచి ఎలా తీసేశారు? అందులో కొన్నింటిని ప్రైవేటు భూములుగా ఎలా చూపించారు? మళ్లీ ఆ భూముల్లో కొన్నింటిని.. ప్రభుత్వ భూముల జాబితాలో ఎలా చేర్చారు? ఈ మార్పిళ్ల వెనుక మతలబు ఏమిటి? ఎన్నో ప్రశ్నలు... ఈ భూ కుంభకోణం విలువ.. రూ.6 వేల కోట్లు!! దీని వెనుక గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వ్యక్తులు ఉన్నారు. ప్రభుత్వం మారగానే వారంతా కండువాలు మార్చి అధికార పార్టీలోకి ఫిరాయించారు!! బీఆర్ఎస్ పార్టీ నిషేధిత భూములను సైతం రాత్రికి రాత్రే తనకు కావాల్సిన వాళ్లకు కట్టబెట్టిందంటూ.. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక కూడా.. గత సర్కారు భూ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని పలుమార్లు హెచ్చరించారు. ఆ ఆడిట్‌లో భాగంగా ఈ భూములపైనా దృష్టిసారిస్తే అక్రమాల నిగ్గుతేలే అవకాశం ఉంది.

11

కొత్త వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంపు!



ఎక్స్‌షోరూం ధరను బట్టి శ్లాబుల మార్పు

ద్విచక్ర వాహనాలకు 3 శ్లాబుల్లో..

కార్లు, ఇతర వ్యక్తిగత వాహనాలకు ఐదు శ్లాబుల్లో పన్ను

తక్కువ ధర వాహనాలపై పడని ప్రభావం

ఖరీదైన వాహనాలపై అధిక పన్ను విధింపు

నేటి నుంచే అమల్లోకి.. 2 వేల కోట్ల వరకు అదనపు రాబడి.. అధికారుల అంచనా

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త వాహనాలపై జీవితకాల పన్ను (లైఫ్ ట్యాక్స్)ను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ద్విచక్రవాహనాలు, కార్లు, ఇతర వ్యక్తిగత వాహనాలకు సగటున మూడు శాతం మేర పన్నులను పెంచింది. గురువారం నుంచే పెరిగిన పన్నులు అమల్లోకి వస్తాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ మోటారు వాహనాల పన్నుల చట్టం-1963 ప్రకారం వాహనాల జీవితకాల పన్నుల్లో మార్పులు చేస్తున్నట్టు తెలిపారు. కాగా కొత్త శ్లాబుల ప్రకారం ఎక్స్ షోరూం ధర రూ.లక్ష లోపు ఉండే ద్విచక్రవాహనాలపై.. రూ.10 లక్షల లోపు ధర ఉండే కార్లు, ఇతర వ్యక్తిగత వాహనాలపై పన్ను పెంపు ప్రభావం ఉండటం లేదు. ఆపైన ధర ఉండే వాహనాలకు సంబంధించి కొత్తగా శ్లాబులు నిర్ణయించి, ఎక్కువ పన్నులను నిర్ధారించారు. రాష్ట్ర రవాణా

మిగతా 13వ పేజీలో...

భూముల విలువల పెంపు తొలుత ఓఆర్ఆర్ వరకు!

ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు

క్యాబినెట్‌లో చర్చించి, విలువల పెంపుపై నిర్ణయం

మ్యుటేషన్లు త్వరగా పూర్తి చేయాలి

రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, గృహనిర్మాణ శాఖలపై సీఎం సమీక్ష

13

'స్థానికం'లో బీసీలకు 42% రిజర్వేషన్లపై అసెంబ్లీలో నిర్ణయం

తీర్మానం పెట్టి ఆమోదించే అవకాశం..

18 తర్వాత అసెంబ్లీ సమావేశాలు

13

ఓఎంసీ కేసులో సబితా ఇంద్రారెడ్డి, కృపానందంను నిర్దోషులుగా ప్రకటించడం చెల్లదు

సీబీఐ కోర్టు తీర్పుపై హైకోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ అప్పీల్ దాఖలు

విచారణ ఈ నెల 18కి వాయిదా

11

కోదండరాం, అలీఖాన్‌కు షాక్





ఎమ్మెల్సీలుగా వారి నియామకాన్ని రద్దుచేసిన సుప్రీం

గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల సవరణ

అప్పట్లో తాము స్టే ఇచ్చి ఉండకూడదని వ్యాఖ్య

ఇద్దరి ప్రమాణ స్వీకారమే సరికాదని స్పష్టీకరణ

వారి పేర్లను మళ్లీ సిఫారసు చేసేందుకు చాన్స్

సెప్టెంబరు 17కు విచారణ వాయిదా

తీర్పు బీజేపీ, కాంగ్రెస్‌లకు చెంపపెట్టు: కేటీఆర్

న్యూఢిల్లీ/ హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు కోదండరాం, అమీర్ అలీఖాన్‌లకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. శాసనమండలి సభ్యులుగా వారి నియామకాన్ని రద్దు చేసింది. వారిద్దరు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయడమే తప్పు అని పేర్కొంది. గతంలో హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వును సవరించింది. "మేం నాడు పొరపాటు చేశాం. తాజాగా నామినేషన్ల

మిగతా 11వ పేజీలో...



అడవి పునరుద్ధరణకు ప్రణాళిక

6 నుంచి 8 వారాల్లో నివేదిక ఇస్తాం

కంచ గచ్చిబౌలి కేసులో సుప్రీంకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

11

సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనానికి ఢిల్లీ వీధి కుక్కల కేసు

నేడు విచారణ జరపనున్న బెంచ్

2

వరుణుడి దరువు!

రాష్ట్రవ్యాప్తంగా వర్షం

మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో 24, మరో రెండు చోట్ల 20 సెం.మీ.కి పైగా

50 మండలాల్లో 6-11 సెం.మీ.

శంషాబాద్‌లో విమానాల రాకపోకలకు అంతరాయం

3 సర్వీసుల రద్దు.. 9 దారి మళ్లింపు

నేడు, రేపు భారీ వర్షాలు

మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్

ఈ జిల్లాలో బడులకు నేడు సెలవు

అల్పపీడనం, నైరుతి ప్రభావంతో 19వ తేదీ దాకా వర్షాలే

తెలంగాణకు కేంద్ర సహాయం

14

భారీ వర్షాల నేపథ్యంలో షా భరోసా

జనం అప్రమత్తంగా ఉండాలి: కిషన్‌రెడ్డి



కుమరం భీం జిల్లా చింతలమానేపల్లి మండలంలోని రనవెల్లిలో పొంగి పొర్లుతున్న ఒర్రెను దాటుతున్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

చినుకు వణికిస్తోంది.. వరద దడ పుట్టిస్తోంది. కొన్నాళ్లుగా రాష్ట్రంపై దట్టంగా కమ్ముకొని వదలని మేఘం ఉరుములు, మెరుపులతో మరోసారి భీకరంగా గర్జించింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వర్షం దంచికొట్టింది. వాగులు, ఒర్రెలు పొంగిపొర్లాయి. చెరువులు అలుగు పోశాయి. వరద ధాటికి కొన్నిచోట్ల చెరువు కట్టలు, అలుగులు తెగిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. కొన్నిచోట్ల

మిగతా 14వ పేజీలో...

నదులకు 100 మీటర్ల వరకు నిర్మాణాలపై నిషేధం

500 మీటర్ల దూరం వరకు కూడా ఆంక్షలు

మూడు జోన్లుగా నదీ తీరాలు

రక్షిత, నియంత్రిత, హెచ్చరిక జోన్లుగా ఏర్పాటు

కేంద్రం మార్గదర్శకాలు విడుదల.. వరద ప్రవాహ మ్యాపింగ్ పూర్తయ్యే వరకు కఠినంగా అమలు

2

ఢిల్లీ వీధి కుక్కల కేసు త్రిసభ్య బెంచ్‌కి




న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలంటూ ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు పునఃసమీక్షించనుంది. ఆ కేసును త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజరియాల ధర్మాసనం గురువారం దీన్ని విచారించనుంది. ఢిల్లీలోని వీధి కుక్కల బెడదపై సుమోటో కేసు తీసుకున్న జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ద్విసభ్య బెంచ్.. వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలంటూ ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ కేసు విషయం బుధవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ ముందర రెండు సార్లు ప్రస్తావనకు కూడా వచ్చింది. వీధి కుక్కల సమస్యపై వచ్చిన అన్ని పిటిషన్లను గతేడాది మేలోనే జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం సంబంధిత హైకోర్టులకు బదిలీ చేసిందని ఓ న్యాయవాది తెలిపారు. తాజా ఉత్తర్వులు అందుకు విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అప్‌లోడ్ చేయకముందే వీధి కుక్కలను తరలించడం ప్రారంభించారని మరో న్యాయవాది చెప్పారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. 'ఆ విషయాన్ని పరిశీలిస్తాను' అని పేర్కొన్నారు. అనంతరం ఆ కేసును త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేశారు.

పాత ఈ-మెయిల్స్ డిలీట్ చేసి నీటిని పొదుపు చెయ్యండి

కరువు నేపథ్యంలో యూకే ప్రజలకు అధికారుల పిలుపు



బ్రిటన్, ఆగస్టు 13 : పాత ఈ-మెయిల్‌లు, ఫొటోలు డిలీట్ చేసి నీటిని పొదుపు చెయ్యండి.. బ్రిటన్ పౌరులకు ఆ దేశ అధికారులు ఇచ్చిన పిలుపు ఇది. ఈ-మెయిల్‌లు, ఫొటోలకు నీళ్లకు ఏం సంబంధం అని ఆలోచిస్తున్నారా ?. సాధారణంగా ఈ-మెయిల్‌లు, ఫొటోలు, వీడియోలన్నీ ఉండే క్లౌడ్ స్టోరేజీలను పెద్ద పెద్ద డేటా సెంటర్లు నిర్వహిస్తుంటాయి. పెద్ద ఎత్తున విద్యుత్‌ను వినియోగించుకునే ఈ డేటా సెంటర్లలోని పరికరాలు వెలువరిచే ఉష్ణోగ్రతను నియంత్రించి వాటిని చల్లబరిచేందుకు భారీ ఎత్తున నీటి వనరులు అవసరం అవుతాయి. అయితే, నీటి కొరతతో ఇప్పటికే తీవ్రమైన కరువు ఎదుర్కొంటున్న బ్రిటన్.. నీటి నిల్వల పొదుపుపై దృష్టి సారించింది. బ్రిటన్ పర్యావరణ విభాగం సూచనల మేరకు డేటా సెంటర్లలో నీటి వినియోగంపై దృష్టి పెట్టింది. డేటా సెంటర్లపై ఒత్తిడి తగ్గిస్తే పెద్ద ఎత్తున నీటి నిల్వలు మిగులుతాయనే ఆలోచనతో.. క్లౌడ్‌లో ఉన్న పాత ఈ-మెయిల్‌లు, ఫొటోలను డిలీట్ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ఇదేకాక, నీటి పొదుపు కోసం స్నానం చేసే సమయాన్ని తగ్గించుకోవడం వంటి మరిన్ని సూచనలు కూడా చేసింది.



నదులకు 100 మీటర్ల వరకు

నో డెవలప్‌మెంట్ జోన్

- మూడు జోన్లుగా నదీతీరాలు..కేంద్రం మార్గదర్శకాలు
- రక్షిత, నియంత్రిత, హెచ్చరిక జోన్లుగా ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: వరద ప్రవాహ ప్రాంతాల జోనింగ్‌ను కేంద్ర ప్రభుత్వం మూడుగా విభజించింది. అవి.. రక్షిత(ప్రొటెక్టెడ్), నియంత్రిత(రెగ్యులేటరీ), హెచ్చరిక(వార్నింగ్) జోన్‌లు. ప్రవహించే నదుల నుంచి 100 మీటర్ల వరకు 'నో డెవలప్‌మెంట్ జోన్'గా ప్రకటించింది. అంతేకాదు.. 500 మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు అమలవుతాయి. ఈ మేరకు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ 'ఫ్లడ్ ప్లెయిన్ జోనింగ్' పేరుతో వరద ప్రవాహ ప్రాంతాల్లో సాంకేతిక మార్గదర్శకాలను విడుదల చేసింది. గత ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన వరద ప్రవాహ మ్యాపింగ్ పూర్తయ్యే వరకు ఈ మార్గదర్శకాలు అమలవుతాయి. ఈ మార్గదర్శకాలను కేంద్రం గత నెల సూత్రప్రాయంగా ఆమోదించగా.. తాజాగా వాటి వివరాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపింది. ఉపగ్రహ డాటా, హైడ్రాలజికల్ మోడలింగ్, వాతావరణ మార్పులు, ప్రవాహ ప్రాంతాల మ్యాపింగ్ పూర్తిచేయాలని, భూ వినియోగ ప్రణాళికను రెవెన్యూ రికార్డుల్లో పొందుపర్చాలని సూచించింది. పైన పేర్కొన్న మూడు జోన్లతోపాటు.. సున్నిత ప్రాంతాల్లో కార్యకలాపాల నిషేధం, పర్యావరణ పరిరక్షణకు ఏకరీతి ప్రమాణాల ఏర్పాటు వంటి అంశాలున్నాయి. నదీతీరాల నుంచి 500 మీటర్ల దూరం వరకు ల్యాండ్‌ఫిల్ సైట్లు, మునిసిపల్, పరిశ్రమల వ్యర్థాల పారవేతపై నిషేధం ఉంటుంది.

- ప్రతి ఐదేళ్లకు ఒకసారి వరదలు పునరావృతమయ్యే ప్రాంతాన్ని కేంద్రం ప్రొటెక్టెడ్ జోన్‌గా ప్రకటించింది. తాజా మార్గదర్శకాల ప్రకారం ఈ జోన్‌లో శాశ్వత నిర్మాణాలు, వ్యర్థాలను పారవేయడం, ప్రమాదకర పదార్థాల నిల్వ నిషేధం.
- ప్రతి ఐదేళ్లకోసారి.. అదేవిధంగా పాతికేళ్లకు ఒకసారి వరదలు వచ్చే ప్రాంతాన్ని రెగ్యులేటరీ జోన్‌గా ప్రకటించారు. ఈ జోన్‌లో కార్యకలాపాలను కఠినంగా నియంత్రిస్తారు.
- ప్రతి పాతికేళ్లకు ఒకసారి.. అదేవిధంగా ప్రతి 100 ఏళ్లకు ఒకసారి వరదలు వచ్చే ప్రాంతాన్ని వార్నింగ్ జోన్‌గా కేంద్రం మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. ఇక్కడ తక్కువ ప్రమాదకర కార్యకలాపాలకు అనుమతి ఉన్నా.. ముప్పు అంచనాకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారు.

'డ్రాప్‌బాక్స్' వీసా రెన్యువల్‌కు అమెరికా స్వస్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఇంటర్వ్యూ లేకుండా వీసా రెన్యువల్స్ కోసం తీసుకొచ్చిన 'డ్రాప్‌బాక్స్' సదుపాయానికి అమెరికా స్వస్తి చెప్పింది. వీసా దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలకు హాజరవ్వాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. వర్క్, స్టూడెంట్ కేటగిరీలతో పాటు నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాల కోసం ప్రస్తుతం డ్రాప్‌బాక్స్ సదుపాయం అందుబాటులో ఉంది. క్లీన్ వీసా హిస్టరీ ఉన్నా కూడా ఇకపై చాలా కేటగిరీల్లోని వీసా దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఈ కొత్త మార్పు వచ్చే నెల 2 నుంచి అమల్లోకి రానుంది. ఈ డ్రాప్‌బాక్స్‌ను ఎక్కువగా వినియోగించుకుంటున్న భారతీయులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇకపై కేవలం దౌత్య, అధికారిక వీసాలైన ఏ, జీ, నాటో, టెక్రో వీసాలకు మాత్రమే డ్రాప్‌బాక్స్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. కఠినమైన రూల్స్‌తో కొద్ది సంఖ్యలో బీ1, బీ2 పర్యాటక, బిజినెస్ వీసాల రెన్యువల్‌కు డ్రాప్‌బాక్స్‌ను కొనసాగిస్తారు.



గవర్నర్ సమక్షంలోనే వీసీ నుంచి పట్టా అందుకుంటున్న జీన్ రాజన్

గవర్నర్ ఆర్ఎన్ రవి.. తమిళనాడు వ్యతిరేకి

- ఆయన నుంచి డిగ్రీ పట్టా స్వీకరణకు ఓ విద్యార్థిని విముఖత

చెన్నై, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా, ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకునబెట్టేలా వ్యవహరిస్తున్నారంటూ తమిళనాడులో ఓ విద్యార్థిని గవర్నర్ నుంచి డిగ్రీ స్వీకరించేందుకు నిరాకరించింది. పక్కనే ఉన్న యూనివర్సిటీ వీసీ చంద్రశేఖర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంది. తిరునల్వేలిలో బుధవారం జరిగిన మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం 32వ స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ హోదాలో హాజరైన గవర్నర్ ఆర్ఎన్ రవి విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తుండగా, విద్యార్థులు వరుసగా సర్టిఫికెట్లు అందుకుంటున్నారు. ఈ క్రమంలో నాగర్‌కోయిల్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థిని జీన్ రాజన్ మాత్రం గవర్నర్ నుంచి కాకుండా వీసీ నుంచి సర్టిఫికెట్ స్వీకరించింది. జీన్ రాజన్ తరువాత విలేకరులతో మాట్లాడుతూ.. గవర్నర్ ఆర్ఎన్ రవి తమిళనాడుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించింది. ఈ వ్యవహారంపై అధికార డీఎంకే స్పందించింది. గవర్నర్ తీరు పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో తెలుసుకోవాలని సూచించింది.

కనీస నిల్వపై ఐసీఐసీఐ బ్యాంక్ యూటర్న్

- రూ.50 వేలు ఉండాలన్న నిబంధనపై వెనక్కి

న్యూఢిల్లీ, ఆగస్టు 13: పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ రూ.50 వేలు ఉండాలన్న నిబంధనపై ఐసీఐసీఐ బ్యాంక్ యూటర్న్ తీసుకుంది. వినియోగదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కనీస నిల్వ మొత్తాలను సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. అర్బన్ ప్రాంతాల్లో కనీస నిల్వ రూ.15 వేలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ.7,500 ఉంటే చాలని తెలిపింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ గతంలో మాదిరిగా 2,500 ఉంటే చాలని స్పష్టం చేసింది. పొదుపు ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోతే అపరాధ రుసుం విధించే నిబంధనను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు గతంలోనే తొలగించాయి. కనీస నిల్వ రూ.50 వేలు ఉండాలంటూ ఈనెల 9న ఐసీఐసీఐ బ్యాంక్ చేసిన ప్రకటన కలకలం రేపడంతో పాటు విమర్శలకు తావిచ్చింది.

అమెరికా అప్పులు రూ.3.25 కోట్ల కోట్లు!

వాషింగ్టన్, ఆగస్టు 13: అమెరికా రోజురోజుకూ అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. అంచనాలకు మించి భారీగా రుణభారం పెరిగిపోతోంది. మొత్తం అప్పులు 37 ట్రిలియన్ డాలర్ల(రూ.3.25 కోట్ల కోట్లు)కు చేరాయి. అమెరికా ఆర్థిక శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికా రుణ భారం 2030 నాటికి 37 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని 2020లో అంచనా వేశారు. కానీ, రుణ భారం చాలా వేగంగా పెరిగింది. ఈ ఏడాదే 37 ట్రిలియన్ డాలర్లకు చేరింది. కరోనా సమయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు భారీగా రుణాలు సేకరించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు పెద్ద మొత్తంలో అప్పులు చేశారు. రాబోయే దశాబ్ద కాలంలో మరో 4.1 ట్రిలియన్ డాలర్లు రుణాలుగా సేకరించేందుకు అవకాశం కల్పించే బిల్లుకు ఇటీవల ట్రంప్ ఆమోదముద్ర వేశారు.

ట్రంప్ సుంకాలతో నష్టం..

రూ.7 లక్షల కోట్లు!

దుస్తులు, పాదరక్షలు, ముత్యాలు, ఆభరణాల ఎగుమతులపై తీవ్ర ప్రభావం

- చైనా ఉత్పత్తులు వరదలా వచ్చి పడే పరిస్థితి
- కొత్త మార్కెట్ల అన్వేషణే దీనికి పరిష్కారం
- ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



న్యూఢిల్లీ, ఆగస్టు 13: అమెరికా సుంకాలు ఓవైపు, భారత మార్కెట్లలోకి వరదలా వచ్చి పడే చైనా ఉత్పత్తులు మరోవైపు.. ఈ రెండింటి ప్రభావంతో భారత్ భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హెచ్చరించారు. భారతీయ దిగుమతులపై ట్రంప్ తాజాగా విధించిన 50% సుంకాల ప్రభావం దుస్తులు, పాదరక్షలు, ముత్యాలు, ఆభరణాలు వంటి పరిశ్రమల ఎగుమతులపై తీవ్రంగా ఉండవచ్చని, ఫలితంగా దాదాపు రూ.7 లక్షల కోట్ల మేర (జీడీపీలో 2%) నష్టం వాటిల్లవచ్చని అంచనా వేశారు. 'లాభాలు తగ్గుతాయి. కొనుగోళ్లు మందగిస్తాయి. ఉద్యోగాలు పోతాయి. పరిశ్రమలు పూర్తిస్థాయిలో పని చేయకపోవచ్చు' అని పేర్కొన్నారు. మరోవైపు, అమెరికా సుంకాలతో ఆ దేశంలో మార్కెట్ వాటాను కోల్పోయే చైనా.. నష్టాన్ని పూడ్చుకోవటానికి తమ ఉత్పత్తులను భారత్‌కు పెద్ద ఎత్తున తరలించే అవకాశం ఉందన్నారు. ఒక ఇంగ్లిష్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సుబ్బారావు.. దేశ ఆర్థికవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి మాట్లాడారు. ట్రంప్ సుంకాలతో జరిగే నష్టాన్ని తగ్గించుకోవటానికి.. ఇతర మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయటం, ధరలపై కొత్తగా సంప్రదింపులు జరపటం వంటి చర్యలు చేపట్టాలని భారతీయ ఎగుమతిదారులకు ఆయన సూచించారు. ఈ విధంగా కొత్తగా ఎదురైన సవాళ్లను అవకాశంగా మల్చుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయం, పాడిపరిశ్రమ రంగాల్లోకి అమెరికాతోపాటు ఏ దేశానికీ పూర్తిగా ద్వారాలు తెరవకూడదని, ఇది గ్రామీణప్రాంతాల్లో ఉపాధికి, ఆహారభద్రతకు సంబంధించిన కీలకమైన విషయమని సుబ్బారావు తెలిపారు. వాణిజ్య సంబంధాల కోసం అవసరమైతే.. ఉభయ ప్రయోజనకారిగా ఉండేలా, ఏవైనా కొన్ని ఉత్పత్తుల్లో పరిమితంగానే విదేశీ పెట్టుబడులను అనుమతించాలన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా ఎదగాలన్న భారత్ లక్ష్యం ముందు మూడు అడ్డంకులు ఉన్నాయని సుబ్బారావు పేర్కొన్నారు. అవి 1. విద్య, వైద్యరంగాల్లో తగినన్ని పెట్టుబడులు పెట్టకపోవటం 2. సంస్కరణల్లో మందగమనం, నైపుణ్యలేమి, అసమగ్ర సరఫరా చెయిన్లు 3. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, తగ్గుతున్న డిమాండ్ అని వివరించారు.

వచ్చే నెలలో ట్రంప్-మోదీ ముఖాముఖీ?

ట్రంప్ సుంకాల బాదుడుతో అమెరికాతో వాణిజ్య సంబంధాల విషయంలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని మోదీ సెప్టెంబరులో న్యూయార్క్‌లో పర్యటించే అవకాశం ఉంది. న్యూయార్క్ వేదికగా సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ(యూఎన్‌జీఏ) వార్షిక ఉన్నతస్థాయి సదస్సులో మోదీ పాల్గొని, ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ట్రంప్‌తో మోదీ ముఖాముఖీ అయ్యే అవకాశం కూడా ఉంది. మరోవైపు, భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ నెల 20, 21 తేదీల్లో రష్యాలో పర్యటించనున్నారు. ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గి లావ్రోవ్‌తో జైశంకర్ చర్చలు జరుపుతారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపాలంటూ భారత వస్తువులపై అమెరికా 50% సుంకాలు విధించిన ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా, భారత్-అమెరికా సంయుక్తంగా సెప్టెంబరు 1 నుంచి 14వ తేదీ వరకు సైనిక విన్యాసాలను నిర్వహించనున్నాయి. సుమారు 400 మంది వరకు ఇండియన్ ఆర్మీ సిబ్బంది ఈ విన్యాసాల్లో పాల్గొననున్నారు. యుద్ధ అభ్యాస్ పేరిట అమెరికాలోని అలస్కాలో ఈ విన్యాసాలు జరుగనున్నాయి. 2004 నుంచి ఏటా ఈ విన్యాసాలను నిర్వహిస్తున్నారు.

ఎఫ్-16ల గురించి

పాక్‌నే అడగండి

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఆగస్టు 13: "భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో కనీసం ఆరు ఫైటర్ జెట్లు కూలిపోయినట్లు మాకు సమాచారం ఉంది" అని ట్రంప్ గతంలో ప్రకటించారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్‌లు, ఒక పెద్ద విమానాన్ని కూల్చేసాం" అని భారత ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఏపీ సింగ్ ఇటీవల వెల్లడించారు. ఈ నేపథ్యంలో.. ట్రంప్ ప్రకటనపై స్పష్టత కోసం ఎన్డీటీవీ అమెరికా స్వేచ్ఛ సమాచార హక్కు చట్టం(ఎఫ్‌వోఐఏ) కింద దరఖాస్తు చేసింది. అయితే, అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ దీనికి సమాధానం ఇవ్వడానికి విముఖత వ్యక్తం చేసింది. పాకిస్థాన్ వాయుసేన వాడే ఎఫ్-16 ఫైటర్ జెట్ల గురించి సమాధానం ఇవ్వబోమని స్పష్టం చేసింది. ఆ వివరాలను పాకిస్థాన్‌నే అడగాలను సూచించింది. అయితే.. 2019 బాలాకోట్ ఉదంతం తర్వాత కూడా పాకిస్థాన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం ఒకటి కూలిపోయిందని వార్తలు రావడంతో అమెరికా వెంటనే స్పందించి.. "అలాంటిదేమి లేదు" అని సమాధానమివ్వడం తెలిసిందే..!

యుద్ధం ఆపకుంటే.. తీవ్ర పరిణామాలు తప్పవు

- రష్యాకు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, ఆగస్టు 13: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపకపోతే రష్యా తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఉక్రెయిన్ యుద్ధం, పుతిన్‌తో శుక్రవారం జరగనున్న భేటీ నేపథ్యంలో.. బుధవారం యూరోపియన్ దేశాల నేతలు, జెలెన్‌స్కీతో ట్రంప్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పుతిన్‌తో మీ భేటీ తర్వాత కూడా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపేందుకు అంగీకరించకపోతే రష్యాపై ఏమైనా చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించగా.. "అవును. ఈ విషయం నేను చెప్పకూడదు. కానీ రష్యా చాలా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ పుతిన్‌తో తన సమావేశం సఫలమైతే.. వెంటనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కూడా కలుపుకొని మరో సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. అదీ వాళ్లిద్దరి మధ్య తాను ఉండాలని వారు కోరుకుంటే ఉంటానని వ్యాఖ్యానించారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్‌లో జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. "ఉక్రెయిన్ మొత్తాన్ని రష్యా ఆక్రమించగలదన్నట్టుగా పుతిన్ బుకాయిస్తున్నారు. ట్రంప్‌తో భేటీకానున్న నేపథ్యంలో ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉన్న వారందరి మీదా ముందుగానే ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అమెరికా, యూరప్ దేశాలు విధించిన ఆంక్షలు రష్యాపై పెద్దగా ప్రభావం చూపడం లేదన్నట్టుగా పుతిన్ వ్యవహరిస్తున్నారు. కానీ ఆంక్షలతో రష్యా ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ తగిలింది" అని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాను సవరించకపోతే ఎలా: సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఓటర్ల జాబితాను మార్చకుండా స్థిరంగా ఉంచడానికి వీలుపడదని, ఎప్పటికప్పుడు సవరించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. లేకపోతే చనిపోయినవారి పేర్లను, వలసదారులు, ఇతర నియోజకవర్గాలకు వెళ్లిన వారి పేర్లను ఎన్నికల కమిషన్ ఎలా తొలగించగలుగుతుందని ప్రశ్నించింది. బిహార్లో ఓటర్ల జాబితాల సవరణ(ఎస్ఐఆర్) ఓటర్లకు అనుకూలంగా, ప్రయోజనకరంగా ఉందని వ్యాఖ్యానించింది. నివాస గుర్తింపు కోసం ఆధార్ కార్డును మినహాయించి.. 11 గుర్తింపు కార్డులు చూపించేందుకు ఈసీ వెసులుబాటు కల్పించడంపై హర్షం వ్యక్తంచేసింది. గతంలో ఏడు డాక్యుమెంట్లనే సూచించిందని గుర్తుచేసింది. బిహార్లో ప్రత్యేక సవరణ.. చట్టానికి లోబడి లేదని, దానిని కొట్టివేయాలన్న వినతితో విభేదించింది. ఆ రాష్ట్రంలో ఎస్ఐఆర్ చేపట్టడాన్ని సవాల్ చేస్తూ ఏడీఆర్, ఆర్జేడీ, కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ కొనసాగించింది. ఓటర్ల జాబితాను సవరించే విచక్షణాధికారాన్ని రాజ్యాంగంలోని 324వ అధికరణ ఎన్నికల కమిషన్‌కు కట్టబెట్టిందని తెలిపింది. "బిహార్‌లో ఈసీ 'విస్తృత' అనే పదాన్ని మాత్రమే అదనంగా చేర్చింది' అని జస్టిస్ బాగ్చీ చెప్పారు. ప్రస్తుత వ్యవహారం రాజ్యాంగ హక్కు, రాజ్యాంగ అధికారానికి మధ్య పోరాటమని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, బెంగాల్లో ఎస్ఐఆర్ చేపట్టడంపై ప్రస్తుతం విచారణ జరపబోమని.. ఆ తర్వాత చేపడతామని ధర్మాసనం స్పష్టంచేసింది. 2026 వరకు సమయం ఉందని, ఇప్పుడు అక్కడ ఏమీ జరుగబోవడం లేదని తెలిపింది. బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్, టీఎంసీ ఎంపీ-న్యాయవాది అయిన కల్యాణ్ బెనర్జీ ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడు ఈ వ్యాఖ్యలు చేసింది.

'ఓటు'పై ఇక పోరుబాటే

'ఓటు చోరీ' ఆందోళనలు మరింత ఉధృతం

- నేడు ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ర్యాలీలు



బుధవారం రాహుల్‌ను కలిసిన ఈ ఏడుగురి పేర్లను ఎన్నికల సంఘం బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. వారు చనిపోయినందువల్లే పేర్లను డిలీట్ చేసినట్లు ప్రకటించింది.

న్యూఢిల్లీ, ఆగస్టు 13 : 'ఓటు చోరీ' ఆందోళనను కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్షాలతో కలిసి దేశవ్యాప్తంగా మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమవుతోంది. దొంగ ఓట్లను ఈసీ అనుమతిస్తుందంటూ ఒక నిమిషం నిడివి గల వీడియోను బుధవారం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. ఆ వీడియోలో ఓ భార్యభర్త ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వస్తారు. ఓ ఇద్దరు వ్యక్తులు అక్కడ వారికి ఎదురుబడి 'మీ ఓట్లు మేం వేసేశాం.. వెళ్లండి.. వెళ్లండి..' అంటూ వారిని పంపించివేస్తారు. వారి వెనుక పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎన్నికల అధికారి టేబుల్‌పై 'ఎలక్షన్ చోరీ ఆయోగ్' అని రాసి ఉంటుంది. ఈ వీడియోను రాహుల్, ఖర్గే, ప్రియాంక షేర్ చేశారు. "మన ఓటును కొల్లగొట్టడం అంటే.. మన అధికారాన్ని కొల్లగొట్టడం.. మన అస్తిత్వాన్ని కొల్లగొట్టడమే..'నని ఈ సందర్భంగా రాహుల్, ప్రియాంక అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరూ 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా గళం విప్పాలని ఖర్గే 'ఎక్స్'లో పిలుపునిచ్చారు. మరోవైపు, ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరిగే బిహార్‌లో ఈనెల 17న 'ఓట్ అధికార్' పేరిట ఇండియా కూటమి పార్టీలు నిరసన ప్రదర్శన జరపనున్నాయి. కాగా, 'ఓటు చోరీ'పై పెద్ద ఎత్తున ప్రచార, అవగాహన, ఉద్యమ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ రూపకల్పన చేసింది. ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఏఐసీసీ ముఖ్యుల భేటీలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 14వ తేదీన ప్రతి జిల్లా కేంద్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఆందోళనా యాత్ర', ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 7వరకు ప్రతి రాష్ట్ర రాజధానిలో 'ఓటు దొంగలారా.. గద్దె దిగండి' పేరిట ప్రదర్శనలు, సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు సంతకాల సేకరణ చేపట్టాలని నిర్ణయించారు.

దొంగే.. దొంగ అన్నట్లుగా!

కాంగ్రెస్ వైఖరి 'దొంగే.. దొంగా అని అరచినట్లుగా' ఉందని బీజేపీ ధ్వజమెత్తింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్(రాయ్‌బరేలీ), ప్రియాంక(వయనాడ్), సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ (కనౌజ్), టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ (డైమండ్ హార్బర్) నియోజకవర్గాల్లో సైతం ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ ఎదురుదాడికి దిగింది. అంతేగాక కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ భారతీయ పౌరసత్వం పొందకముందే ఆమె ఓటు సాధించారని బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. బంగ్లాదేశీ, ఇతర చొరబాటుదారులను ఓటుబ్యాంకుగా చేసుకున్నారని.. దానిని కాపాడుకోవడానికే ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)పై గగ్గోలు పెడుతున్నారని అన్నారు. ఇటలీలో జన్మించిన సోనియాగాంధీ పేరు 1980లో తొలిసారి ఓటర్ల జాబితాలో నమోదైందని.. కానీ అప్పటికి ఆమె భారతీయురాలు కాదని.. 1983లో ఆమెకు భారతీయ పౌరసత్వం లభించిందని ఠాకూర్ తెలిపారు. 'ప్రజల నుంచి పెద్దఎత్తున విమర్శలు రావడంతో 1982లో ఆమె పేరు తొలగించారు. తిరిగి 1983లో ఓటర్ల జాబితాలో నమోదుచేశారు. అప్పుడు కూడా తప్పుడు నమోదు జరిగింది. ఆ ఏడాది జనవరి 1లోపు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా.. ఏప్రిల్ 30న ఆమెకు భారతీయ పౌరసత్వం లభించింది. ఆమె ఓటు నమోదు అత్యంత ఎన్నికల అక్రమమా కాదా' అని ప్రశ్నించారు.

రాహుల్‌తో టీ తాగిన 'మృత ఓటర్లు'!

న్యూఢిల్లీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 'నాకు జీవితంలో ఎన్నో ఆసక్తికర అనుభవాలు ఉన్నాయి. కానీ.. ఎప్పుడూ 'మరణించినవారి'తో కలిసి టీ తాగలేదు. ఇప్పుడు ఈ ప్రత్యేక అనుభవానికి కారణమైన ఎన్నికల కమిషన్‌కు కృతజ్ఞతలు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ చనిపోయారని ప్రకటించి ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఏడుగురు వ్యక్తులతో కలిసి టీ తాగుతూ ముచ్చటించిన వీడియోను రాహుల్ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తాము ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ రాఘోపూర్ నియోజకవర్గానికి చెందిన వారమని వారు రాహుల్‌కు తెలిపారు. తమలాంటి ఓటర్లు ఇంకా చాలామంది ఉన్నారని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65లక్షల పేర్ల ముసాయిదా జాబితాను చూసి అవాక్కయ్యామని, తాము చనిపోయామంటూ పేర్లు తీసేసినట్లు గుర్తించామని తెలిపారు.

క్రోమ్‌ను అమ్మేయండి.. కొంటాం!

- గూగుల్‌కు పర్‌ప్లెక్సిటీ ఏఐ సంస్థ ఆఫర్
- భారత సంతతికి చెందిన అరవింద్ శ్రీనివాస్ స్థాపించిన కంపెనీ పర్‌ప్లెక్సిటీ
- మూడేళ్లలోనే రూ.1.57 లక్షల కోట్ల విలువైన కంపెనీగా ఎదుగుదల

న్యూయార్క్, ఆగస్టు 13: ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వినియోగాన్ని ఏలుతున్న క్రోమ్ బ్రౌజర్‌ను తమకు అమ్మేయాలని గూగుల్‌కు పర్‌ప్లెక్సిటీ కృత్రిమ మేధ సంస్థ ప్రతిపాదన చేసింది. భారత సంతతికి చెందిన అరవింద్ శ్రీనివాస్ స్థాపించిన పర్‌ప్లెక్సిటీ విలువ సుమారు రూ.1.57 లక్షల కోట్లు (18 బిలియన్ డాలర్లు)కాగా.. క్రోమ్‌ను రూ.3 లక్షల కోట్ల (34.5 బిలియన్ డాలర్లు)కు కొంటామని ఆఫర్ చేసింది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక, పెట్టుబడి సంస్థలు ఈ మేరకు తమకు నిధులు సమకూర్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయని పర్‌ప్లెక్సిటీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ దిమిత్రి షెవెలెంకో వెల్లడించారు. అక్రమ పద్ధతుల్లో సెర్చింజన్ మార్కెట్‌పై గూగుల్ ఏకచ్ఛత్రాధిపత్యం సాధించిందని గతంలోనే అమెరికాలోని డిస్ట్రిక్ట్ కోర్టు నిర్ధారించింది. గూగుల్ సంస్థలోని సెర్చింజన్, బ్రౌజర్ ఇతర విభాగాలను వేర్వేరు కంపెనీలుగా విడదీయడంతోపాటు భారీ జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తుది తీర్పు ఇంకా వెల్లడించాల్సి ఉంది. అయితే ఈ సమస్యకు పరిష్కారంగా క్రోమ్‌ను పూర్తిగా విక్రయించాలని గూగుల్‌కు అమెరికా న్యాయశాఖ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే పర్‌ప్లెక్సిటీ ప్రతిపాదన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ అంశంలో నెలకొన్న తీవ్ర పోటీ నేపథ్యంలో క్రోమ్‌ను కొనుగోలు చేస్తే.. వందల కోట్ల మందికి దగ్గరై, ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చేందుకు పర్‌ప్లెక్సిటీ సంస్థకు అవకాశం చిక్కుతుంది. కృత్రిమ మేధ రంగంలో సంచలనం సృష్టించిన చాట్‌జీపీటీ ఏఐని రూపొందించిన ఓపెన్ ఏఐ సంస్థ కూడా గతంలో క్రోమ్ కొనుగోలు దిశగా ప్రయత్నం చేశాయి.

300 కోట్ల మందికిపైగా క్రోమ్ యూజర్లు..



అరవింద్ శ్రీనివాస్

ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ బ్రౌజర్లలో క్రోమ్‌దే ఆధిపత్యం. మొత్తంగా 300 కోట్ల మందికిపైనే క్రోమ్‌ను వినియోగిస్తారు. ప్రపంచ ఇంటర్నెట్ వినియోగదారుల్లో ఇది 65 శాతం. వాస్తవంగా చెప్పాలంటే చైనాలో మొత్తంగా ఆ దేశానికి చెందిన బైదు బ్రౌజర్, సెర్చింజన్‌లను వినియోగిస్తారు. అంటే చైనాను మినహాయించి చూస్తే.. ప్రపంచంలో 80 శాతం మంది వరకు క్రోమ్‌ను వాడుతున్నట్టే. ఇక ప్రపంచ సెర్చింజన్ మార్కెట్లో 90శాతాన్ని గుప్పిట పట్టిన గూగుల్ సంస్థకు ఒక రకంగా క్రోమ్ ప్రాణం లాంటిది. వినియోగదారులు సందర్శించే వెబ్‌సైట్లు, వెతికే అంశాలు, వారి ధోరణి, అవసరాలను క్రోమ్ బ్రౌజర్ ట్రాక్ చేస్తుంది. ఈ డేటా ఆధారంగానే వెబ్‌సైట్లలో గూగుల్ ప్రకటనలు (యాడ్స్), సెర్చింజన్‌లో ఫలితాలు కనిపిస్తుంటాయి. గూగుల్ ఆ ప్రకటనల ద్వారా ఏటా సుమారు రూ.26లక్షల కోట్లు (300 బిలియన్ డాలర్లు) ఆర్జిస్తుంది.

మూడేళ్లలోనే




తమిళనాడులోని చెన్నైకి చెందిన అరవింద్ శ్రీనివాస్.. 2017లో మద్రాస్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. కానీ మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ (ఏఐ)పై ఇష్టంతో కంప్యూటర్ సైన్స్ కోర్సులో భాగమైన పైథాన్, ఇతర సాఫ్ట్‌వేర్లపై పట్టు సాధించారు. 2022లో మరో ముగ్గురితో కలసి పర్‌ప్లెక్సిటీ ఏఐ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ అభివృద్ధి చేసిన కృత్రిమ మేధ ప్రోగ్రామ్ సంచలనాలు సృష్టించి.. చాట్‌జీపీటీకి పోటీగా నిలిచింది. మూడేళ్లలోనే పర్‌ప్లెక్సిటీ ఏఐ కంపెనీ విలువ రూ.1.57 లక్షల కోట్ల (18 బిలియన్ డాలర్ల)కు చేరింది.

ఫాస్టాగ్ వార్షిక పాస్ ప్రీ బుకింగ్ ప్రారంభం!

» రూ.3 వేలతో రాజ్‌మార్గ్‌యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చు

» నేటి అర్ధరాత్రి నుంచే పాస్ యాక్టివేషన్

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఫాస్టాగ్ వార్షిక పాస్ ప్రీ బుకింగ్‌ను మంగళవారం అర్ధరాత్రి నుంచే భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రారంభించింది. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ వెబ్‌సైట్ ద్వారా రూ.3 వేలు చెల్లించి ఈ పాస్ ప్రీ బుకింగ్ చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఈ వార్షిక పాస్‌ను ఈ నెల 15వ తేదీ నుంచి అమల్లోకి తెస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గురువారం అర్ధరాత్రి నుంచే వార్షిక పాస్ యాక్టివేషన్స్ మొదలవనున్నాయి. యాక్టివేషన్ అయిన తర్వాత నుంచి ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు ఈ వార్షిక పాస్ చెల్లుబాటవుతుంది. ఆ తర్వాత మళ్లీ రీచార్జ్ చేసుకోవాలి. ఒకవేళ చేసుకోకపోతే సాధారణ ఫాస్టాగ్ తరహాలోనే చెల్లింపులు జరుగుతాయి. వాహనం రిజిస్ట్రేషన్ నంబర్‌తో వార్షిక పాస్ తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాగే కేవలం జాతీయ రహదారులపైనే ఈ వార్షిక పాస్ చెల్లుతుంది. అంటే నేషనల్ హైవే (ఎన్‌హెచ్)లు, నేషనల్ ఎక్స్‌ప్రెస్‌వే (ఎన్‌ఈ)లపైన మాత్రమే.. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని హైవేలపై ఇది వర్తించదు. అక్కడి టోల్‌ప్లాజాల కోసం కచ్చితంగా ఫాస్టాగ్‌లో నగదును ఉంచుకోవాలి. ఈ వార్షిక పాస్ వాణిజ్య వాహనాలకు వర్తించదు.



రాజ్‌మార్గ్‌యాత్ర యాప్‌లో అందుబాటులోకి వచ్చిన ప్రీ బుకింగ్

తప్పనిసరి కాదు..

ఎక్కువ ప్రయాణాలు చేసేవారికి ఈ వార్షిక పాస్ విధానం ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇది తప్పనిసరి కాదని.. ప్రయాణాలు, వాటికి చెల్లిస్తున్న టోల్ చార్జీలను బేరీజు వేసుకుని కూడా తీసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇక ప్రతి టోల్ ప్లాజాకు ఒక ట్రిప్పుగా లెక్కిస్తారు. ఒకవేళ క్లోజ్డ్ టోల్ ప్లాజాలుంటే.. రెండు ట్రిప్పులకు కలిపి ఒకటిగా లెక్కిస్తారు. రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ప్రయాణించే మార్గంలో ఉన్న జాతీయ రహదారుల వివరాలు తెలుస్తాయి. యాప్ లో టోల్ ప్లాజాలున్న ప్రాంతాలు, అక్కడ ఎంత చార్జీ ఉందనే వివరాలున్నాయి. అలాగే వార్షిక పాస్‌తో తిరిగిన ట్రిప్పుల వివరాలు కూడా కనిపిస్తాయి. నమోదు చేసుకున్న ఫోన్ నంబరుకు టోల్‌ప్లాజా దాటిన ప్రతి సారి సందేశాల రూపంలో సమాచారం వస్తుంది.

20 నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఐసెట్ కౌన్సెలింగ్ ప్రణాళికను తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఈనెల 20 నుంచి మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండగా, సెప్టెంబరు 2న జాబితా ప్రకటిస్తారు. అలాగే రెండో విడత కౌన్సెలింగ్ సెప్టెంబరు 8న ప్రారంభం కానుంది. అదేనెల 15న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు.

20 నుంచి గ్రూప్-2 ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 రెండో విడత ధ్రువపత్రాల పరిశీలన తేదీలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం విడుదల చేసింది. ఈనెల 20 నుంచి 23 వరకు తెలుగు విశ్వవిద్యాలయంలో పరిశీలన ఉంటుందని టీజీపీఎస్సీ కార్యదర్శి ప్రియాంక ఆలా తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్లో పెట్టామన్నారు. అలాగే, అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను ఈనెల 18 నుంచి 25 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఇవ్వాలని ఆమె బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఎస్‌వోటీ పోలీసుల అదుపులో 'ఖజానా' దొంగలు!

» బైక్‌లపై పారిపోతుండగా వెంటాడి అరెస్టు

» రహస్యంగా విచారణ.. ఉత్తరాది ముఠాగా గుర్తింపు

హైదరాబాద్ సిటీ/చందానగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): చందానగర్ ఖజానా జువెలరీ దుకాణంలో కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దుకాణంలో అసిస్టెంట్ మేనేజర్‌పై కాల్పులు జరిపి 10 కేజీల వెండిని దోచుకొని బైక్‌లపై బీదర్ వైపు పారిపోతున్న దొంగల ముఠాను ఎస్‌వోటి పోలీసులు వెంటాడి గంటల వ్యవధిలోనే పట్టుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు సమాచారం. వీరిది ఉత్తరాది ముఠాగా గుర్తించారు. నగరంలో ఉంటున్న వారి సహకారంతోనే ఈ దోపిడీకి పథకం రచించినట్లు తెలుస్తోంది. దొంగలు వినియోగించిన బైక్‌లనుఎక్కడో చోరీ చేసినట్లుగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. మొత్తం మీద సీసీటీవీ కెమెరాల్లో రికార్డయిన సాంకేతిక ఆధారాల ద్వారా సైబరాబాద్ ఎస్‌వోటి పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దొంగల ముఠాను పట్టుకున్నట్లు తెలిసింది. ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, సొత్తు రికవరీ చేసినట్లు సమాచారం.

బాలికపై లైంగిక దాడికి, వివాహానికి యత్నం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కారాగారం

» నల్లగొండ జిల్లా న్యాయస్థానం తీర్పు

నల్లగొండ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తాను వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ కుమార్తె(మైనర్)ను బలవంతంగా వివాహం చేసుకునేందుకు, ఆమెపై లైంగికదాడికి యత్నించిన కేసులో ప్రధాన నిందితుడు గ్యారాల శివకుమార్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.40వేల జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా న్యాయస్థానం తీర్పునిచ్చింది. బుధవారం జడ్జి రోజారమణి ఈ తీర్పు ప్రకటించారు. ఈ కేసులో మంగళవారమే తీర్పు ఇవ్వాల్సిఉండగా... నిందితుడు కోర్టు నుంచి పారిపోయాడు. దీంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి బుధవారం పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపర్చడంతో తీర్పు వెలువరించారు. నల్లగొండకు చెందిన శివకుమార్ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమె కుమార్తె అయిన బాధిత బాలికను పెళ్లి చేసుకునేందుకు యత్నించాడు. బాలిక తల్లి సహకారంతో లైంగిక దాడికి యత్నించి శారీరకంగా దాడి చేశాడు. అయితే నిందితుడు శివకుమార్ మంగళవారం కోర్టు నుంచి పారిపోవడంతో రెండో నిందితురాలైన బాలిక తల్లికి 20ఏళ్ల జైలుశిక్ష విధించి శివకుమార్‌కు శిక్షను కోర్టు రిజర్వ్ చేసింది. బుధవారం అతనికి న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారు.

పాకిస్థాన్ బెదిరింపులకు భయపడేది లేదు

» మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ బెదిరింపులకు భయపడేది లేదని, మా వద్ద బ్రహ్మోస్ క్షిపణులు ఉన్నాయని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. సింధు జలాల అంశంపై పాకిస్థాన్ ప్రధాని వ్యాఖ్యలపై అసదుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో స్పందించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇలాంటి బెదిరింపులకు భారత్ లొంగదని స్పష్టంచేశారు. తాను బిహార్ ప్రత్యేక ఓట్ల తనిఖీ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'(ఎస్ఐఆర్) గురించి ఆందోళన చెందుతున్నట్టు పేర్కొన్నారు. ముస్లింలు, దళితులు నిరుపేదలని.. ఓటర్ల జాబితాలో వారి పేర్లు చేర్చని పక్షంలో తర్వాత వారు దేశ పౌరులు కాదని, దేశం విడిచి పోవాలనే ఆదేశాలు రావచ్చన్నారు. ఆగస్టు 15న మాంసం దుకాణాలను మూసివేయాలనే ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమని, స్వాతంత్ర్య దినం జరుపుకోవడానికి మాంసం తినడానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు.

ఆర్ఎస్ ప్రవీణ్ అనవసర ఆరోపణలు మానుకోవాలి

» మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాలు, అంగన్‌వాడీలు, హాస్టళ్లకు కోడిగుడ్ల సరఫరా టెండర్లలో కాంగ్రెస్ నేతలు 600 కోట్ల రూపాయల కుంభకోణానికి తెర లేపారంటూ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న అనవసర ఆరోపణలు మానుకోవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాలలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడా కాంట్రాక్టర్ల కోసమే రాష్ట్ర ప్రభుత్వం జీవో 17 జారీ చేసిందని ప్రవీణ్ కుమార్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బిల్లుల చెల్లింపులు లేకుండానే 600 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

నీరుకుల్ల చెక్‌డ్యామ్‌కు 35.54 కోట్ల నిధులు

» సవరణ అంచనాలకు నీటిపారుదల శాఖ ఆమోదం


హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామం వద్ద మానేరు వాగుపై నిర్మించనున్న చెక్‌డ్యామ్ కోసం, సవరించిన అంచనాలకు నీటిపారుదల శాఖ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఇప్పుడు రూ. 35.54 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం జీవో జారీ చేశారు. ఈ చెక్ డ్యామ్ నిర్మాణం వల్ల నీరుకుల్ల గ్రామం చుట్టు పక్కల ప్రాంతాలకు ప్రయోజనం చేకూరనుంది.

ఏటీసీలతో విప్లవాత్మక మార్పులు

ఏటా 65 ఐటీఐలలో 10వేల మందికి శిక్షణ.. 1.2 లక్షల మందికి 3, 6 నెలల డిప్లొమా కోర్సులు

» శిక్షణ అయ్యాక విదేశీ ఉద్యోగాలకూ పంపిస్తున్నాం

» 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో.. కార్మిక, ఉపాధి కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ వెల్లడి



[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఐటీఐల్లో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) రాష్ట్ర అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తేనున్నాయని.. రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అన్నారు. గత ఐదు దశాబ్దాలతో పోలిస్తే ఇప్పుడు టెక్నాలజీ పూర్తిగా మారిపోయిందని.. అన్ని రంగాల్లోనూ మార్పులు వచ్చాయని.. ఇప్పుడున్న పారిశ్రామిక అవసరాలకు తగ్గ పరిజ్ఞానాలను యువతకు నేర్పితేనే వారికి ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఆ లక్ష్యంతోనే ఐటీఐల్లో ఏటీసీల ప్రారంభించినట్టు వెల్లడించారు. "ఇవి సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనతో రూపుదిద్దుకున్నాయి." అని దానకిశోర్ వివరించారు. ఏటీసీలతో పాటు ఐటీఐల ద్వారా అందించే నైపుణ్య శిక్షణ గురించి ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వివరించారు. అందులో కొన్ని ముఖ్యాంశాలు..

ఏటీసీల ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి?

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 200 బిలియన్ డాలర్లుగా ఉంది. దీనిని 2035 నాటికి ట్రిలియన్ డాలర్లకు పెంచాలన్నది సీఎం ఆలోచన. ఈమేరకు అన్ని శాఖలకూ ఆయన దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఆదాయం పెరగాలంటే నైపుణ్యం ఉన్న మానవ వనరులు ఎంతో కీలకం. అందుకే స్కిల్స్ యునివర్సిటీ ఏర్పాటుచేశారు. ఐటీఐల్లోని విద్యార్థులకు ఏటీసీల ద్వారా శిక్షణ ఇస్తున్నాం. వీటిని మొత్తం మూడు విడతల్లో నెలకొల్పుతున్నాం. నిరుడు 25 ఐటీఐలలో ఏటీసీలు ప్రారంభించగా, ఈ ఏడాది 40 మొదలుపెట్టాం. వచ్చే ఏడాది మరో 46 కేంద్రాల్లో ఏర్పాటుచేయబోతున్నాం. మిగతావి మూడో విడతలో ఏర్పాటు చేస్తాం. మొత్తం 113 కేంద్రాల్లో ఏటీసీలు ఉంటాయి. జీనోమ్‌వ్యాలీలోనూ ఒక ఏటీసీ ఏర్పాటుచేయబోతున్నాం. అలాగే.. అన్ని ఐటిఐలను ఆధునీకరిస్తున్నాం. 5వేల కోట్లతో కొత్త యంత్రాలు ఏర్పాటు చేశాం. అన్ని ప్రభుత్వ ఐటీఐలలో సౌర విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటుచేస్తున్నాం.

టాటా టెక్నాలజీస్ పాత్ర ఏమిటి.?

నైపుణ్య శిక్షణపై ఆసక్తితో.. వారు ముఖ్యమంత్రితో చర్చలు జరిపారు. ఇప్పుడు వారు ఒక్కో కేంద్రంలో ఆరు రకాల ట్రేడ్‌లలో దాదాపు రూ.35 కోట్లతో అత్యాధునిక యంత్రాలు, సామాగ్రిని ఏర్పాటుచేస్తున్నారు. యంత్రాల ఏర్పాటుకు అవసరమైన భవనాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. శిక్షకులను ఏర్పాటుచేస్తోంది.

కోర్సు పూర్తయ్యాక ఎలాంటి అవకాశాలు ఉంటాయి?

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ లాంటి కోర్సులకు ఐటీఐల్లో మంచి డిమాండ్ ఉంది. ఇది పూర్తయినవారికి ఉద్యోగాలు సిద్ధంగా ఉంటున్నాయి. ఇటీవలే ఏడాది కోర్సు పూర్తిచేసుకున్న మల్లెపల్లి ఐటీఐ విద్యార్థుల్లో 80% మందికి ఉద్యోగాలు వచ్చాయి. అలాగే ఏటీసీల శిక్షణతో 52 మంది.. నెలకు రూ.లక్ష దాకా సంపాదిస్తున్నారు. సొంత వ్యాపారాలు విజయవంతంగా నిర్వహిస్తున్నవారూ ఉన్నారు.

ప్రవేశం ఎలా?

పదోతరగతి అర్హతతో 22 సంవత్సరాల్లోపున్న వారు ఎవరైనా ఇందులో చేరవచ్చు. నిరుడు 98% సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ 25శాతం ప్రవేశాలు పూర్తయాయి. ప్రవేశాలకు ఇంకా 20 రోజుల గడువు ఉంది.

ఏటీసీల ఏర్పాటుతో ఐటీఐలకు ఏమైనా నష్టం జరుగుతుందా?

అలాంటి అవకాశమే లేదు. ఉదాహరణకు ఐటీఐలలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్ కోర్సు ఉంది. విద్యుత్ ఉన్నంతవరకూ దానికి డిమాండ్ ఉంటుంది. అలాగే 31 ట్రేడ్‌లు ఐటీఐలలో ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి సీట్ల పెంపు, తగ్గింపు ఉంటుంది. కాలానుగుణంగా కొత్త కోర్సులనూ ప్రారంభిస్తున్నాం. ఐటీఐలు మరుగున పడిపోయే అవకాశమే ఉండదు. ప్రస్తుతం 65 ఏటీసీ సెంటర్లలో 10వేల మందికి శిక్షణ అందిస్తున్నాం. ఏటీసీలతో ప్రభుత్వ ఐటీఐలలో కొత్తగా రోబోటిక్స్ లాంటి అనేక కొత్త యంత్రాలు వచ్చాయి. ఇలాంటివి ఇప్పుడున్న ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ లేవు. ఇందులో శిక్షణ పొందితే మన యువతకు ఉపాధి అవకాశాలు చాలా పెరుగుతాయి. పదోతరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఏటీసీల్లో శిక్షణ ఇస్తున్నాం. మహిళలనూ ప్రోత్సహిస్తున్నాం. ఏటీసీల్లో ఏడాది వ్యవధిగల కోర్సులు మూడు, రెండేళ్ల వ్యవధిగల కోర్సులు మూడు ఉన్నాయి. వీటిలో ఏటా 10వేల మందిని తీసుకుంటున్నాం. ఇందులో ప్రవేశాలకు ఆగస్టు 25వరకు అవకాశం ఉంది. అలాగే నెల, 3, 6 నెలల వ్యవధిగల 23 స్వల్పకాలిక కోర్సులను అందించబోతున్నాం. వాటిలో ఏటా 1.2 లక్షల మందికి శిక్షణ ఇవ్వబోతున్నాం. కోర్సు పూర్తయిన తర్వాత ప్రభుత్వం సర్టిఫికెట్లు ఇస్తుంది. అలాగే టి-గేట్ అనే కార్యక్రమంలో భాగంగా ఐటీఐల విద్యార్థులకు పారిశ్రామిక నిపుణులతో శిక్షణ కూడా ఇప్పిస్తున్నాం.

యువతకు మీరిచ్చే సందేశం..

రాష్ట్రంలో విస్తృతంగా అవకాశాలున్నాయి. ద్వితీయశ్రేణి నగరాల్లోనూ అనేక కంపెనీలు వస్తున్నాయి. అలాగే.. ఐటీఐ కోర్సు పూర్తిచేసుకున్నవారిని జర్మనీ, జపాన్, అమెరికా లాంటి దేశాలకు పంపిస్తున్నాం. ప్రభుత్వం ఇన్ని అవకాశాలు కల్పిస్తున్నప్పుడు వాటిని వినియోగించుకోకపోతే అది యువతకే కాదు రాష్ట్రానికీ తీరని నష్టం. కాబట్టి.. అందుబాటులో ఉన్న అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి.

యువతిపై 10 మంది సామూహిక అత్యాచారం

» ప్రేమ, స్నేహం పేరుతో వల వేసి అఘాయిత్యం

» జనగామలో అమానుషం.. నిందితుల అరెస్టు

జనగామ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, స్నేహం పేరుతో యువతి (18)ని నమ్మించి పలువురు యువకులు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతికి అదే పట్టణానికి చెందిన మహమ్మద్ ఒవైసీ అనే యువకుడు ప్రేమ పేరుతో దగ్గరై శారీరకంగా వాడుకున్నాడు. ఈ క్రమంలో ఒవైసీ సహకారంతో అతడి స్నేహితులైన జనగామకు చెందిన ముత్యాల పవన్‌కుమార్, బొద్దుల శివకుమార్, అబ్దుల్ ఖయ్యూం, పుస్తకాల సాయితేజ, ముత్తడి సుమంత్‌రెడ్డి, గుండ సాయిచరణ్‌రెడ్డి, ఓరుగంటి సాయిరాం, నెల్లుట్లకు చెందిన నూకల రవి, పసరమడ్లకు చెందిన జెట్టి సంజయ్ స్నేహం పేరుతో యువతికి దగ్గరయ్యారు. ఈ ఏడాది జూన్‌లో మాట్లాడుకుందామని యువతిని ఒవైసీ అతని స్నేహితులు బయటకు పిలిపించారు. అనంతరం ఆమెను కారులో ఎక్కించుకొని జనగామలోనే ఓ గదికి తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి ఒడిగట్టారు. భయపడిన యువతి విషయం బయటకు చెప్పలేదు. అనంతరం వారిలో ఓ యువకుడు యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించి గోవా తీసుకెళ్లి అక్క డ కూడా ఆమెను శారీరకంగా వాడుకున్నాడు. జనగామకు తిరిగొచ్చాక బాధితురాలు తన చిన్నమ్మ సాయంతో ఇటీవల పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు విచారించి బాధితురాలిపై 10 మంది యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారించారు. బుధవారం జనగామలో వారందరినీ అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 3 సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. యువతికి తల్లిదండ్రులు లేకపోవడంతో చిరు వ్యాపారం చేసే చిన్నమ్మ సంరక్షణలో ఉంటోంది. కాగా, ప్రధాన నిందితుడు ఒవైసీ జనగామలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్టు తెలిసింది. నిందితులందరూ అవివాహితులే.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వాతావరణ న్యాయం

వాతావరణ మార్పును అన్ని దేశాలూ తమ శక్తి మేరకు ఎదుర్కోవాలని 15 మంది న్యాయమూర్తుల అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) ఏకగ్రీవంగా ఇటీవల సలహాపూర్వక అభిప్రాయాన్ని ప్రకటించింది. వాతావరణ మార్పు నిరోధక చర్య అంతర్జాతీయ న్యాయ నియమాలకు నిబద్ధమై ఉండే చట్టపరమైన విధి అని ఐసిజె స్పష్టం చేసింది. వాతావరణ మార్పు కారణాలు, ప్రభావాలను అర్థం చేసుకోవడానికి ఐపీసీసీ అంచనాలు ప్రమాణమయినట్టుగానే వాతావరణ మార్పు వైపరీత్యాలను అదుపుచేయడంలో ప్రపంచ దేశాల కార్యాచరణ లేదా క్రియాశూన్యతను అంచనా వేసేందుకు తన సలహాపూర్వక అభిప్రాయం ఒక స్పష్టమైన ప్రాతిపదిక అని ఐసిజె నిర్దేశించింది. పారిస్ ఒప్పందం ప్రకారం భూతాపాన్ని పారిశ్రామిక యుగ పూర్వ స్థాయిల కంటే 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్‌కు తగ్గించాలనే లక్ష్యం చట్టబద్ధమైనదని అంతర్జాతీయ న్యాయస్థానం ధ్రువీకరించింది. ఈ ఏడాది తొలినాళ్లలో అమెరికా ఆ ఒప్పందం నుంచి వైదొలిగింది. అయినప్పటికీ అమెరికా తాను భాగస్వామిగా ఉన్న ఇతర అంతర్జాతీయ ఒడంబడికల ప్రకారం తమ వల్ల పర్యావరణానికి జరుగుతున్న హానికి బాధ్యత వహించాల్సిందేనని ఐసిజె స్పష్టం చేసింది. మానవ కార్యకలాపాల మూలంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, సంభవిస్తున్న విపరీత వాతావరణ సంఘటనలు జీవ వైవిధ్యాన్ని హరించివేస్తూ మానవుడితో సహా సకల జీవకోటి అస్తిత్వానికి ఎనలేని హాని కలిగిస్తున్నాయని ఐసిజె పేర్కొంది. హరిత గృహ వాయు ఉద్గారాల కారణంగా తీవ్రమవుతున్న భూతాపం నుంచి ధరిత్రి వాతావరణ వ్యవస్థలను, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సకల దేశాల బాధ్యత అని నొక్కి చెప్పింది. వాతావరణ మార్పుపై అంతర్జాతీయ న్యాయస్థాన ఏకగ్రీవ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా విధాన నిర్ణేతలలోను, పర్యావరణ పరిరక్షణ స్ఫూర్తి ఉన్న సామాన్య విద్యావంతులలోను ప్రధాన చర్చనీయాంశమయింది.

ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థల అభ్యర్థన మేరకు నిర్దిష్ట విషయాలపై సలహాపూర్వక అభిప్రాయాన్ని ప్రకటించడం ఐసిజెకు పరిపాటి. ఈ సలహాకు ఏ దేశమూ కట్టుబడి ఉండవల్సిన అవసరం లేదు అయితే అంతర్జాతీయ చట్టం కింద ఒక నిర్దిష్ట సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టాలనే దాన్ని ఈ సలహాపూరిత అభిప్రాయం ప్రతిబింబిస్తుంది. కట్టుబడి ఉండవల్సిన అవసరం లేనప్పటికీ ఐసిజె సలహాకు శాసనిక మాన్యత, నైతిక అధికారం ఉన్నాయనే వాస్తవం విస్మరింపలేనిది. వాతావరణ మార్పు సమస్య పరిష్కారానికి జాతీయ ప్రభుత్వాలు చట్టబద్ధంగా చేపట్టవలసిన చర్యలేమిటి? ఆ విధులను అవి నిర్వర్తించకపోతే పర్యవసానాలు ఏమిటి అని ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ నివేదించిన ప్రశ్నలకు ప్రతిస్పందనగా ఐసిజె పై సలహాపూర్వక అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ప్రతి వ్యక్తీ మానవ హక్కులను సంపూర్ణంగా పొందేందుకు నిర్మలమైన, ఆరోగ్యకరమైన, సుస్థిర పర్యావరణం తప్పనిసరి అని, ఈ దృష్ట్యా వాతావరణ వ్యవస్థలు, ఇతర పర్యావరణ విభాగాలను పరిరక్షించకుండా ప్రతి వ్యక్తికీ మానవ హక్కులు సమకూరేలా చేయడం అసాధ్యమవుతుందని ఐసిజె స్పష్టం చేసింది. పర్యావరణ వ్యవస్థలను కేవలం 'వనరులు'గా కాకుండా వాతావరణ భాగస్వాములుగా గుర్తించాలని ఆదేశిస్తూ వాతావరణ మార్పుకు శాశ్వత, సంతృప్తికర పరిష్కారానికి మానవ సంకల్పం, విజ్ఞత అవసరమని ఐసిజె తన తీర్పును కవితాత్మకంగా ముగించింది.

మానవాళి ఉమ్మడి భవిష్యత్తుకు భద్రత సమకూర్చడానికి ఉద్దేశించిన ఈ దార్శనిక న్యాయ నిర్ణయం 2019లో పసిఫిక్ దీవి దేశమైన వనువాటులో 27 మంది న్యాయశాస్త్ర విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమ విజయం. వాతావరణ మార్పు దుష్ప్రభావాలకు తీవ్రంగా ప్రభావితమవుతున్న వనువాటు విజ్ఞప్తి మేరకు ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఐసిజె అభిప్రాయాన్ని కోరింది. పాశ్చాత్య దేశాలు అంతకంతకూ వాతావరణ వ్యతిరేక వైఖరి వహిస్తున్న తరుణంలో వెలువడిన ఈ అభిప్రాయం 'ధరిత్రి' విజయంగా భావిస్తున్నారు. 'సమస్త వాతావరణ మార్పు నిరోధక విధానాలకు పారిస్ ఒప్పందం లక్ష్యాలే ప్రాతిపాదిక కావాలన్న విషయాన్ని ఐసిజె తీర్పు ధ్రువీకరించింది. ఇది మన ధరిత్రికి, వాతావరణ న్యాయానికి, ప్రపంచ పరిస్థితులను మార్చడంలో యువజనుల శక్తి సామర్థ్యాలకు మహా విజయమని' ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటానియో గుటెర్స్ ప్రశంసించారు. 'ప్రపంచం ప్రతిస్పందించాలి' అని ఆయన పిలుపునిచ్చారు. మరి వనువాటు విద్యార్థుల ఉద్యమం మన విద్యార్థి, యువజన సంఘాలు, ముఖ్యంగా యువ న్యాయవాదులకు స్ఫూర్తి కావాలని అందరమూ కోరుకోవాలి.

కాషాయంపై పడిన మచ్చ తొలగింది!

పదిహేడు సంవత్సరాల అనంతరం దేశంలోని వందకోట్లకు పైగా హిందువులపై పడ్డ అతి పెద్ద మచ్చ తొలగిపోయింది. ఆ మచ్చ పేరు 'భగవా ఆతంక్‌వాద్/ కాషాయ ఉగ్రవాదం/ హిందూ తీవ్రవాదం'. మహారాష్ట్రలోని మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో ఎన్ఐఏ స్పెషల్ కోర్టు సాధ్వీ ప్రగ్యాసింగ్ ఠాకూర్, కల్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్‌తో సహా మొత్తం ఏడుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. హిందూ జీవన విధానాన్ని అవలంబించేవారు ధర్మం కోసం తీవ్రవాదులుగా మారే అవకాశం లేదనీ, హిందూ ధర్మ బోధనల్లో ప్రతీకారానికీ, మారణహోమానికీ అవకాశమే లేదని ఈ కోర్టు తీర్పు ద్వారా యావత్ ప్రపంచానికి మరోసారి స్పష్టమైంది.

మతం పేరుతో హిందువు ఏనాడు ఉగ్రవాది కాడు, కాలేడు. కానీ యూపీఏ సర్కారును నడిపించిన సోనియాగాంధీ కుటుంబం ఒక వర్గాన్ని సంతోషపెట్టడం కోసం దేశంలోని వంద కోట్ల హిందువులను బద్నాం చేసింది. భారతదేశంలో ఇస్లామిక్ టెర్రరిస్టుల మారణహోమాలకు ఆ వర్గానికి చెందినవాళ్లనే అరెస్ట్ చేస్తూ పోతే మైనార్టీలు నొచ్చుకుంటారని భావించి, ఆ నేరాన్ని దేశంలో మెజార్టీ వర్గమైన హిందువులపై నెట్టాలన్న ప్రయత్నంలో భాగంగానే 'భగవా ఆతంక్‌వాద్' అనే కల్పిత కథనాన్ని రచించి ప్రచారంలో పెట్టింది. అందులో భాగంగానే 29 సెప్టెంబర్ 2008 నాడు మహారాష్ట్రలోని మాలేగావ్ మార్కెట్‌లో జరిగిన బాంబ్ బ్లాస్ట్ వెనుక ఉన్నది 'హిందూ తీవ్రవాదం' అని నాటి ప్రభుత్వం ప్రకటించింది. ఆనాడు కేంద్రంలోనూ మహారాష్ట్రలోనూ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వమే ఉంది.



2008లో మాలేగావ్ బాంబు పేలుళ్ల తర్వాత, 'సాఫ్రన్ టెర్రర్' అనే పదాన్ని ఇంగ్లిష్‌లోను, 'భగవా ఆతంక్‌వాద్' అనే పదాన్ని హిందీలోను తొలిసారి వాడారు. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వ నాయకులు 'కాషాయ టెర్రరిజం' అనే ఓ నేరేటివ్‌ను ప్రజల ముందుకు తీసుకురావడం మొదలుపెట్టారు. దీని ద్వారా– అంతర్గత భద్రత విషయంలో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవటమేగాక, మైనారిటీ ఓటు బ్యాంకును సంతృప్తిపరచి ఓట్లు కొట్టేయవచ్చునని కాంగ్రెస్ భావించింది.

సాధారణ హిందువులను ఇరికిస్తే పెద్దగా ప్రభావం ఉండదనుకున్నారో ఏమో, ఏకంగా కాషాయ సన్యాసిని సాధ్వీ ప్రగ్యాసింగ్ ఠాకూర్‌ను; ఆరెస్సెస్ ప్రతినిధి స్వామి అసీమానందను; ఆర్మీ ఆఫీసర్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్‌ను; ఇంకా పలువురు హిందువులను ఈ మాలేగావ్ బ్లాస్ట్ కేసులో నిందితుల్ని చేశారు. వీళ్లలో కొందరిని సంఝౌతా ఎక్స్‌ప్రెస్ బ్లాస్ట్, హైదరాబాద్ మక్కా మసీద్ బ్లాస్ట్, అజ్మీర్ దర్గా బ్లాస్ట్ లాంటి కేసుల్లో కూడా నిందితుల్ని చేశారు. వీళ్లంతా నిరపరాధులని యాంటీ టెర్రరిజమ్ స్క్వాడ్ (ఏటీఎస్)కు తెలుసు. కానీ పైనుంచి వచ్చిన ఆదేశాలతో ఏటీఎస్ అధికారిగా ఉన్న పరమ్‌బీర్‌సింగ్ లాంటి వాళ్లు రెచ్చిపోయారు. 'హిందూ ఉగ్రవాదం' అనే అబద్ధపు ఆరోపణతో పదిహేడు సంవత్సరాలపాటు ఈ కేసు నడిచింది.

2008లో మాలేగావ్ బాంబు పేలుళ్ల తర్వాత, 'సాఫ్రన్ టెర్రర్' అనే పదాన్ని ఇంగ్లిష్‌లోను, 'భగవా ఆతంక్‌వాద్' అనే పదాన్ని హిందీలోను తొలిసారి వాడారు. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వ నాయకులు, రాహుల్‌గాంధీతో సహా, ప్రతి వేదికపై 'కాషాయ టెర్రరిజం' అనే ఓ నేరేటివ్‌ను ప్రజల ముందుకు తీసుకురావడం మొదలుపెట్టారు. జూలై 2009లో రాహుల్‌గాంధీ భారతదేశంలోని అమెరికా రాయబారి టిమోతి రోమర్‌ను కలిశారు. ఆ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ హిందూ ధార్మిక సంస్థలు ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తోయిబా కంటే కూడా పెద్దవనీ, మరింత ప్రమాదకరమనీ చెప్పారు. ఈ విషయం 2010లో వికీలీక్స్ ద్వారా బట్టబయలైంది. హిందూ ఉగ్రవాదంతోనే దేశానికి పెద్ద ప్రమాదం అని రాహుల్‌గాంధీ ముంబై ఉగ్రదాడి తర్వాత మాట్లాడిన విషయం దేశ ప్రజలందరికీ తెలుసు.

మాలేగావ్ పేలుడు జరిగిన స్వల్పకాలంలోనే పి. చిదంబరం భారతదేశ హోం మినిస్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. హిందూ సంస్థలతో సంబంధం ఉన్న వ్యక్తులు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నారనీ, వారు ఎన్నో బాంబు పేలుళ్లకు బాధ్యులనీ ఆగస్టు 2010లో చిదంబరం దేశానికి ఓ కొత్త సిద్ధాంతాన్ని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ 2008 నుంచి 2011 వరకు ప్రతి వేదికపైనా హిందూ ఉగ్రవాదం గురించి మాట్లాడారు. ఆరెస్సెస్ దేశంలో ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తోందని, బాంబులు తయారు చేసే ఫ్యాక్టరీలు నడుపుతోందని ఆయన 2011లో చెప్పారు. అంతే కాదు, 2008లో ముంబై ఉగ్రదాడి వెనుక కూడా హిందూ సంస్థలే ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఒకవేళ పాకిస్థాన్ ఉగ్రవాది కసబ్ పోలీసులకు దొరికి ఉండకపోయి ఉంటే, ముంబై ఉగ్రదాడి తమ పనే అని లష్కరే తొయిబా చెప్పి ఉండకపోయి ఉంటే– ఇంకా ఎంతమంది హిందువులను ఈ కేసులో ఇరికించి చంపేవారో!

2008లో దేశంలో వరుసగా బాంబు పేలుళ్లు జరిగాయి. ఢిల్లీతో పాటు అనేక ఇతర నగరాల్లో ఎనిమిది భారీ పేలుళ్లు జరిగాయి. అందులో నాలుగు చోట్ల సీరియల్ బ్లాస్ట్స్ జరిగాయి. ఈ ఉగ్రవాద ఘటనల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ హిందూ ఉగ్రవాదం అనే పదాన్ని వాడటం ప్రారంభించింది. వాస్తవానికి ఈ పేలుళ్ల వెనుక పాకిస్థాన్ ఉగ్రవాదుల హస్తం ఉందని దర్యాప్తు సంస్థలకు సమాచారం ఉంది. కానీ ఈ పేలుళ్లకు వాస్తవ బాధ్యులుగా ఉన్న పాకిస్థానీ ఉగ్రవాదులపై నేరం చూపించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై దుష్ప్రచారం మొదలుపెట్టింది. "హిందూ ఉగ్రవాదం కూడా ఉంటుంది" అని ఒక నేరేటివ్ నిర్మించడం ద్వారా కాంగ్రెస్ రెండు ప్రయోజనాలు ఆశించింది: 1) అంతర్గత భద్రత విషయంలో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవచ్చు. 2) మైనారిటీ ఓటు బ్యాంకును సంతృప్తిపరచడం ద్వారా ఓట్లు కొట్టేయొచ్చు.

ఈ మొత్తం వ్యవహారాన్ని ఒక రాజకీయ వ్యూహంగా మార్చి భారతదేశ హిందువులపై అపవాదులు మోపారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు ఆపి ప్రజాస్వామ్యయుతంగా రాజకీయం చేస్తే మంచిది, లేదంటే వచ్చే ఎన్నికల్లో ఆ మూడు రాష్ట్రాలు కూడా మిగలవు. కాంగ్రెస్ ముక్త్ భారత్ కార్యాన్ని ప్రజలు అతి త్వరలో నిర్వహిస్తారన్న విషయాన్ని రాహుల్‌గాంధీ గుర్తిస్తే మంచిది.

• జెనవాడే సంగప్ప
బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

అబద్ధమే ట్రంప్ ఆయుధం!

నికోలో మాకియవెల్లి (1469–1527), పాలకుడు కానప్పటికీ, తన 'ది ప్రిన్స్' పుస్తకంలో పాలకులు రాజ్య స్థిరత్వం కోసం వ్యూహాత్మకంగా మోసం చేయవచ్చునని సలహా ఇచ్చాడు. క్లియోపాత్రా మోసపూరిత దౌత్యంలో ప్రసిద్ధి చెందింది. నీరో చక్రవర్తి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, ప్రత్యర్థులను తొలగించడానికి అబద్ధాలను ఉపయోగించాడు. ఇంగ్లాండ్‌కు చెందిన మొదటి ఎలిజబెత్ రాణి దౌత్యంలో వ్యూహాత్మక మోసం వాడటంలో పేరు పొందింది. సోవియట్ నాయకుడు స్టాలిన్ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి తప్పుడు ప్రచారాన్ని, సమాచారాన్ని ఉపయోగించాడు. ఇలా చరిత్రలో చాలా మంది పాలకులు రాజకీయ లక్ష్యాలను సాధించడానికి మోసపూరితంగా ప్రవర్తించారని చరిత్రకారులు రికార్డు చేశారు. ఈ క్రమంలోకి చక్కగా ఒదిగిపోయే నాయకుడు, వీరికి వర్తమానంలో వారసుడు ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.

అమెరికా రాజకీయ చరిత్రలోనే అతి ఎక్కువ తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసిన నాయకుడిగా ట్రంప్‌ను పత్రికలు, పరిశోధకులు గుర్తించారు. ట్రంప్ తన అధ్యక్ష పదవీకాలంలో 30,573 తప్పుదారి పట్టించే వాదనలు చేశారని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక నమోదు చేసింది. అంటే రోజుకి సగటున 21 కంటే ఎక్కువ తప్పుడు వ్యాఖ్యలు అన్నమాట. సీఎన్ఎన్ రికార్డుల ప్రకారం ట్రంప్ ఒక్క ఇంటర్వ్యూలోనే 32 తప్పుడు వాదనలు, ఒక ప్రసంగంలోనే 18 తప్పుడు వాదనలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆయన తప్పుడు వ్యాఖ్యలు ప్రధానంగా ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగాల పెరుగుదల, తయారీ రంగం విస్తరణ వంటి విషయాలలో కనిపించాయి. ఉదాహరణకు, చైనాపై విధించిన సుంకాలను "చైనా చెల్లిస్తోంది" అని మళ్ళీ మళ్ళీ చెబుతూ వచ్చాడు. కానీ వాస్తవానికి ఆ భారాన్ని అమెరికా దిగుమతిదారులే మోశారని అధ్యయనాలు నిరూపించాయి. అలాగే, తయారీ రంగంలో రికార్డు స్థాయిలో వృద్ధి జరిగిందని, కోట్ల ఉద్యోగాలు సృష్టించానని చెప్పినా, గణాంకాలు దీనికి విరుద్ధం. కరోనా సమయంలో కూడా ట్రంప్ తప్పుడు వ్యాఖ్యాల ప్రభావం తీవ్రంగా కనిపించింది. కోవిడ్ తీవ్రతను తక్కువ చేసి చూపుతూ, దానిని సాదాసీదా ఫ్లూతో పోల్చాడు. మరణాల శాతం తక్కువగా ఉందని చెప్పాడు. 2020 ఎన్నికల ఫలితాలపై ఆయన చేసిన తప్పుడు ఆరోపణలు అమెరికాలో విస్తృతమైన అపోహలను సృష్టించాయి. ఎన్నికల్లో మోసం జరిగిందని మళ్ళీ మళ్ళీ చెబుతూ వచ్చినా– అన్ని చట్టపరమైన పరిశీలనలు, కోర్టు తీర్పులు ఆ ఆరోపణలను ఖండించాయి. వలసదారులు, నేరాల గణాంకాల గురించి కూడా ఆయన అనేక వ్యాఖ్యలు వాస్తవానికి విరుద్ధంగా, రెచ్చగొట్టే విధంగా ఉన్నాయి.



అమెరికా రాజకీయ చరిత్రలోనే తప్పుదారి పట్టించే ప్రకటనలు అతి ఎక్కువగా చేసిన నాయకుడిగా ట్రంప్‌ను పత్రికలు, పరిశోధకులు గుర్తించారు. ట్రంప్ తన అధ్యక్ష పదవీకాలంలో 30,573 తప్పుదారి పట్టించే వాదనలు చేశారని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక నమోదు చేసింది. అంటే రోజుకి సగటున 21 కంటే ఎక్కువ తప్పుడు వ్యాఖ్యలు అన్నమాట.

ప్రభుత్వ సంస్థల నమ్మకాన్ని దెబ్బతీయడంలో కూడా ట్రంప్ పద్ధతి ప్రత్యేకం. తన వాదనలకు విరుద్ధంగా గణాంకాలు చెప్పిన ఫెడరల్ అధికారులను విమర్శించడం, లేదా తొలగించడం, తనకు ప్రతికూలమైన డేటాను "నకిలీ" అని పిలవడం చేశారు. పరిశీలకులు దీన్ని "ఫైర్‌హోసింగ్" అంటున్నారు. అంటే తప్పుదారి పట్టించే సమాచారాన్ని పెద్ద ఎత్తున, వేగంగా, నిరంతరాయంగా వెల్లువెత్తించి, ప్రజల విమర్శనాత్మక ఆలోచనను చంపివేయడం. దీనివల్ల వాస్తవం ఏమిటో నిర్ధారించడం కష్టమవుతుంది. ఈ శైలి ఇప్పుడు ట్రంప్ రెండవసారి అధ్యక్షుడైన తరువాత మరింత తీవ్రస్థాయిలో నడుస్తోంది. ఆర్థిక వ్యవస్థ, ఔషధ ధరలు, రాజకీయ విజయాలు వంటి అనేక అంశాల్లో తప్పు అని తేలిన వాదనలనే ఆయన తిరిగి తిరిగి చెబుతున్నాడు. ఈ తప్పుడు వ్యాఖ్యలు మీడియా, ప్రభుత్వ సంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకాన్ని క్రమంగా దెబ్బతీసి, అమెరికా రాజకీయ సంభాషణనే మౌలికంగా మార్చేశాయి.

వర్తమాన కాలాన్ని సత్యానంతర (Post–Truth) కాలం అంటున్నారు. ఇందులో వాస్తవాల కంటే భావోద్వేగాలు, వ్యక్తిగత నమ్మకాలు ఎక్కువగా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ పరిస్థితిలో, స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నా కూడా, తమ భావాలకు లేదా అభిప్రాయాలకు అనుగుణంగా ఉన్న విషయాలనే ప్రజలు ఎక్కువగా నమ్ముతారు. పక్షపాతపూరిత వార్తా మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారం మరింత విస్తరిస్తుంది. ఈ మధ్య కాలంలో సత్యానంతరత గురించి అనేక పుస్తకాలు, అధ్యయనాలు వచ్చాయి. అన్నీ కూడా ట్రంప్‌నే ఉదాహరణగా చూపించటం గమనార్హం.

ట్రంప్ చెప్పిన, చెపుతున్న అబద్ధాలకు అంతు లేదు. గాజా గురించి మాట్లాడుతూ "నేను అక్కడికి వెళ్లాను, అది చాలా సంక్లిష్ట ప్రదేశం" అన్నాడు. అయితే, ఆయన గాజాకు ఎప్పుడూ వెళ్లినట్టు ఎలాంటి ఆధారాలూ లేవు. ఏ రికార్డులూ ట్రంప్ గాజా ప్రయాణాన్ని నిర్ధారించలేదు. ఎందుకంటే అసలు అలాంటి ప్రయాణం జరగనేలేదు. సీఎన్ఎన్ లాంటి వార్తా సంస్థలు దాన్ని తప్పుడు ప్రచారంగా కొట్టివేశాయి. అలాగే, "హమాస్ దాడులు అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బుతో జరిగాయి" అనీ, "బైడెన్ ప్రభుత్వమే ఇందుకు కారణం" అనీ ట్రంప్ అన్నాడు. ఈ వాదన పూర్తిగా తప్పు. ఈ నిధులు ఇరాన్‌కు మానవతా సహాయం రూపంలో (ఆహారం కోసం, మందులు కోసం) ఇచ్చినవి, సైనిక ప్రయోజనాల కోసం కాదు. గాజాకు పంపిన ఆహార సరఫరాలను హమాస్ దొంగిలించి, అమ్మేస్తోందని కూడా ట్రంప్ ఆరోపించాడు. అయితే అమెరికా ప్రభుత్వ నివేదికల్లో దీనికి ఎలాంటి ఆధారాలు లభించలేదు. గాజాలో పెద్ద సంఖ్యలో పౌరుల మరణాలకు ఇజ్రాయెల్ కారణమని ట్రంప్ అన్నట్లు ఒక వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయింది. కానీ ఇది కృత్రిమ మేధ (AI) ద్వారా తయారు చేసిన నకిలీ వీడియో అని తరువాత బయటపడింది. ట్రంప్ అలాంటి వ్యాఖ్య చేసిన రికార్డు ఎక్కడా లేదు. అంతకంటే ముఖ్యంగా, ఇజ్రాయెల్–హమాస్ కాల్పుల విరమణకు తానే ప్రధాన కారణమని ప్రచారం చేసుకున్నాడు. వాస్తవానికి కాల్పుల విరమణ చర్చలు ట్రంప్ ప్రమేయానికి ముందే ప్రారంభమయ్యాయి.

మరింత విచిత్రంగా, ఎటువంటి సంకోచం లేకుండా ట్రంప్ అనేకసార్లు తాను భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధం అణుయుద్ధం అయ్యే ప్రమాదాన్ని ఆపేశానని చెప్పుకున్నాడు. ఇరుదేశాలతో ఉన్న అన్ని వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తానని బెదిరించడం వల్లే యుద్ధం ఆగిందన్నాడు. అయితే, భారత అధికారులు ఈ కథనాన్ని పూర్తిగా ఖండించారు. కాల్పుల విరమణ అనేది భారత–పాకిస్థాన్ సైనిక వ్యవస్థల మధ్య నేరుగా జరిగిన చర్చల ఫలితమని, ఎటువంటి బయటి మధ్యవర్తిత్వం లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి భారత ప్రధాని మోదీ తన మధ్యవర్తిత్వాన్ని కోరాడని అన్నాడు. దీనిని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ వెంటనే ఖండించింది.

"నాయకులు తమ అబద్ధాలకు సరిపడేలా వాస్తవాన్ని మలచుకునే అధికారాన్ని పొందే ముందు నుంచే, వాళ్ళు వాస్తవాల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని, నిరాదరాన్ని చూపుతారు. వాళ్ళకి నిజం అనేది స్వతంత్రంగా ఉండే విషయం కాదు. దాన్ని సృష్టించగల, మార్చగల మనిషి శక్తిపైనే అది ఆధారపడుతుందని వాళ్ళు నమ్ముతారు," అని అంటుంది హానా అరెండ్ (Hannah Arendt) తన రచన 'The Origins of Totalitarianism'లో. కచ్చితంగా ట్రంప్ చేసింది, చేస్తున్నది అదే. తప్పుదారి పట్టించే వాదనల వెనుక ట్రంప్‌కు ఉన్న కారణాలు మానసిక, వ్యూహాత్మక, సాంస్కృతిక కారకాల మిశ్రమం నుంచి పుట్టాయనుకోవచ్చు. ట్రంప్ 'స్వయం ప్రేమ' (Narcissistic) లక్షణాలను ప్రదర్శిస్తాడని, స్వీయ–గొప్పతనం కోరుకుంటాడని, అపరాధ భావన లేకుండా అబద్ధాలు చెబుతాడని పరిశీలకులు అంటున్నారు. ట్రంప్ అబద్ధాలన్నీ ప్రజా విశ్వాసాన్ని, ప్రజాస్వామ్య ప్రక్రియలను దెబ్బతీసేవే.

జార్జ్ ఆర్వెల్ అన్నట్లుగా రాజకీయ భాష అబద్ధాలను సత్యంగా అనిపించేలా, హత్యను గౌరవనీయంగా కనిపించేలా, గాలికి దృఢమైన రూపాన్ని కలిగించేలా చేయగలదు. ఈ భాష పట్ల స్పృహ కలిగి ఉండటం నేటి అవసరం. అలాగే "అనంత జ్ఞానానికి ద్వారం తెరవడం మాత్రమే కాదు, అనంత తప్పిదాలకు హద్దు విధించడం" కూడా ఇవ్వాళ అత్యంత అవసరమైన అంశం.

■ ప్రొ. బి. తిరుపతిరావు
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

ఎన్నికల సంఘం స్పందిస్తే బాగుండేది!

బిహారులో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణల్లో భాగంగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ'లో 'ఓటు చోరీ' జరుగుతోందని, దాన్ని సరిదిద్దాలని కోరుతూ మూడు వందల మంది ప్రతిపక్ష ఎంపీలు ఢిల్లీలో నిరసన ర్యాలీ చెయ్యడం ప్రాముఖ్యత కలిగిన వార్త. వారు తమను కలిసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇస్తే సబబుగా ఉండేది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గత కొంత కాలంగా బీహారు అంశమే కాకుండా, గత సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు కొన్ని ఆధారాలతో బలంగా చెప్తున్నారు. కర్ణాటకలో ఒక పార్లమెంటు నియోజకవర్గంలో లక్ష ఓట్లకు పైగా మతలబు జరిగినట్లు, అలాంటి ఉదంతాలు దేశవ్యాప్తంగా ఉన్నట్లు, తద్వారా అధికార పక్షానికి మేలు జరిగినట్లు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఎన్నికల కమిషన్ సందేహ నివృత్తి చేయాల్సింది. సరైన రుజువులతో ఆయన వాదనని పూర్వపక్షం చేసి ఉంటే దేశ ప్రజలకు మంచి సందేశం ఇచ్చినట్లు ఉండేది. పైగా అలా చెయ్యడం దాని బాధ్యత కూడా. దురదృష్టవశాత్తూ ఎన్నికల సంఘం ఆ దిశగా ఆలోచిస్తున్నట్లు కనబడడం లేదు. ఒక రాజ్యాంగ సంస్థ తన బాధ్యత పట్ల ఏ రూపంలో విమర్శ ఎదురైనా, దాన్ని ఒక అవకాశంగా తీసుకుని ప్రజల దృష్టిలో తన నిబద్ధతను చాటిచెప్పేలా ప్రవర్తించాలి. అడిగింది రాహుల్‌గాంధీనా లేక సామాన్య పౌరుడా అన్నదానితో సంబంధం లేకుండా 'ఇదీ, నా సూటి జవాబు' అన్న రీతిలో స్పందించాలి. ప్రస్తుతం అడుగుతున్నది ఒక రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నవారు – లోక్‌సభలో ప్రతిపక్ష నేత – అయినప్పుడు, మరింత స్పష్టతతో దేశ ప్రజలకి జవాబు ఇవ్వాలి. కానీ జరుగుతున్నది అలా లేదు. రాహుల్ గత ఎన్నికల్లో సందేహాస్పద ఓటర్ల జాబితా డిజిటల్ రూపంలో అడుగుతున్నారు– దాన్ని ఇవ్వడం లేదు. దొంగ ఓట్లు, ఒకే చిరునామాతో ఉన్న డజన్ల ఓట్లు, డూప్లికేట్‌వి... ఇలాంటి అవకతవకలు లక్షల్లో నమోదైనట్లు తనకు ఉన్న ఆధారాలు చూపిస్తున్నారు – వాటికి జవాబు లేదు. పైగా కర్ణాటకలో ఇలా జరిగిందని రాహుల్ చెప్పినప్పుడు అలాంటి అవకాశం లేదని చెప్పకుండా 'అదేదో అఫిడవిట్ ద్వారా అడగమని' జవాబు ఇచ్చారు. దీన్నే అసలు వదిలి కొసరు పట్టుకోవడం అంటారు. రాహుల్ ఆరోపణల వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉండొచ్చు. అది అప్రస్తుతం. తన బాధ్యత పట్ల ఒక అనుమానం లేవనెత్తినప్పుడు ఎన్నికల కమిషన్ సవ్యంగా స్పందించాలి. ప్రతీ పౌరుడికీ తన ఓటు హక్కును స్వేచ్ఛగా వాడుకొనే పరిస్థితిని కల్పించాలి. అక్రమాలతో ప్రజాతీర్పు తారుమారు కాకుండా చూసే బాధ్యత కూడా దానిదే. అలా చూడడమే గాక, ఆ నమ్మకాన్ని పౌరునిలో కలిగించాలి. అది ప్రజల పట్ల, దేశం పట్ల రాజ్యాంగబద్ధమైన బాధ్యత.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

జరగాల్సింది 'లొంగుబాటు' కాదు, దిద్దుబాటు!

దండకారణ్యంలో, ఆదివాసీల తరఫున పోరాడుతున్న మావోయిస్టు పార్టీ నాయకుల్నీ, కార్యకర్తల్నీ, వారిని అనుసరిస్తున్న ఆదివాసీలనూ 2026 మార్చి చివరికల్లా మట్టుపెడతామని కేంద్ర హోం మంత్రి ప్రతిజ్ఞ చేసిన సంగతి తెలిసిందే! ఆ ప్రతిజ్ఞ ప్రకారమే గత ఏడాదిగా కొన్ని వందల మంది మావోయిస్టుల్ని ప్రభుత్వ సాయుధ బలగాలు చంపుతూ వస్తున్నాయి.

ఈ పరిస్థితికి స్పందించిన కొందరు మేధావులు, కొన్ని సూచనలు చేస్తున్నారు. 'మావోయిస్టులు చర్చలకు సిద్ధం అంటున్నారు కాబట్టి, ప్రభుత్వం, వారితో చర్చలు జరిపి, ఒక శాంతియుతమైన పరిష్కారానికి రావాలి' అన్నది ఒక సూచన. 'వాస్తవ పరిస్థితుల్ని అర్థం చేసుకుని, మావోయిస్టులు జనజీవన ప్రవంతిలోకి వచ్చి, "ప్రజాస్వామ్యబద్ధంగా" పనిచేయాలి' అన్నది మరో సూచన. ఈ రెండు సూచనలూ, ఆదివాసీల పట్లా, వారికోసం ప్రాణాలు పణంగా పెడుతున్న మావోయిస్టుల పట్లా, వర్గాతీతమైన మానవతా దృక్పథంతో చేసినవే అనుకోవాలి. ఈ సూచనలకి ప్రభుత్వం నుంచి వచ్చే జవాబు ఏమిటంటే: 'శాంతి చర్చలు– అనే ప్రశ్నే లేదు. ఆయుధాలతో సహా ప్రభుత్వానికి లొంగిపోయే వరకూ ప్రభుత్వం మావోయిస్టుల్ని వేటాడుతూనే వుంటుంది' – అని!

అయితే, ఇప్పటి వరకూ ఎవ్వరూ కూడా, ప్రభుత్వం కోరుతున్నట్టు, 'ఆయుధాలతో సహా లొంగిపొమ్మని' మావోయిస్టులకు సూచించలేదు. కానీ, ఇప్పుడు, నాకు తెలిసి మొదటిసారి, అలా లొంగిపొమ్మని, ఇనుకొండ తిరుమలి సూచించారు. ('అరణ్యవాసంలోనే విప్లవ ప్రభాతం' –ఆంధ్రజ్యోతి, జులై 25). తిరుమలి, ఇలా అన్నారు: 'నక్సలైట్లు తమ ఆయుధాలతో రాజ్యానికి లొంగిపోయి, పునరావాసం పొందడానికి ప్రయత్నించాలి. లొంగిపోయిన నక్సల్స్‌కు సౌకర్యవంతమైన పునరావాసం కల్పిస్తామనే హామీతో వారిని పార్లమెంటరీ ప్రజాస్వామిక మార్గం వైపు మళ్ళించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి'– అని!

'మార్క్సు సిద్ధాంతాన్ని మరింతగా అధ్యయనం' చేయడానికి, ప్రసిద్ధి చెందిన 'జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి' వెళ్ళి, 'వర్గ సంబంధాలనూ, వర్గ పోరాటాలనూ మరింత లోతుగా అధ్యయనం' చేశానని చెప్పుకున్న చరిత్రకారుడు తిరుమలి– ఇప్పటివరకూ ఎవ్వరూ ఇవ్వని సలహా ఇవ్వడం వింతగా వుంది. పిల్లీ ఎలకా అని పోల్చదగ్గ, ప్రభుత్వానికీ నక్సలైట్లకూ, అంటే, పరస్పర శత్రు వర్గాలకూ, సమన్వయం సాధ్యం అని, 'వర్గ పోరాటాల గురించి మరింత లోతుగా అధ్యయనం' చేసిన వారెవరైనా భావించవచ్చా?

మార్క్సు సిద్ధాంతం చదవని తిరుగుబాటుదారులు కూడా ఆ పని చెయ్యరని చరిత్రకారుడైన తిరుమలి చరిత్రలో చదవలేదా? ఉదాహరణకి, ఇటలీ వలస పాలన నించి విముక్తి కోసం లిబియా ప్రజలు ఎన్నో ఏళ్ళపాటు పోరాటం చేశారు. ఇటలీ సామ్రాజ్యవాదులతో యుద్ధంలో వేలమంది చనిపోయారు. ఇరవై సంవత్సరాలకు పైగా, గెరిల్లా యుద్ధ తంత్రంతో, ఇటలీ సైన్యాన్ని ఎదుర్కొన్న అగ్రనాయకుడు 'ఉమర్ ముఖ్తార్'ను ఇటలీ పట్టుకుని, 'లొంగిపో, లేకపోతే ఉరిశిక్షే!' అంటే, అతనేమన్నాడో తెలుసా?– 'మేము ఎన్నడూ లొంగిపోము! మేము గెలుస్తాము! లేదా, చచ్చిపోతాము! దాంతో అంతా ఆగిపోతుందనుకోకండి! మీతో పోరాడడానికి మా తర్వాత ఇంకో తరం! ఆ తర్వాత ఇంకో తరం! ఆ తరవాత ఇంకో తరం..." అన్నాడు. ('ఒక వీరుడు మరణిస్తే, వేనవేలు ప్రభవింతురు' అని, తెలంగాణా రైతాంగ పోరాటానికి సంబంధించిన ఒక కవితలో ఉన్నట్టు!). ఇలా అన్న ఉమర్ ముఖ్తార్, మార్క్సు సిద్ధాంతాన్ని 'మరింతగా' కాదు కదా, కనీసంగా కూడా అధ్యయనం చేసినవాడు కాదు. (అతను లొంగకపోయేసరికి, 1931లో, అతనికి 73 ఏళ్ళ వయసులో ఇటలీ సైనికాధికారులు ఉరితీశారు.)

నక్సలైట్లకి దిద్దుబాటని చూపకుండా, లొంగుబాటని చూపి, ఆ బాట ద్వారా పునరావాసం కోసం కూడా ప్రయత్నించమంటున్నారు ఇనుకొండ తిరుమలి. కానీ, నక్సలైట్ ఉద్యమంలోకి వచ్చేవారు, పోలీసు శాఖలోకి వచ్చినట్టు, ఒక ఉద్యోగానికి రారు కదా!?



ఆదివాసీలకు గానీ, వారికోసం నిలబడ్డ మావోయిస్టులకు గానీ, వారి శ్రేయోభిలాషులు చెప్పవలసింది– లొంగుబాటు కాదు, దిద్దుబాటు! ఉదాహరణకి, తిరుమలి తన వ్యాసంలో, 'నక్సలైట్ ఉద్యమం పరిపూర్ణ ప్రజా ఉద్యమంగా మారలేదు' అన్నారు. అలాంటప్పుడు, 'లొంగిపొండి' అని సలహా ఇవ్వడం కాక, 'మీ తప్పులు దిద్దుకోండి! మీ ఉద్యమాన్ని పరిపూర్ణ ప్రజా ఉద్యమంగా మార్చుకునేలా, మీ అవగాహననీ, ఆచరణనీ దిద్దుకోండి!' అని చెప్పాలి. అయితే, ఆ సలహాల్ని మావోయిస్టు పార్టీ గానీ, ఆ పార్టీని ఎటువంటి విమర్శా లేకుండా సమర్థించేవారు గానీ, అంగీకరిస్తారా, లేదా అనేది వేరే విషయం.

నక్సలైట్లకి దిద్దుబాటని చూపకుండా, లొంగుబాటని చూపి, ఆ బాట ద్వారా పునరావాసం కోసం కూడా ప్రయత్నించమంటున్నారు ఇనుకొండ తిరుమలి. కానీ, నక్సలైట్ ఉద్యమంలోకి వచ్చేవారు, పోలీసు శాఖలోకి వచ్చినట్టు, ఒక ఉద్యోగానికి రారు కదా! ప్రభుత్వం, లొంగిపోయిన నక్సలైట్లకి, 'సౌకర్యవంతమైన పునరావాసం' కల్పించాలి– అని తిరుమలి సలహా! పౌరులందరికీ, అన్ని రకాల న్యాయబద్ధమైన సౌకర్యాలూ ప్రభుత్వాలు కల్పిస్తే ఇక ఉద్యమాల అవసరం ఏముంటుంది? తిరుమలి తన వ్యాసంలో కొన్ని అవాస్తవాలు కూడా రాశారు: 'గ్రామాలలో రైతులు వాణిజ్య పంటలు సాగుచేసి ధనవంతులయ్యారు' అన్నారు. మరి, రైతుల ఆత్మహత్యలు వందల వేల సంఖ్యలో ఎందుకు జరుగుతున్నట్టు? పైగా, ఎక్కువ ఆత్మహత్యలు, పత్తి వంటి వాణిజ్య పంటలు సాగుచేసిన వారిలోనే కనిపిస్తాయి. 2021లో, నందకిశోర్ కన్నూరి, శుశ్రుత్ జాదవ్ అనే ఇద్దరు పరిశోధకులు జరిపిన ఒక సర్వే ప్రకారం, 1995కీ–2018కీ మధ్య కాలంలో, భారతదేశంలో, 4 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే, రోజుకి సగటున 48 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నమాట! వీరిలో మెజారిటీ రైతులు 'వెనకబడిన కులాలకు' చెందినవారేనట!

అయినా, ఎవరైనా, ఎలా ధనవంతులవుతారు? 'మార్క్సు సిద్ధాంతాన్ని మరింతగా అధ్యయనం' చేసిన వారు చెప్పవలసింది, 'ఇతరుల శ్రమని దోపిడీ చేయడం ద్వారానే ధనవంతులవుతారు' అని! తిరుమలి చేసిన ఇంకో విచిత్రమైన వాదన: 'పరిశ్రమల ప్రైవేటీకరణతో కార్మిక వర్గం సైతం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఆదరించింది' అట! మరి, విశాఖ ఉక్కు కర్మాగారం వంటి దాన్నీ, సింగరేణి వంటి దాన్నీ, ఇంకా అనేక ప్రభుత్వ రంగ సంస్థల్నీ ప్రైవేటుపరం చెయ్యొద్దు మొర్రో అని కార్మిక సంఘాలు మొత్తుకోవడం సంగతి ఏమిటి? అదేమీ పట్టించుకోకుండా, 'భారతీయ సమాజం పెట్టుబడిదారీ విధానాన్ని అంగీకరించింది' అని తేల్చారు. భారతీయ సమాజంలో, పెట్టుబడిదారీ విధానం ఉన్నదనడమూ, దాన్ని తీవ్ర స్థాయిలో వ్యతిరేకించే కార్మిక వర్గ ఉద్యమాలు లేవనడమూ వేరు. అంతేగానీ, ఆ విధానాన్ని సమాజం మొత్తం అంగీకరించిందనడం వాస్తవం కాదు!

ఇప్పుడున్న 'ప్రజాస్వామ్య వ్యవస్థలు, సామ్యవాద సమాజ నిర్మాణానికి ఆస్కారం కల్పించడం సంశయాస్పదమే' అని ఒక పక్కన అంటూనే, చిట్టచివరి వాక్యంలో, 'పార్లమెంటరీ ప్రజాస్వామిక మార్గం వైపు నక్సలైట్లను మళ్ళించ'మని ప్రభుత్వానికి తిరుమలి సలహా ఇస్తున్నారు. 'వర్గ సంబంధాలనీ, వర్గపోరాటాలనీ మరింత లోతుగా అధ్యయనం' చేసిన వారెవరైనా ప్రభుత్వానికి ఇలాంటి సలహా ఇవ్వగలరా?

◆ నౌరోజీ

వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి
- ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి


మందులను నిల్వలను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వరంగల్ మెడికల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధుల నియంత్రణ, పర్యవేక్షణ ప్రత్యేక అధికారిగా నియమితులైన వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం హనుమకొండ జిల్లా పరకాల ఏరియా ఆస్పత్రి, సిద్దాపూర్, వంగపహాడ్‌లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి, చింతల్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పరకాల ఏరియా ఆస్పత్రిలో ఫీవర్ వార్డు, ఎస్‌సీడీ క్లినిక్, ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేశారు. అనంతరం సిద్దాపూర్, వంగపహాడ్ పీహెచ్‌సీలను సందర్శించి డెంగ్యూ కేసులు నమోదు అయిన గృహాన్ని సందర్శించారు. ఎంజీఎం ఆస్పత్రిలోని ఫీవర్ వార్డు, ఐసీటీసీ కేంద్రం, రక్తనిధి కేంద్రం, ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీరు శుభ్రం ఉంటే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అరికట్టవచ్చని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త చెదారం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా శానిటేషన్ చేయాలని, డ్రైడే పాటించాలని అధికారులకు సూచించారు. వైద్యులు అందుబాటులో ఉంటూ మందులు నిల్వ ఉంచుకోవాలని, స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఫీవర్ సర్వే చేసి అవసరమైన వారికి టెస్టులు నిర్వహించాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ డీఎంహెచ్‌వోలు డాక్టర్ ఎ.అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, అడిషనల్ డీఎంహెచ్‌వో, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డాక్టర్ శ్రీపాల్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇలాగైతే పరిష్కారం ఎలా!?



ఆగస్టు 15 నాటికి భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలని లక్ష్యం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పంద్రాగస్టు నాటికి భూ భారతిలో దరఖాస్తులను పరిష్కరించటం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. కోర్టు కేసులు, భూ వివాదాల మూలంగా స్వీకరించిన దరఖాస్తులు ఇంకా ఒక్క రోజులో పరిష్కరించటం అసాధ్యమనే టాక్ వినబడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,377 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ద్వారా 2,35,990 దరఖాస్తులను స్వీకరించారు. అయితే భూ భారతి సదస్సుల్లో దరఖాస్తుల రాగా, వీటిలో అత్యధికంగా సాదాబైనామాలు, అసైన్డ్ భూములకు సంబంధించిన దరఖాస్తులే ఉండగా, సాదాబైనామాల దరఖాస్తులపై హైకోర్టులో కేసు ఉండటంతో వీటి పరిశీలనను ప్రభుత్వం పక్కన పెట్టింది. ఇక మిగిలిన దరఖాస్తులో అత్యధికంగా వివాదస్పమైనవి, కోర్టు కేసుల్లో ఉన్నవే ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో మొత్తం దరఖాస్తుల్లో పది శాతం కూడా పరిష్కరించే అవకాశం లేకుండా పోయింది.

భారీగా దరఖాస్తులు..

ధరణి కష్టాలకు చెక్ పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏప్రిల్ 14న భూ భారతి పోర్టల్‌ను తీసుకవచ్చింది. గ్రామాల్లో రైతుల భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఏప్రిల్ 17వ తేదీన రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా, అందులో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాన్ని కూడా చేర్చారు. అలాగే మే 15వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రెండో విడత రాష్ట్రవ్యాప్తంగా 28మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా, భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం, హనుమకొండ జిల్లా నడికూడ, వరంగల్ జిల్లా వర్ధన్నపేట, మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి, జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ మండలాలను ఎంపిక చేశారు. ఈ ఆరు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి 17,319దరఖాస్తులను స్వీకరించారు. జూన్ 3వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుంది. జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. మొత్తం 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి వివిధ సమస్యలపై 2,35,990 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో వరంగల్ జిల్లా నుంచి 53,933 దరఖాస్తులు రాగా, హనుమకొండ జిల్లాలో 34,973, జనగామ జిల్లాలో 17,867, మహబూబాబాద్ జిల్లాలో

(మిగతా 7వ పేజీలో...)

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల వివరాలు..

జిల్లా	రెవెన్యూ గ్రామాలు	భూభారతి దరఖాస్తులు	సాదాబైనామాలు
వరంగల్	191	57,850	26,630
హనుమకొండ	163	34,973	27,057
జనగామ	176	17,867	10,350
మహబూబాబాద్	288	39,419	31,250
భూపాలపల్లి	223	53,763	51,347
ములుగు	336	32,118	20,150
మొత్తం	1,377	2,35,990	1,66,784

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూ సమస్యలపై 2.60 లక్షల దరఖాస్తులు
- దరఖాస్తుదారులకు నోటీసులు ఇచ్చి విచారణ జరుపుతున్న అధికారులు
- దరఖాస్తుల్లో 10 శాతం కూడా పరిష్కారం కాని వైనం
- దరఖాస్తుల్లో అత్యధికం సాదాబైనామా, అసైన్డ్ భూములవే...
- కోర్టు తీర్పు సాకుతో పరిష్కారాన్ని పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం
- భూ భారతితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశలో రైతులు

భూపాలపల్లిలో కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు

కేంద్ర విద్యాశాఖ కార్యదర్శిని కోరిన ఎంపీ కడియం కావ్య


కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ కావ్య

హనుమకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేంద్రీయ విద్యాలయంతో పాటు జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని బుధవారం ఢిల్లీలో కేంద్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్‌కు వరంగల్ ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఢిల్లీలోని సంజయ్ కుమార్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ భూపాలపల్లి జిల్లాలో సింగరేణి, ప్రభుత్వ ప్రైవేటు రంగ, ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అవసరమని వివరించారు. కేంద్రీయ విద్యాలయం వస్తే స్థానిక పిల్లలకు మంచి విద్య అందుతుందన్నారు. అలాగే జయశంకర్ భూపాలపల్లిలో నవోదయ పాఠశాల ఏర్పాటు అవసరాన్ని కూడా ఎంపీ వివరించారు. భూపాలపల్లి జిల్లా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన జిల్లా అని, ఇప్పటి వరకు నవోదయ పాఠశాల లేకపోవడంతో ప్రతిభావంతులైన పిల్లలు మంచి రెసిడెన్షియల్ విద్యకు దూరమవుతున్నారని అన్నారు. కేంద్రీయ, నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ ఇందుకు సానుకూలంగా స్పందించారు. కేంద్రీయ, నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గట్టెక్కుతున్న వరద కష్టాలు

వర్షాలు గెరువివ్వడంతో తేరుకుంటున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు

- తిరిగి నెలకొంటున్న సాధారణ పరిస్థితులు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- వరదముంపు ప్రాంతాల్లో కలెక్టర్ల పర్యటన
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యేలు
- సీజనల్ వాధ్యులపై ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి సమీక్ష
- గల్లంతైన పశువుల కాపరి మృతదేహం లభ్యం
- మత్తుళ్లు దూకుతున్న చెరువులు, కుంటలు


పునరావాస కేంద్రాన్ని సందర్శించి, వరద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ వాజ్‌పాయి,


సంగెం మండలం కాట్రపల్లి సమీపంలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి


ఏసీరెడ్డినగర్‌లో వర్షానికి వచ్చిన నీరు, బురదతో ఇంటిని శుభ్రం చేసుకుంటున్న గృహిణీ, కూతురు


మంగళవారం ఆకేరువాగులో గల్లంతయిన పశువుల కాపరి మృతదేహం

హనుమకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వరదలు తగ్గుముఖం పట్టాయి. బుధవారం వర్షం అంతగా పడకపోవడంతో పరిస్థితులు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లో నిలిచిన నీరు క్రమంగా తగ్గుముఖం పడుతోంది. అతిభారీ వర్షం వల్ల వరంగల్ జిల్లాలోని ప్రాంతాలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా వరంగల్ నగరం తీవ్రంగా ముంపునకు గురయింది. మరో రెండు రోజులు వర్షాలు కురవనున్నట్టు వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. వరదపీడిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పర్వతగిరి మండలం నారాయణపురంలో ఆకేరువాగులో కొట్టుకుపోయిన పశువుల కాపారి కందికట్ల ఉప్పలయ్య(65) మృతదేహాన్ని బుధవారం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కనుగొన్నాయి. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, ఎంఎల్‌ఏ కేఆర్ నాగరాజు వరదపీడిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. వరద బీభత్సాన్ని పరిశీలించారు. వరద బాధితులను పరామర్శించారు. పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామ ఊరచెరువు కట్టను పరిశీలించారు. కట్టను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలను సందర్శించారు. వారికి అందుతున్న సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు. వరంగల్‌లోని భద్రకాళి బండ్‌ను కలెక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణి, నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ వాజ్‌పాయ్ సందర్శించి బండ్ పరిస్థితిని పరిశీలించారు. సంగెం మండలం కాట్రపల్లి, వెంకటాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగును ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. హనుమకొండ జిల్లాలో గత 24 గంటల్లో 34.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా,

(మిగతా 6వ పేజీలో...)

కలెక్టర్ల సమీక్ష

రెండు జిల్లాల కలెక్టర్లు వరద బీభత్సంపై అధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో భారీ వర్షాల వల్ల ఉత్పన్నమైన పరిస్థితిపై ఆరా తీసారు. రెండు మూడు రోజుల పాటు భారీ, అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన ముందుస్తు చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. నగరంలో వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ వాజ్‌పాయి, మేయర్ గుండు సుధారాణి, కార్పోరేషన్ అధికారులతో సమావేశమై సహాయక చర్యలపై చర్చించారు. కార్పొరేటర్లు తమ డివిజన్లలో పర్యటించారు. ఎమ్మెల్యేలు సైతం తమ నియోజకవర్గాలలో వరద తాకిడికి గురైన ప్రాంతాలను సందర్శించారు.

జెండాలు ఎగరేసేది ఎవరంటే..

- హనుమకొండలో మంత్రి కొండా సురేఖ
- వరంగల్‌లో మంత్రి పొంగులేటి


కొండా సురేఖ


పొంగులేటి

హనుమకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే పంద్రాగస్టు వేడుకల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించే మంత్రులు, ఇతర ప్రముఖుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. బుధవారం ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ కె.రామక్రిష్ణారావు జాబితాను విడుదల చేశారు. హనుమకొండ జిల్లాలోని పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే పంద్రాగస్టు వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. వరంగల్ జిల్లా వరంగల్ కోటలో జరిగే వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జనగామ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ షెడ్యూల్ ట్రైబ్స్ సహకార, ఆర్థికాభివృద్ధి సంస్థ చైర్మెన్ బెల్లయ్య నాయక్, మహబూబాబాద్ జిల్లాలో శాసన సభ విప్ జె. రామచందర్ నాయక్, ములుగు జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి డి సీతక్క జాతీయ పతాకాలను ఆవిష్కరిస్తారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

■ బస్సు తోలిన ఎమ్మెల్యే రేవూరి..



పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆర్టీసీ డ్రైవర్ అవతారం ఎత్తారు. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని షాపూర్ గ్రామంలో లోహిత, రామచంద్రాపురం, గవిచర్ల గ్రామాల మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా స్టీరింగ్ పట్టుకొని బస్సును ముందుకు కదిలించారు. ఎమ్మెల్యే డ్రైవింగ్‌ను అందరూ ఆసక్తిగా తిలకిచాఅరు.

-ఆంధ్రజ్యోతి, సంగెం

■ కొరడా ఝుళిపించిన ఎమ్మెల్యే జాటోతు



డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ జాటోతు రాంచంద్రునాయక్ పోతరాజులతో కలిసి కొరడా ఝుళిపించారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో బుధవారం బోనాల సందర్భంగా ఆయన ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోతరాజులు విన్యాసాలు చేస్తుండగా, ఎమ్మెల్యే వారి వద్దకు వెళ్లి కొరడా తీసుకొని సరదాగా ఝుళిపించి ఉత్సాహపరిచారు.

-ఆంధ్రజ్యోతి, దంతాలపల్లి

సైలెన్సర్లతో రాకెట్ పైలాన్

- అధిక శబ్దం చేసే సైలెన్సర్ల వాడకం నేరం
- అవగాహన కల్పించడం కోసం వినూత్న నిర్మాణం


సైలెన్సర్లతో ఏర్పాటు చేసిన రాకెట్ నమూనా పైలాన్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ సత్యనారాయణ

వరంగల్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొందరు యువకులు బైక్‌లకు స్టైలిష్ సైలెన్సర్లను అమర్చుకొని అధిక శబ్ధం చేస్తూ రయ్యిన దూసుకువెళ్తుంటారు. వారికి అదో 'షో'కు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధం. వాటిని ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా స్వాధీనం చేసుకుంటూ ఉంటారు. ఇలా స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లతో పోలీస్ హెడ్‌క్వార్టర్స్ జంక్షన్‌లో హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు రాకెట్ నమూనా పైలాన్‌ను ఏర్పాటు చేశారు. అధికశబ్ధం చేసే సైలెన్సర్లను వినియోగించడం నేరమనే విషయాన్ని అవగాహన కల్పించడం కోసం ఈ పైలాన్‌ను నిర్మించడం విశేషం. దీనిని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు వినియోగించడం నేరమని, యువతకు అవగహన కల్పించడంలో భాగంగా వాటితో రాకెట్ నమూనా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్లు వినియోగిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరంగల్ ట్రైసిటీ పరిధిలో 2024లో 1246 సైలెన్సర్లను స్వాధీనం చేసుకోగా, హనుమకొండలో 557, వరంగల్ పరిధిలో 335, కాజీపేట పరిధిలో 354 సైలెన్సర్లను సీజ్ చేయడం జరిగిందన్నారు. 2025లో జనవరి నుంచి ఇప్పటి వరకు 592 సైలెన్సర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి పాల్గొన్నారు.

16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు 6
పీటల మీద ఆగిన పెళ్లి 7

మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

టీఏవీఆర్ ప్రక్రియ ద్వారా వృద్ధుడి ప్రాణాలు కాపాడిన వైద్యులు



మెడికవర్ ఆస్పత్రిలో మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రమోద్‌కుమార్

హనుమకొండ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న 71 ఏళ్ల వృద్ధుడికి టీఏవీఆర్ ప్రక్రియ ద్వారా రోగి ప్రాణాలను కాపాడినట్లు మెడికవర్ ఆస్పత్రి చీఫ్ ఆఫ్ కార్డియాలజీ అండ్ డైరెక్టర్ స్ట్రక్చరల్ హార్ట్ అండ్ అడ్వాన్స్ కరోనరి డాక్టర్ కూచులకంటి ప్రమోద్‌కుమార్ తెలిపారు. బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో అత్యంత సంక్లిష్టమైన టీఏవీఆర్ ప్రక్రియ విజయవంతం కావడంతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ.. శ్వాస ఆడకపోవడం, ఛాతి నొప్పి, కళ్లు తిరగడం వంటి లక్షణాలతోపాటు కిడ్నీ, కాలేయ సంబంధిత సమస్యలతో పేషెంట్ ఆస్పత్రిలో చేరారని తెలిపారు. వయసుతో పాటు ఇతర సమస్యల కారణంగా రోగికి శస్త్ర చికిత్సచేయడం ప్రమాదకరమని భావించి టీఏవీఐ ప్రక్రియ ద్వారా ఛాతిని తెరవకుండా గుండె కండరాలను కోయకుండా మత్తుతో తొడ భాగంలోని ధమని ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. సంప్రదాయ ఓపెన్ హార్ట్ సర్జరీతో పోలిస్తే వేగవంతంగా చికిత్స పూర్తవుతుందని, తక్కువ నొప్పి ఉంటుందని, ఆస్పత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం లేదని, జీవితాంతం రక్తం పల్చబడానికి మందులు వాడాల్సిన అవసరం లేదని తెలిపారు. 48 గంటల్లో రోగిని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు.

ఫొటోగ్రఫీలో శరత్‌బాబుకు స్వర్ణ పతకం





అవార్డు దక్కించుకున్న ఛాయాచిత్రం, వనం శరత్ బాబు

శంభునిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మత సాంస్కృతిక సమితి, ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో నగరంలోని శరత్ బాబుకు బంగారు పతకం దక్కింది. ప్రపంచ గిరిజన దినోత్సవం, ఫొటోగ్రఫీ దినోత్సవాల సందర్భంగా 2025 సంవత్సరానికి గాను నిర్వహించిన పోటీల్లో శరత్‌బాబు పాల్గొని తన ప్రతిభను కనబరిచారు. మోనోక్రోమ్ విభాగంలో బంగారు పతకాన్ని అందుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల విభాగంలో మూడవ స్థానంలో నిలిచి మరో అవార్డును సైతం అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బుధవారం అవార్డులు ప్రకటించి అభినందనలు తెలిపినట్లు శరత్‌బాబు తెలిపారు. కాగా ఈనెల 18న విజయవాడలోని బాలోత్సవ్‌భవన్‌లో నిర్వహించే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా శరత్‌బాబు అవార్డు అందుకోనున్నారు. శరత్‌బాబు ఇప్పటి వరకు 150 పైగా అవార్డులు అందుకున్నారు.

బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సురేందర్



వడ్డెపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లికి చెందిన పాండవుల సురేందర్ ముదిరాజ్ బీసీ యువజన సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశం మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు భైరి రవికృష్ణగౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో బీసీ యూత్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పాండవుల సురేందర్ పేర్కొన్నారు.

గట్టెక్కుతున్న వరద కష్టాలు

(5వ పేజీ తరువాయి)

వరంగల్ జిల్లాలో 15.6 మి.మీ. వర్షపాతం రికార్డయింది.

జిల్లాలో వర్షపాతం..

హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లిలో 55.8 మి.మీ., వేలేరులో 30.1 మి.మీ., ఎల్కతుర్తిలో 21.3 మి.మీ., కమలాపూర్‌లో 47 మి.మీ., హసన్‌పర్తిలో 20.9 మి.మీ., ధర్మసాగర్‌లో 16.5 మి.మీ., ఖాజీపేటలో 12.1 మి.మీ., ఐనవోలులో 7.1 మి.మీ., పరకాలలో 68.7 మి.మీ., దామెరలో 26.7 మి.మీ., ఆత్మకూరులో 48.5 మి.మీ., శాయంపేటలో 40.9 మి.మీ., నడికుడలో 72.5 మి.మీ., వర్షపాతం రికార్డయింది. వరంగల్ జిల్లాలో బుధవారం ఖిలా వరంగల్ మండలంలో 19.3 మి.మీ., వరంగల్‌లో 19 మి.మీ., నల్లబెల్లిలో 18.3 మి.మీ., దుగ్గొండిలో 17.5 మి.మీ., గీసుకొండలో 13.1 మి.మీ., ఖానాపూర్‌లో 9.8 మి.మీ., నర్సంపేటలో 9.5 మి.మీ., చెన్నారావుపేటలో 7.8 మి.మీ., సంగెంలో 6.6 మి.మీ., వర్ధన్నపేటలో 4.3 మి.మీ., పర్వతగిరిలో 4.1 మి.మీ., నెక్కొండలో 3.6 మి.మీ., రాయపర్తిలో 2.5 మిమీ వర్షపాతం నమోదైంది.

పొంగుతున్న వాగులు..

భారీ వర్షానికి వరంగల్ జిల్లాలోని పలు చెరువులు పొంగుతున్నాయి. కుండపోతగా కురిసిన వర్షాల వల్ల పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరడంతో దాదాపు అన్ని చెరువులు నిండి మత్తళ్లు పోస్తున్నాయి. నర్సంపేటలోని మాదన్నపేట



ఏసిరెడ్డినగర్‌లో నీరు ఎత్తిపోస్తున్న మహిళ

చెరువు, సంగెం మండలంలోని ఎలుగూరు రంగంపేట చెరువు, పర్వతగిరిలోని ఆకేరు, పరకాలలోని చలివాగు, నడికుడలోని కంఠాత్మకూరు చెరువు, ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ చెరువు వర్ధన్నపేటలోని పంధిని చెరువుతో పాటు పలు చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. హనుమకొండ పట్టణంలోని వడ్డెపెల్లి చెరువు భద్రకాళి చెరువులోకి భారీగా వరద నీరు చేరింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత..

రెండు జిల్లాలో సోమవారం రాత్రి భారీ వర్షాలు కురిసి అనేక ప్రాంతాల్లో జలమయమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అరికట్టేందుకు రెండు జిల్లాల యంత్రాంగాలు అప్రమత్తం అయ్యాయి. వైద్య, ఆరోగ్యశాఖల అధికారులు, సిబ్బంది ముంపు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను అధ్యయనం చేశారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమలు పెరగకుండా మందులు చల్లారు. ఇళ్ల మధ్యలో నిలిచిన వరదనీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, పర్యవేక్షణ ప్రత్యేక అధికారిగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు నియమితులైన రాష్ట్ర ఏయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. వైద్యఆరోగ్య శాఖ అధికారులతో సమావేశమై సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. అలాగే రెవెన్యూ అధికారులు మండలాల్లో పర్యటించారు. వరదల తాకిడికి తీవ్రంగా గురైన ప్రాంతాలను సందర్శించారు. వరదల వల్ల జరిగిన అస్తి నష్టాన్ని అంచనా వేశారు.



ఏసిరెడ్డినగర్‌లో ఇంట్లోకి చేరిన వరదనీరు

పునరావాస కేంద్రాలను పరిశీలించిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో విస్తారంగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజల జనజీవనం అతలాకుతలం అయ్యింది. దీంతో నిరాశ్రయుల కోసం జీడబ్ల్యూఎంసీ సిబ్బంది 6 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాగునీటితో పాటు ఆహార పానియాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పునరావాస కేంద్రాలను సందర్శించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ కలెక్టర్ సత్యశారద, గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణితో పాటు ప్రభుత్వ అధికారులు సందర్శించి ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు మెనూ ఏమేమి ఇస్తున్నారు? అనారోగ్యంతో ఉన్న వారికి వైద్య సేవలు అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. తర్వాత భద్రకాళి బండ్ ప్రాంతంలో నీటి నిలువను పరిశీలించారు. ఎక్కడా నీరు నిలువకుండా ఇంజనీరింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క సూచించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడు దల చేశారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని ప్రజ లు ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని, ఏదైనా ప్రమాదం ఉందని భావిస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. మరో రెండు, మూడు రోజులపాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యం లో ప్రజలు ఎవరూ వాగులు, వంకలు దాటి వెళ్లొద్దని సూచించారు. వర్షాలు పడుతుండటంతో నదులు, వాగులు, చెరువులు, కల్వర్టులు కుంగె ప్ర మాదం ఉన్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి

నిట్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ

- భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు
- నేతృత్వం వహించిన డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఎన్ఐటీలో బుధవారం సాయంత్రం తిరంగా ర్యాలీని ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీకి ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి నేతృత్వం వహించారు. అకెడెమిక్ డీన్ ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి, విద్యార్థి ,సంక్షేమం డీన్ ప్రొఫెసర్ కె కిరణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నిట్ క్యాంపస్‌లోని ప్రధాన పరిపాలనా భవనం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ క్యాంపస్‌లోని పలు ప్రాంతాల మీదుగా సాగింది. దేశభక్తి, ఐక్యతకు సంబంధించిన శక్తివంతమైన నినాదాలతో క్యాంపస్ మారుమ్రోగింది. ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఐకమత్యం, జాతీయ గౌరవాన్ని ప్రతిబింబించే నినాదాలు ర్యాలీలో పాల్గొన్నవారిలో స్ఫూర్తిన్ని నింపాయి.

భారత ప్రభుత్వానికి మద్దతు తెలపడం, జాతీయ ఏకీకరణ సందేశాన్ని వ్యాప్తి చేయడం ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యం. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంపై కళాశాల యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది. వరంగల్ నిట్ ప్రతీ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు నిట్ తన ప్రత్యేక కార్యక్రమాల పరంపరలో భాగంగా దీనిని నిర్వహిస్తుంది. నిట్ క్యాంపస్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి.

కాకతీయుల సాంకేతిక పరిజ్ఞానం అద్భుతం

- కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి

వడ్డెపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయులు సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన శిల్పాలు, దేవాలయాలు అద్భుతమని కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి కొనియాడారు. బుధవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో 'కాకతీయాస్ టెంపుల్స్ - ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్ అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళిగౌడ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రాణి రుద్రమదేవి పరిపాలనలో నీటిపారుదల రంగంలో గొలుసు కట్టు చెరువుల నిర్మాణం ఒక విప్లవమని అన్నారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళిగౌడ్ మాట్లాడుతూ.. కాకతీయుల శిల్పాకళా వైశిష్ట్యం, సాంస్కృతిక వైభవం ఎంతో గొప్పదని అన్నారు. సదస్సులో నర్సంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, రూస పీఎం ఉష, ప్రొఫెసర్ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి

16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



రాంనగర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

- నగరంలో 2వేల మందితో శోభాయాత్ర
- పాల్గొననున్న బండారు దత్తాత్రేయ, మంత్రి కొండా సురేఖ
- 'కుడా' మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

హనుమకొండ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాల పురిటి గడ్డ ఓరుగల్లులో యాదవ వెల్ఫేర్ ట్రస్టు వరంగల్ వేదికగా ఈ నెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు 'కుడా' మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తెలిపారు. ఈ వేడుకల వాల్ పోస్టర్‌ను బుధవారం హనుమకొండలోని రామ్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలను వైభవంగా జానపద కళాకారుల ప్రదర్శనతో గొల్ల, కుర్మ సంస్కృతి సారథ్యంలో ఉత్తర తెలంగాణ వేదికగా గొల్ల, కురుమల ఐక్యతను చాటేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలకు మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, పార్టీలకు అతీతంగా ప్రముఖులు, సినీ ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్‌నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు సాగే శ్రీకృష్ణుడి శోభాయాత్రలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి వేలాది మంది గొల్ల, కుర్మలు పాల్గొంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్, యాదవ వెల్ఫేర్ ట్రస్టు సభ్యులు, కార్పొరేటర్ బొంగు అశోక్, సిద్దిరాజు యాదవ్, బట్టి శ్యామ్ యాదవ్, తిరుపతి యాదవ్, భిక్షపతి యాదవ్, సమ్మయ్య యాదవ్, రాజు యాదవ్, కెంచ కుమారస్వామి, మాదం రజినీకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు

న్యూశాయంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లతో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాస్‌రావు ఆరోపించారు. సీపీఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఈనెల 20, 21, 22 తేదీల్లో మేడ్చల్ జిల్లాలో జరిగే 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌రావు హాజరై జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన మూడు సంవత్సరాల్లో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు విధానాలను వెలుగులోకి తీసుకు రావడంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్ఏ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్‌లతో పాటు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

వైద్యం కోసం రోగి పడిగాపులు

- మూడు రోజులుగా వానలోనే..
- స్పందించిన సూపరింటెండెంట్



బాధితుడి వివరాలు తెలుసుకుంటున్న వైద్యుడు

వరంగల్ మెడికల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఓ రోగి వైద్య చికిత్స కోసం మూడు రోజులుగా ఎంజీఎంలో తడుస్తూ ఎదురు చూశాడు. చివరికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి చొరవతో రోగిని సర్జికల్ వార్డుకు తరలించారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరు గ్రామానికి చెందిన బాసబోయిన రత్నాకర్ ఈ నెల 10న కడుపునొప్పితో ఎంజీఎం ఆస్పత్రికి వచ్చాడు. ఇక్కడి వైద్యులు కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ నెల 12న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించగా ఫైల్స్ సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో రోగిని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. తీరా ఎంజీఎంకు వచ్చాక ఫైల్స్‌కు సంబంధించిన పరికరాలు లేవంటూ చికిత్సకు నిరాకరించారు. అప్పటి నుంచి ఎంజీఎం ఎమర్జెన్సీ ఎదుట వైద్యం కోసం నిరీక్షిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి బుధవారం రోగి వద్దకు చేరుకొని సర్జికల్ వార్డులో చేర్పించారు. ఫైల్స్ సర్జరీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

'చిలువేరు'కు పదవి

- తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా రాజ్‌కుమార్ ఎన్నిక



కేయూ క్యాంపస్ ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా కేయూ హిస్టరీ, టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 8న సదస్సులో ఆయనను ఎంపిక చేశారు. రెండేళ్ళ పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. రాజ్‌కుమార్ కేయూ హాస్టల్స్ జేడీగా, కేయూ అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆయనతో పాటు జనరల్ ప్రెసిడెంట్‌గా ప్రొఫెసర్ ఈ.సుధారాణి, జనరల్ సెక్రటరీగా డాక్టర్ అంకం జయప్రకాశ్, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ బి.లావణ్య, మరో జాయింట్ సెక్రటరీగా ప్రొఫెసర్ జి.దయాకర్, ట్రెజరర్‌గా బి. శ్రీనివాస్‌లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు. రిటర్నింగ్ ఆఫీసర్‌గా కె.విజయబాబు వ్యవరించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు రాత్రి విధుల్లో వైద్యులు




ఇప్పగూడెం పీహెచ్‌సీలో రాత్రి వేళ విధుల్లో ఉన్న సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందించడానికిగాను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 గంటల పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా మండలంలోని ఇప్పగూడెం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది బుధవారం రాత్రి విధులకు హాజరయ్యారు. 13, 14, 15 తేదీలలో మూడు రోజుల పాటు పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఇప్పగూడెం పీహెచ్‌సీ ఎనిమిది గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండే ఆస్పత్రి అయినప్పటికీ మూడు రోజుల పాటు 24 గంటల వైద్యసేవలు అందించున్నారు. భారీ వర్షాలతో సంభవించే వివిధ ప్రమాదాలలో గాయపడే వారికి అత్యవసర సేవలు అందించను న్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వనజ, రేఖ, శోభ, రమ, సునీత, తాళ్లపల్లి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తడికి చేరువలో పాకాల సరస్సు

- 29 ఫీట్లకు చేరిన నీటిమట్టం
- ఒక ఫీటు నీరు చేరితే మత్తడే



నీటితో కళకళలాడుతున్న పాకాల సరస్సు



29 అడుగులకు చేరిన నీటిమట్టం

నర్సంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు మత్తడిచేరువకు చేరుకుంది. గత రబీ సీజన్ అనంతరం ఈ సరస్సులో 30 అడుగుల నీటి మట్టానికి గాను 16 అడుగుల నీటిమట్టం ఉండగా ఇటీవల కురిసిన వర్షాలతో పాటు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులోకి 13 ఫీట్ల నీటి మట్టం చేరుకుని 29 అడుగుల నీటి మట్టానికి చేరుకుంది. మరో ఫీటు నీరు చేరుకుంటే పాఖాల సరస్సు మత్తిడిపోయనుంది సరస్సు నిండుకుండలా మారడంతో సరస్సు కింద వ్యవసాయ పనులను రైతులు ముమ్మరం చేశారు. చెరువు మత్తడి స్థాయికి చేరుకోవడంతో పాటు ప్రస్తుత ఖరీఫ్‌లో పూర్తిస్థాయి ఆయకట్టుతో పాటు రబీలో రొటేషన్ పద్ధతిలో వరి పంట సాగయే అవకాశాలు ఏర్పడ్డాయి.





"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి. 'స్వరాజ్యం మా జన్మహక్కు.' అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.

ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్లు

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి. మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.



ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్‌లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ, స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్లు

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేతుల మీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్లారు. ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలాప్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి సూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్నిసామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహారి బాయి, 102 ఏళ్లు

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఓరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

● **సాంత్వన్,** ఫొటోలు: హరిప్రేమ్

భార్య ఉండగానే రెండోపెళ్లికి ప్రయత్నం

» పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిలిచిన వివాహం

డోర్నకల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భార్య ఉండగానే మరోపెళ్లికి సిద్ధమైన యువకుడిని పోలీసులు అదుపులోకి కౌన్సిలింగ్ నిర్వహించిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మునిసిపల్ పరిధిలోని గొల్లబజారుకు చెందిన ఓ యువకుడు ఇటీవలనే మహిళను వివాహం చేసుకున్నాడు. అయితే ఈ విషయం దాచిపెట్టి రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు. బుధవారం ఉదయం 11గంటలకు తన భర్త రెండో వివాహం చేసుకోబోతున్న విషయం తెలుసుకున్న భార్య పోలీసులకు డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలో దిగిన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో పెళ్లి అర్ధాంతరంగా ఆగిపోయింది. అనంతరం పోలీసులు సదరు పెళ్లి కొడుకుకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఇలాగైతే పరిష్కారం ఎలా!?

(5వ పేజీ తరువాయి)

39,419 దరఖాస్తులు వచ్చాయి. అలాగే భూపాలపల్లి జిల్లాలో 53,763, ములుగు జిల్లాలో 32,118 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయి. ధరణిలో ఎదురైనా భూచిక్కులకు భూభారతిలో పరిష్కారం దొరుకుతుందనే ఆశతో రైతులు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు చేస్తున్నారు.

సాదాబైనామాల పరిష్కారమే సవాల్

భూ భారతిలో సాదాబైనామాల పరిష్కారం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. గ్రామాల్లో చాలామంది రైతులు రెవెన్యూ స్టాంపు పేపర్లు, తెల్లకాగితాలపై భూములు క్రయ విక్రయాలు చేశారు. వీటిని రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా కాస్తులో కొనసాగుతున్నాయి. అయితే ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నప్పటికి రికార్డుల్లో పేరు లేకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. గత ప్రభుత్వం సాదాబైనామాల సమస్య పరిష్కరించేందుకు 2016లో జీవో నెం.153ను తీసుకవచ్చింది. 2014 జూన్ 2వ తేదీకి ముందుగా సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు. సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తుందనే ఆశతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,377 రెవెన్యూ గ్రామా ల నుంచి 1,66,784మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. సాదాబైనామాల సమస్య పరిష్కారం కాకుండానే 29 అక్టోబరు 2020లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల చట్టాన్ని తెచ్చింది. దీంతో దరఖాస్తులను పరిష్కరించాలని రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా రైతు సమస్యలు పరిష్కరించేందుకు రెవె న్యూ సదస్సు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో రెవెన్యూ సదస్సుల్లో తమ సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతోనే రైతులు దరఖాస్తులు చేసుకున్నారు.

పంద్రాగస్టుకు పరిష్కారం కష్టమే..

భూభారతిలో వచ్చిన దరఖాస్తులన్నీ ఆగస్టు 15లోగా పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రైతుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికం సాదాబైనామాలకు సంబంధించినవే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి వివిధ సమస్యలపై 2,35,990 దరఖాస్తులు రాగా, వీటిలో 1,66,784 వరకు సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. దాదాపు 75శాతం సాదాబైనామాలు, అసైన్డ్ భూముల దరఖాస్తులే ఉండటంతో వాటి పరిష్కారం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. భూపాలపల్లి జిల్లాలో మొత్తం 53,763 దరఖాస్తులు వస్తే, 50వేల మంది రైతులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇందులో కేవలం 930 దరఖాస్తులే పరిష్కారం అయ్యాయి. అంటే కేవలం 2శాతం దరఖాస్తులు కూడా పరిష్కారం కాలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

వరంగల్ జిల్లాలో 57,850 దరఖాస్తులు రాగా, వీటిలో 54,900 మందికి పైగా అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిలో 425 దరఖాస్తులు మాత్రమే పరిష్కరించారు. దీనికి ప్రధానంగా దరఖాస్తుల్లో అత్యధికం సాదాబైనామాలు, అసైన్డ్ భూములకు చెందినవే కావడంతో అధికారులు వాటిని పెండింగ్‌లో పెట్టారు. మొత్తం దరఖాస్తుల్లో 25వేలు సాదాబైనామా, 16వేల వరకు అసైన్డ్ దరఖాస్తులే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. మరికొన్ని దరఖాస్తుల్లో కోర్టు కేసుల్లో ఉన్నవి, కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉన్న దరఖాస్తులు ఉన్నాయి. ఇక సాదాబైనామాలపై కోర్టు తీర్పు కోసం ప్రభుత్వం ఎదురు చూస్తోంది. తీర్పుకు అనుగుణంగా సమస్యల పరిష్కరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఆగస్టు 15లోగా భూభారతి దరఖాస్తుల పరిష్కారం అసాధ్యంగా మిగిలింది.

వానొచ్చె.. వరదొచ్చె..

జలకళ సంతరించుకున్న చెరువులు, వాగులు



మత్తడి పోస్తున్న భూపాలపల్లి మండలంలోని నందిగామ సమీపంలోని చెరువు



ములుగు జిల్లా మంగపేట మండలం చెరుపల్లి పెద్ద చెరువు శివారులో వరదతో పొలాల్లో వేసిన ఇసుక మేటలు



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని అర్పనపల్లి వట్టివాగులో తగ్గిన ప్రవాహం



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని దొడ్ల-మల్యాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

పీటల మీద ఆగిన పెళ్లి..

» ప్రేమించిన యువతిని కాదని మరొకరితో వివాహానికి సిద్ధమైన యువకుడు
» వరుడిపై పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
» పెళ్లికి నిరాకరించిన వధువు తల్లిదండ్రులు



పెళ్లి ఆగిపోవడంతో మూగబోయిన పెళ్లి మండపం

లింగాలఘణపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పచ్చని పందిళ్లు.. బ్యాండ్ మేళాలతో పెళ్లి మండపం కళకళలాడుతోంది.. బంధువులు ఒక్కొక్కరుగా పెళ్లి మండపానికి చేరుకుంటున్నారు. బుగ్గన చుక్కపెట్టుకుని.. నుదుట బాసికం కట్టుకుని.. పెళ్లిబట్టలతో ముస్తాబైన వరుడు ఫంక్షన్ హాల్‌లో తనకు కేటాయించిన గదిలో ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నాడు.. అప్పటికే రుచికరమైన వంటలతో ఘుమఘుమలాడే వాసన ఫంక్షన్ హాల్‌ను చుట్టుముట్టేసింది.. మరోవైపు వధువును ఫంక్షన్ హాల్‌కు తీసుకువచ్చి ఎదుర్కోళ్ల తంతుకు బంధువులు ఆతృత పడుతుండగానే పోలీసుల నుంచి ఓ షాకింగ్ సమాచారం అందింది..

అదేమిటంటే.. వరుడు ఓ యువతిని ప్రేమపేరిట మోసం చేసి గర్భిణీ చేశాడని నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు అందినట్లు స్థానిక పోలీసులు అమ్మాయి తల్లిదండ్రులకు సమాచారం చేరవేశారు.. దీంతో అప్పటిదాకా పెళ్లి కళతో ఉన్న వధువు ముఖాన చిరునవ్వు చెదిరిపోయింది.. ఈ హఠాత్పరిణామానికి ఏం చేయాలో తోచక వధువు తల్లిదండ్రులు నిలబడ్డ చోటే కూలబడిపోయారు. బంధువులు, మిత్రుల ఓదార్పుతో కాసేపటికి తేరుకుని ఇక తమ కూతురుని ఇలాంటి మోసగాడికి ఇవ్వొద్దని నిశ్చయించుకున్నారు. ఈ సంఘటన బుధవారం లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల నక్షత్ర గార్డెన్‌లో చోటు చేసుకుంది.

వివరాల్లోకెళితే.. దేవరుప్పుల మండలం రామారాజుపల్లికి చెందిన హరీష్‌గౌడ్‌కు అదే మండలంలోని యువతితో పెళ్లి సంబంధం కుదిరింది. పెద్దల సమక్షంలో కట్నకానుకలను మాట్లాడుకుని బుధవారం పెళ్లి ముహూర్తాన్ని నిశ్చయించుకున్నారు. అనుకున్నట్లే ఎంగేజ్‌మెంట్ పూర్తయింది. బంధుమిత్రులను ఆహ్వానించుకున్నారు. వియ్యాలవారిద్దరూ అంతా సిద్ధం చేసుకోవడంతో వరుడు హరీష్ ఫంక్షన్‌హాల్‌కు చేరుకున్నాడు. మరికొద్దిసేపట్లో వధువు కూడా ఫంక్షన్‌హాల్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమయింది. ఆర్‌బీఎల్ అనే ప్రైవేట్ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న హరీష్ తనను ప్రేమించాడని తమ మధ్య శారీరక సంబంధం కూడా ఉందని హరీష్ కారణంగా తాను ఇప్పుడు గర్భవతినని, కాసేపట్లో హరీష్ పెళ్లి పీటలు ఎక్కబోతున్నాడని పెళ్లిని అడ్డుకుని న్యాయం చేయాలంటూ విజయవాడకు చెందిన ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగిని నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దీంతో అక్కడి పోలీసులు విచారణలో భాగంగా దేవరుప్పుల పోలీసులకు సమాచారమిచ్చారు. స్థానిక పోలీసులు విషయాన్ని అమ్మాయి తల్లిదండ్రులకు చేరవేయడంతో వధువును ఫంక్షన్‌హాల్‌కు తీసుకెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. మోసగాడికి ఇచ్చి పెళ్లి చేసేదిలేదని స్పష్టం చేశారు. అయితే అదే ఫంక్షన్‌హాల్‌లో ఇరువర్గాల పెద్దలు కూర్చు ని ఇప్పటికే అప్పగించిన కట్నకానుకలతో పాటుగా భోజనాలు, ఫంక్షన్ హాల్, పెళ్లిపందిరి ఖర్చులకు అదనంగా రూ. 4.50 లక్షలు వధువు కుటుంబానికి చెల్లించాలని తీర్మానించినట్లు తెలిసింది. పెళ్లి ఆగిపోయిన విషయం తెలియని బంధువులు ఫంక్షన్‌హాల్‌కు కుటుంబ సమేతంగా చేరుకుని మూగబోయిన పెళ్లి మండపాన్ని చూసి ఆందోళనకు గురయ్యారు. వరుడి చేసిన మోసంపై అమ్మాయి తరపున బంధువులు తల్లిదండ్రులు శాపనార్థాలు పెట్టి వెళ్లిపోయారు. సుమారు 1500 మంది కోసం వండిన వంటలు అనాథాశ్రమంలో అందజేసినట్లు సమాచారం.



పెళ్లికి ఆహ్వానిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ←

ట్రాక్టర్ పైనుంచి పడి విద్యార్థి మృతి

» పాఠశాలకు వెళ్లి వస్తుండగా ఘటన

శాయంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లి వస్తూ ఇంటికెళ్లే క్రమంలో ట్రాక్టర్ ఎక్కిన పదో తరగతి విద్యార్థి కింద పడిపోయి మృతి చెందాడు. ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండలం హౌజ్‌బుజుర్గ్ గ్రామానికి చెందిన షేక్ కమాల్ అనే వ్యక్తి బండరాయి కొడుతూ జీవిస్తున్నాడు. కమాల్‌కు ఇద్దరు కుమారులు కాగా, పెద్దకుమారుడు షేక్ ఫరాజ్ అహ్మద్(16) మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ప్రతిరోజూ హౌజ్‌బుజుర్గ్ నుంచి నేరేడుపల్లికి బస్సు లేదా కాలినడకన వచ్చి వెళ్తుంటాడు. ఈ నెల 12న సాయంత్రం పాఠశాలకు వెళ్లి ఇంటికెళ్లే క్రమంలో అదే గ్రామానికి చెందిన సయ్యద్ ఉమర్ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ఫరాజ్‌తో పాటు మరికొంత మంది విద్యార్థులు ఎక్కారు. డ్రైవర్ సయ్యద్ ఉమర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ నేరేడుపల్లి గ్రామ శివారులో మూలమలుపు వద్ద ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్‌లో నుంచి ఫరాజ్ అహ్మద్ కిందపడిపోయాడు. దీంతో తల, ఛాతి, నడుం భాగాలలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆరెపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఫరాజ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి కమాల్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.



షేక్ ఫరాజ్ అహ్మద్ (ఫైల్)

యాదవులపై పరిశోధన గ్రంథం ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కేయూ చరిత్ర విభాగం పరిశోధకుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి సంపాదకత్వంలో రూపొందించిన 'హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ గొల్లస్ ఇన్ తెలంగాణ' అనే పరిశోధన పుస్తకాన్ని బుధవారం కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఆవిష్కరించారు. కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో పోతరవేణి తిరుపతి పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం పర్యవేక్షకులు, కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, పుస్తక సంపాదకులు డాక్టర్ తిరుపతి పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రామచంద్రం, మనోహర్, సురేశ్‌లాల్

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్ అన్నారు. కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాలను వినియోగించొద్దని బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, జీవితాన్ని చెడగొట్టే అలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్యాలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా సంక్షేమాధికారి జయంతి, జడ్పీసీఈవో విద్యాలత, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్‌లతో పాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్

వరంగల్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో యాంటీ డ్రగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి, డ్రగ్ వినియోగం ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. డ్రగ్‌కు బానిసలైన వారిని డీ- అడిక్షన్ సెంటర్‌లకు పంపించి కౌన్సిలింగ్ ఇప్పించాలన్నారు. విద్యార్థులందరూ సామాజిక బాధ్యతగా వ్యవహరించి డ్రగ్ విక్రయాలు జరిగినా, సేవించిన సమాచారం అందించాలన్నారు. వరంగల్ కమిషనరేట్ డ్రగ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడంతో విద్యార్థుల పాత్ర ఉండాలన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్

మడికొండ (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మడికొండ చౌరస్తాలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాలను వ్యతిరేకిస్తూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కిషన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. మాదక ద్రవ్యాలను వినియోగించే వ్యక్తితోపాటు అతని కుటుంబం, సమాజంపై సైతం తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. కార్యక్రమంలో మడికొండ పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.


మడికొండ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

- కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి


కేయూలో డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు అలవాటుపడి యువత ఉజ్వలమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. బుధవారం కేయూ పరిపాలన భవనం వద్ద రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నేతృత్వంలో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి, భారవీశర్మ, మంజుల, రాధికారాణి, ఎఫ్‌వో హబీబుద్దీన్, డీఆర్‌లు పంజాల శ్రీధర్, ఏఆర్‌లు డాక్టర్ కోల శంకర్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, ఎన్నీవోఎస్ అధ్యక్ష కార్యదర్శులు బూర నవీన్‌కుమార్, వల్లాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు శూన్యం


ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్ తదితరులు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తూ వరదలు వస్తే నగరంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడం లేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. బుధవారం సాయంత్రం హనుమకొండలోని 4వ డివిజన్ జ్యోతిబస్ నగర్, 5వ డివిజన్ డబ్బాలు పెద్దమోరి, నయీంనగర్ నాలాను బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి వినయ్ భాస్కర్ పరిశీలించారు. బస్తీ ప్రాంతాలు నీట మునిగితే మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు సహాయక చర్యల్లో పాల్గొనడం లేదని అన్నారు. వర్షం నీరు నిలిస్తే నీటిని తోడేందుకు జేసీబీ పంపమని మున్సిపల్ అధికారులను అడిగితే డీజిల్ లేదని సమాధానం చెబుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది సాక్ష్యమని అన్నారు. 2020లో ఎన్నడూచూడని వరదలు వచ్చాయని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 250 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. రూ. 75 కోట్లతో సమ్మయ్య నగర్ నాలాను అభివృద్ధి చేశామని, ఆ ప్రాంతాలు సురక్షితంగా ఉన్నాయని తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సురక్షితంగా ఉండాలని ఎవరైనా ఆపదలో ఉంటే బీఆర్‌ఎస్ శ్రేణులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, సంకు నర్సింగ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు మనోజ్‌కుమార్, సదాంత్, ప్రణయ్, రాంమూర్తి, జయరాం, దశరథ్, మనోహర్, వినిల్‌రావు, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు


అశోక కాలనీలో పరిశీలిస్తున్న మున్సిపల్ డీఈ సారంగం తదితరులు

వడ్డెపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం ప్రభావానికి గురైన హనుమకొండలోని లోతట్టు ప్రాంతాలను అధికారులు బుధవారం సందర్శించారు. హనుమకొండ 57వ డివిజన్ అశోక కాలనీ, గోకుల్‌నగర్, సమ్మయ్య నగర్, ఇంజనీర్స్ కాలనీ, వాజ్‌పాయ్ కాలనీ, విద్యానగర్ ప్రాంతాల్లో వర్షంతో ప్రజలు ఎన్నో అవస్థలు ఎదుర్కొన్నారు. అశోక కాలనీ లోతట్టు ప్రాంతంలో వరద ఉధృతి పెద్ద మొత్తంలో వచ్చింది. దీని ప్రభావంతో అశోక కాలనీ రోడ్డు నంబర్ 2, 3, 4, 5లలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో నివాస గృహాల్లో ఉన్న నిత్యావసర వస్తువులు, సామగ్రి తడిసి పెద్ద మొత్తంలో నష్టపోయారు. అశోక కాలనీలోని పలు ఇళ్ల ముందు వర్షపు నీరు చేరడంతో ప్రహరీ గోడలు కూలిపోయాయి. బుధవారం మున్సిపల్ డీఈ ఎస్.సారంగం, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డి, అశోక కాలనీ అధ్యక్షుడు మందల కృష్ణారెడ్డి, కనకరాజు తదితరులు కాలనీలో నష్టపోయిన ప్రాంతాలను సందర్శించారు. సహాయక చర్యలను చేపట్టారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో యంత్రాలతో లోతట్టు ప్రాంతాల్లో చదును చేసి నిలిచిన వర్షపు నీటిని తరలించారు. నష్టపోయిన అంచనా వివరాలను మున్సిపల్ కమిషనర్‌కు అందించాలని అశోక కాలనీ వాసులు అధికారులను కోరారు.

అంబరాన్నంటిన తీజ్ సంబరాలు


తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ నరేష్ నాయక్

వడ్డెపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బంజారా సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా తీజ్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని భూపాలపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ నాయక్ అన్నారు. బుధవారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో గ్రేటర్ వరంగల్ గోర్ బంజారా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బంజారా మహిళలు తమ సంస్కృతిని ఉట్టి పడే రీతిలో ఆట పాటలతో బంజారాల ఆరాధ్యదైవం మేరామాయాడీ, సంత్ సేవాలాల్ మహరాజ్‌లను స్తూతిస్తూ అలరింప చేశారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ గోర్ బంజారా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆంగోతు వినోద్ లోక్‌నాయక్, డాక్టర్ గుగులోత్ రాజునాయక్, బాదావత్ బాలాజీ నాయక్, మాలోతు నానునాయక్, లకావత్ రవీందర్, బోడ నర్సింహ, కేలోతు భిక్షపతి, దుంగ్రోత్ కిశోర్ నాయక్, కొడకండ్ల జడ్పీటీసీ మాజీ సభ్యురాలు కేలోతు సత్తెమ్మ, ఆంగోతు రమతోపాటు బంజారా యువతులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కాజీపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ప్రశాంత్‌నగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయానికి నార్లగిరి సంపత్, కుటుంబ సభ్యులు బోనాలతో చేరుకుని సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, బీఆర్‌ఎస్ జిల్లా మాజీ కార్యదర్శి నార్లగిరి రమేశ్, శంకర్, రవి, కుమారస్వామి, దశరథం, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాజీపేట దర్గా ఉర్సుకు ఏర్పాట్లు

మేయర్ గుండు సుధారాణి

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి 22 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కాజీపేట దర్గా ఉత్సవాలకు గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫిరెన్స్ హాల్‌లో ఖాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం మేయర్ వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దర్గా పీఠాధిపతి, మేయర్, గ్రేటర్ కమిషనర్, ఇతర శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కాజీపేట ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. రోడ్ల మరమ్మత్తులు, విద్యుత్ దీపాల అలంకరణ, జనరేటర్, తదితర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాల నేపథ్యంలో తాగునీటి సౌకర్యాన్ని కల్పించడంతో పాటు పారిశుధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వైవీ గణేష్, కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా, జిల్లా మైనార్టీ వేల్ఫేర్ అధికారి గౌస్ హైదర్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

కోటలో స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు


మధ్యకోటలో వేడుకలకు దోజర్‌తో మట్టిని చదును చేయిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం కోసం ఖిలావరంగల్ మధ్యకోటలో పోలీసు గ్రౌండ్ పనులను ప్రారంభించారు. బుధవారం మధ్యకోటలోని ఖుష్ మహల్ గ్రౌండ్‌లో బల్దియా సిబ్బంది పారిశుధ్య పనులను చేపట్టారు. అలాగే స్పెషల్ పార్టీ పోలీసులు ఖిలా వరంగల్ మధ్యకోటలో ఉదయం కంకర, మొరం పోసి నేలను చదును చేయించి, ఖిలావరంగల్ కోటను పోలిన రూపంలో ఆర్చిని ఏర్పాటు చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో జరిమానా

వరంగల్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ఒకరికి జైలు శిక్ష, 22 మందికి రూ.25,000 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన మరో ఐదుగురికి రూ. 4,000 జరిమానా విధించారని తెలిపారు.

విజేతలకు సన్మానం

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4నుంచి 6 వరకు నిజామాబాద్‌లో నిర్వహించిన టీజీ ట్రాన్స్ కో- టీజీ డిస్కంల ఇంటర్ సర్కిల్ హాకీ, కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎన్పీడీసీఎల్ ఉద్యోగులను హనుమకొండ ఎస్ఈ మధుసూదన్‌రావు, టెక్నికల్ డీఈ విజేందర్‌రెడ్డి బుధవారం ఎస్ఈ కార్యాలయంలో అభినందించారు.

కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం

అధ్యక్ష కార్యదర్శులుగా నారాయణ, పుల్లా శ్రీనివాస్

కేయూ క్యాంపస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మరో దఫా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా ఉపాధ్యక్షులుగా నమిండ్ల కిరణ్ కుమార్, పులిశేరు భాస్కర్, ట్రెజరర్‌గా దామెర ఆనందం, ఆర్గనైజన్ సెక్రటరీగా భూక్య రాజు, రీక్రియేషన్ సెక్రటరీగా రాదండి నరేశ్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా జి.సేవియా, కె.వెంకటనర్సయ్య, బొక్క మొగిలి, ఎం.బుచ్చయ్య, ఎస్.మహర్షి, బొల్లేపాక ప్రభాకర్, ఐతా శ్రీకాంత్, మానుపాటి రాజేశ్‌లు ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా పుల్లా శ్రీనివాస్ వరుసగా ఆరోసారి ఎన్నికయ్యారు. 19 ఫిబ్రవరి 2009 నుంచి ఆయన ఆ పదవిలో కొనసాగుతున్నారు. 2, 3, 4, 5 దఫాలుగా ఎన్నికల్లో గెలుపొందగా మిగతా సమయంలో ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈనెల 12న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ముగిసింది. 13న బుధవారం సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు. నూతన కమిటీ మూడేళ్ళ (2025-2028) పాటు పదవిలో కొనసాగుతుంది. వర్సిటీలో ఎస్టీ,ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని నూతన అధ్యక్షకార్యదర్శులు, బాధ్యులు తెలిపారు.


నూతన కమిటీ బాధ్యులకు ఎన్నిక పత్రాలను ఇస్తున్న కట్ల రాజేందర్, నేతాజీ

కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. 2021 జూన్ నెలలో విడుదల చేసిన షెడ్యూల్డు పరిశ్రమల జీవోలను యథాతథంగా గెజిట్ చేయాలని, 68వ షెడ్యూల్డు పరిశ్రమల జీవోలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్‌కు అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శరీర దానానికి అంగీకారం



శరీరదానం చేసేందుకు అంగీకార పత్రాలను ఇస్తున్న దాతలు ←

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అవయవ దాన దినోత్సం సందర్భంగా హనుమకొండ 52వ డివిజన్ ఆదర్శకాలనీకి చెందిన మర్రిపెల్లి కవిత, 7వ డివిజన్ బ్రాహ్మణవాడకు చెందిన వేముల మార్కెండేయలు మరణాంతరం తమ శరీరాలను దానం చేసేందుకు అంగీకార పత్రాలు అందజేశారు. బుధవారం ఆదర్శకాలనీలో జరిగిన అవయవ దాన దినోత్సవం కార్యక్రమంలో తెలంగాణ నేత్ర, శరీక అవయవ దాతల అసోసియేన్‌కు అంగీకార పత్రాలు అందజేసినట్లు అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు తెలిపారు. కాళోజీ స్ఫూర్తితో తమ మరణాంతరం మృతదేహాలను కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేయాలనే ఆలోచన కవిత, మార్కెండేయకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వైద్యం రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు


విద్యుత్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ట్రాన్స్‌కో డీఈ బుధవారం ఆస్పత్రిని సందర్శించారు. కాగా, వర్షాకాలంలో ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంవో డాక్టర్ రోషన్ డీఈని కోరారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సర్జరీలకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టారు.

వేగవంతంగా పన్నులు వసూలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాజ్‌పాయ్

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు ప్రతీ రోజు వారికి నిర్దేశించిన వసూళ్ల లక్ష్యాన్ని కచ్చితంగా సాధించాలన్నారు. పన్ను వసూళ్లలో వెనకంజలో ఉన్న సిబ్బంది ఆగస్టు 31 లోగా పురోభివృద్ధి కనిపించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సుదీర్ఘ కాలంగా పన్నులు చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్న వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. పన్నులు చెల్లించని యజమానులను గుర్తించి వారి ఇంటి నల్లాలు తొలగించాలని, డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో ఆస్తులు జప్తు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటి కమిషనర్ ప్రసన్నరాణి, టీవో రామకృష్ణ, ఆర్‌వోలు పాల్గొన్నారు.

కేయూ మెడికల్ ఆఫీసర్‌గా శంకర్

కేయూ క్యాంపస్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కేయూ హెల్త్ సెంటర్‌కు మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ కె.శంకర్ నియమితులయ్యారు. బుధవారం వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులను అందజేశారు. కేయూ క్యాంపస్ హెల్త్ సెంటర్‌తో పాటు సుబేదారి లోని ఆర్ట్స్ కళాశాలల హెల్త్ సెంటర్‌లోనూ ఆయన విధులు నిర్వహిస్తారు.


- కేయూ బీసీ సెల్ డైరెక్టర్‌గా సతీశ్..

కేయూ జియాలజీ కాంట్రాక్టు అధ్యాపకుడు బి.సతీశ్‌ను కేయూ బీసీ సెల్, మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సెంటర్ కొత్త డైరెక్టర్‌గా నియమించారు. ఇప్పటి వరకు డైరెక్టర్‌గా పని చేసిన ఆకుతోట శ్రీనివాసులు పదవీ కాలం పూర్తవడంతో సతీశ్‌ను నియమించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడుదలకు సిద్ధం



హీరో విజయ్ ఆంటోని నటిస్తున్న 25వ చిత్రం 'భద్ర కాళి'. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా అరుణ్ ప్రభు తెరకెక్కిస్తున్నారు. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో రామాంజనేయులు జవ్వాజి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. వచ్చే నెల 19న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. ఈ సినిమాను తెలుగులో ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్స్, స్పిరిట్ మీడియా సంయుక్తంగా విడుదల చేస్తున్నాయి. వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అక్కినేని కలల సౌధ నిర్మాణానికి యాభై ఏళ్లు!





అక్కినేని నాగేశ్వరరావు కలల సౌధం అన్నపూర్ణ స్టూడియో. చుట్టూ కొండలు, బండరాళ్లు, చెట్ల పొదలతో నిండిన ఎత్తయిన ప్రదేశంలో ఒక అద్భుతమైన స్టూడియో నిర్మించి తెలుగు చిత్ర పరిశ్రమకు తనవంతు కానుకగా అందించారు అక్కినేని. 'ఈ నిర్జన ప్రదేశంలోకి ఎవరు వస్తారు!' అని చాలామంది వ్యంగ్యంగా మాట్లాడినా ఆయన పట్టించుకోలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనకు కేటాయించిన 22 ఎకరాల స్థలంలో సరిగ్గా ఇదే రోజున అంటే 1975 ఆగస్టు 14న (ఆ రోజు అక్కినేని అన్నపూర్ణ పుట్టినరోజు కావడం గమనార్హం) భూమి పూజ చేసి స్టూడియో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు ఏయన్నార్. తన మనవడు, నేటి నటుడు సుమంత్ చేతుల మీదుగా భూమి పూజ జరిపించారు అక్కినేని అన్నపూర్ణ. ఈ కార్యక్రమంలో అక్కినేని వెంకట్ కూడా పాల్గొన్నారు. కొండలు ఛేదించి, బండలు పగులకొట్టి భూమిని చదును చేసి చకచకా నిర్మాణం జరిపి మొదట రెండు ఫ్లోర్లు సిద్ధం చేశారు 1976 జనవరి 14న అన్నపూర్ణ స్టూడియోను ఆనాటి రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించారు. ఈ స్టూడియోలో నిర్మాణం జరుపుకొన్న తొలి చిత్రం అక్కినేని, వాణిశ్రీ జంటగా నటించిన 'సెక్రటరీ'. కె.ఎస్.ప్రకాశరావు దర్శకత్వంలో రామానాయుడు ఆ చిత్రాన్ని నిర్మించారు.

బెంగాలీ సినిమాకు ప్రోత్సాహం

● **బెంగాల్ ప్రభుత్వం తాజా నిర్ణయం**

బెంగాలీ చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడానికి, పరిరక్షించడానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణ మూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతీ థియేటర్లో బెంగాలీ సినిమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని.. ఏడాదంతా బెంగాలీ సినిమాలు ఆడాల్సిందేనని బుధవారం ఆదేశించింది. 'బెంగాల్లోని ప్రతీ థియేటర్లో రోజూ తప్పనిసరిగా ఒక బెంగాలీ సినిమా ప్రదర్శించాలి. అది కూడా ప్రైమ్ టైమ్ షోల్లో అంటే మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి తొమ్మిది గంటల మధ్య ప్రదర్శించాలి. ఇది రాష్ట్రంలోని మల్టీప్లెక్స్‌లు సహా ప్రతీ సినిమా థియేటర్‌కూ వర్తిస్తుంది' అని పేర్కొంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రానుంది. బెంగాలీ సినిమాకు ఇది ఒక గొప్ప విజయంగా అక్కడి చిత్ర ప్రముఖులు భావిస్తున్నారు.

నిర్మాతల షరతులకు ఫెడరేషన్ అంగీకరించాలి



దిల్ రాజు

సినీ కార్మికుల వేతన సమస్యకు ఓ పరిష్కారం తెచ్చేందుకు బుధవారం నిర్మాతల మండలి సభ్యులు, ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు మరోసారి ఫిల్మ్ ఛాంబర్‌లో సమావేశమయ్యారు. చర్చల్లో వేతనాల పెంపు అంశం ఇంకా కొలిక్కి రాలేదని, మరో రెండు మూడు సార్లు నిర్మాతలు, ఫెడరేషన్ నాయకుల మధ్య చర్చలు జరగాల్సి ఉందని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వేతనాలు పెంచాలంటే ఫెడరేషన్ నాయకులు, నిర్మాతలు కోరుతున్న కొన్ని షరతులకు అంగీకరించాలి. ఇదే విషయాన్ని ఛాంబర్ దృష్టికి తీసుకువచ్చాం. వాటిపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటే నిర్మాతలు వేతనాలు పెంచడానికి సిద్ధంగా ఉన్నారు. రూ.2 వేల కంటే తక్కువకి పనిచేసే వారికి ఒక పర్సెంటేజీ ఆఫర్ చేశాం. అంతకంటే ఎక్కువ తీసుకునే వారికి మరో పర్సెంటేజీ ఆఫర్ ప్రతిపాదించాం. ఫెడరేషన్‌లోని అన్ని యూనియన్లతో మాట్లాడుకుని వస్తే, దీనిని పరిష్కరిస్తాం. ప్రస్తుతం సానుకూల ధోరణిలోనే చర్చలు సాగిస్తున్నాం' అని చెప్పారు. 'నిర్మాతలు వారి షరతులు చెప్పారు. మరో రెండు మూడు రోజుల పాటు చర్చలు సాగుతాయి' అని నిర్మాత సి.కల్యాణ్ పేర్కొన్నారు. 'ఈ రోజు జరిగిన చర్చలు సరిగ్గా సాగలేదు. నిర్మాతలు కాలయాపన ధోరణి ప్రదర్శిస్తున్నారు. మేము ఇరువైపులా న్యాయం జరగడానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నా, నిర్మాతలు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు' అని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'గతంలో మేము చెప్పిన షరతులపై ఈ సమావేశంలో మాట్లాడాం. మేము చెప్పిన షరతులను అంగీకరిస్తే ఎలాంటి న్యాయం చేస్తారో చెప్పాలని కోరాం. ఏ రోజుకు ఆ రోజు వేతనాల చెల్లింపు గురించి చర్చించలేదు' అని ఫెడరేషన్ కార్యదర్శి అమ్మిరాజు అన్నారు.

ధర్మ ధ్వజం రెపరెపలాడాలంటే..



సత్యరాజ్ ప్రధాన పాత్రలో మోహన్ శ్రీవత్స తెరకెక్కించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. వశిష్ఠ.ఎన్.సింహా, సత్యం రాజేశ్, ఉదయభాను కీలక పాత్రలు పోషించారు. దర్శకుడు మారుతి సమర్పణలో విజయ్‌పాల్ రెడ్డి అడిదాల నిర్మించారు. ఈనెల 22న చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'చూడు బార్బరికా, ఈ యుద్ధం నీది. ధర్మ ధ్వజం రెపరెపలాడాలంటే అధర్మం చేసేవారికి దండన లభించాలి' వంటి సంభాషణలు, లవ్‌స్టోరీ, విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఓ పురాణ కథకి, ప్రస్తుత సామాజిక సమస్యల్ని లింక్ చేస్తూ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది.

బెట్టింగ్ యాప్స్ కేసులో ఈడీ విచారణకు హాజరైన మంచు లక్ష్మి

మూడున్నర గంటలు విచారించిన అధికారులు



హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ కేసుకు సంబంధించి సినీ నటీ మంచు లక్ష్మి బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. యోలో 247 అనే బెట్టింగ్ యాప్‌నకు మంచు లక్ష్మి ప్రమోషన్ చేశారు. ఈ క్రమంలో ఆమెను ఈడీ అధికారులు విచారణలో భాగంగా ఎంత పారితోషికం తీసుకున్నారు? ఎన్నాళ్లు ప్రమోషన్ చేశారు వంటి వివరాలను అడిగారు. ఆమె బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలించి తన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. దాదాపు మూడున్నర గంటలు మంచు లక్ష్మిని ఈడీ అధికారులు విచారించారు. బెట్టింగ్ యాప్స్ కేసుకు సంబంధించి ఇప్పటికే సినీ నటులు ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, దగ్గుబాటి రానాలను ఈడీ అధికారులు విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేయడం ద్వారా ఆయా నటులకు వచ్చిన పారితోషికం ఎంత? ఆ పారితోషికానికి సంబంధించిన అగ్రిమెంట్ల ప్రకారం బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లించారా? లేదా హవాలా చెల్లింపులు జరిగాయా? అనే కోణంలో ఈడీ అధికారులు విచారణ చేస్తున్నారు. తెలంగాణలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన ఐదు ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

ఏపీ వ్యవహారంపై రాహుల్ సైలెంట్!

రాహుల్, రేవంత్, చంద్రబాబు హాట్‌లైన్‌లో మాట్లాడుకుంటారు

చంద్రబాబు ఈ ముసలి వయసులో రామాకృష్ణా అనుకుంటే పుణ్యమైనా వస్తుంది

ఇలాగే చేస్తే నరకానికి పోతారు: జగన్



అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఓట్ల చోరీ గురించి మాట్లాడే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఏపీలో ఓట్ల చోరీ గురించి ఎందుకు మాట్లాడరని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు హాట్‌లైన్‌లో మాట్లాడుకుంటారని, అందువల్లే ఏపీ వ్యవహారంపై రాహుల్ ఏం మాట్లాడరని ఆరోపించారు. ఏపీలోని తాడేపల్లిలో తన నివాసంలో బుధవారం 'ఎంపిక చేసుకున్న' మీడియాతో జగన్ మాట్లాడారు. దేశంలో ఏపీలోనే అత్యధికంగా ఓట్ల చోరీ జరిగిందని చెప్పారు. రాహుల్ పోరాటంలో తనను చేరమనడానికి అర్థం ఉండాలంటూ ఓ మీడియా ప్రతినిధిపై అసహనం వ్యక్తం చేశారు. ఏపీలోని కుంభకోణాలపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ నోరెత్తరు కానీ తనపై మాత్రం విమర్శలు చేస్తారన్నారు. 2029 ఎన్నికల్లో చంద్రబాబుకు డిపాజిట్లు కూడా రావన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోలీసులు పచ్చచొక్కాలు వేసుకుని డ్యూటీ చేశారని విమర్శించారు. 'ఇవే మీకు చివరి ఎన్నికలు కావచ్చు. ఈ ముసలి వయసులో రామాకృష్ణా అనుకుంటే పుణ్యమైనా వస్తుంది. ఇలాచేస్తే గనుక నరకానికి పోతారం'టూ చంద్రబాబుకు శాపనార్థాలు పెట్టారు. ఆయనను ఎవరూ లీడర్ అనరని.. ఫ్రాడ్‌స్టర్ అంటారంటూ అక్కసు వెళ్లగక్కారు. రాష్ట్ర ఎన్నికల సంఘం డమ్మీ పాత్రను పోషిస్తోందని విమర్శించారు. జడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేయాలంటూ కోర్టుకు వెళతామన్నారు.

జగన్ 'హాట్‌లైన్' వ్యాఖ్యలు హాస్యాస్పదం

- **ఎన్నికల్లో ఓడినా వైసీపీ అధినేత ఆలోచన మారలే**
- **ఏపీలో తప్పు జరిగితే ఎన్నికల సంఘాన్ని నిలదీయకుండా రాహుల్ గాంధీని నిందించడం ఏంటి ?**
- **కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి మధ్య హాట్‌లైన్ ఉండడం వల్లే ఏపీ ఎన్నికల అంశాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించడం లేదంటూ వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి అధికారం కోల్పోయినా జగన్ ఆలోచనా విధానంలో మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. ఈ మేరకు న్యూఢిల్లీలో బుధవారం మాట్లాడిన చామల.. రాహుల్ గాంధీపై వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ఏపీ ఎన్నికల్లో ఏమైనా తప్పులు జరిగాయనే భావిస్తే జగన్ తప్పుపట్టాల్సింది మోదీ, అమిత్ షా, ఎన్నికల సంఘాన్ని అని స్పష్టం చేశారు. అలా కాకుండా రాహుల్ గాంధీని ఎందుకు నిందిస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత వైఎస్ జగన్ ఆలోచన విధానం అర్థం కావడం లేదన్నారు. నిజంగా ఎన్నికల ప్రక్రియలో తప్పులు జరిగాయని జగన్ భావిస్తే రాహుల్ గాంధీకి మద్దతు ఇచ్చి విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొనాలని సూచించారు. రాహుల్ గాంధీ నిబద్ధత, నిజాయతీ కోసం మాట్లాడే అర్హత జగన్‌కు లేదని స్పష్టం చేశారు. జగన్ తన మీదున్న కేసులకు భయపడే నరేంద్ర మోదీ, అమిత్ షాకు వ్యతిరేకంగా మాట్లాడరని చామల ఎద్దేవా చేశారు. కేంద్రంలో మోదీ ప్రస్తుతం అధికారంలో ఉండడానికి కారణం చంద్రబాబేనన్న సంగతి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

సాగర్‌కు వస్తున్న వరద నిర్వహణ సరిగా లేదు

- **వరదలకు తగ్గట్టు ఎప్పటికప్పుడు గేట్లను ఎత్తండి**
- **తెలంగాణకు ఏపీ జలవనరుల శాఖ లేఖ**

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయానికి వస్తున్న భారీ వరద నిర్వహణ సరిగ్గాలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేర్కొంది. జలాశయంలో బుధవారం ఉదయం 11 గంటల నాటికి నీటి మట్టం 589.2 అడుగులు, నిల్వ 309.65 టీఎంసీలకు చేరగా.. కేవలం 2.4 టీఎంసీల మేర జలాశయాన్ని ఖాళీ (ఫ్లడ్ కుషన్)గా ఉంచారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈమేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్‌కు ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ (ఇరిగేషన్) నరసింహమూర్తి లేఖ రాశారు. ఎగువ పరీవాహకంలోని ప్రాంతాల్లో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలున్న నేపథ్యంలో సాగర్‌కి వచ్చే వరద మరింతగా పెరగనుందని, వరదలను సమీక్షిస్తూ దానికి తగ్గట్టూ క్రస్ట్ గేట్లను ఎత్తకపోతే దిగువన ఏపీలోని ప్రాజెక్టులకు ముప్పు ఏర్పడనుందన్నారు. ఎగువ నుంచి వరదను ప్రణాళికబద్ధంగా కిందికి విడుదల చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగర్ నుంచి దిగువన ఏపీలోని ప్రాజెక్టులకు విడుదల చేస్తున్న వరదను అకస్మాత్తుగా పెంచకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాగర్ పటిష్ఠతకు భంగం కలగకుండా వ్యవహరించాలని, లేకుంటే దిగువ ప్రాంతాల్లోని ప్రజలు, ప్రాజెక్టులకు నష్టం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

FARNAZ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము
జోగులాంబ గద్వాల జిల్లా

గెజిట్ నం. 13/2025 తేది : 07.08.2025
లేఖ సంఖ్య: D1/19/A/2023, D1/19/B/2023, D1/19/2023, D1/19/C/2023, D1/19/D/2023

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

ఫారం. 6
ప్రాథమిక ప్రకటన

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం తనగాల గ్రామాల పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ. 567.45 సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా 1) Pressure Main Canal 2) Bund 3) FRL 4) Feeder Canal 5) Cistern of Mallamma Kunta Balancing Reservoir నిమిత్తం జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో బాగంగా సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టరు జోగులాంబ గద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ సవరణ చట్టము 2016 (యాక్ట్ నెం. 21/2017) సెక్షన్ 10 ఎ క్రింద మినహాయింపు ఇవ్వబడియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావము అధ్యయన వేదిక అవసరం లేనందున అనుబంధంలో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.

షెడ్యూల్

Pressure Main Canal

1) D1/19/A/2023
గ్రామము: తనగాల మండలం: వడ్డేపల్లి జిల్లా:జోగులాంబ గద్వాల

క్రమ సం.	సర్వే నం. / సబ్ డివిజన్	పట్టా/ఇనాం etc.	భూ వర్గీకరణ మెట్ట/ తరి	సేకరించవలసిన విస్తీర్ణం (ఎ.సెం)	పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు	సరిహద్దులు				చెట్లు		నిర్మాణము	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	252	పట్టా	మెట్ట	0.90	1)నాగమణి W/o మద్దిలేటి 2)పద్మావతి W/o బాస్కర్ 3)తెలుగు ఈరన్న S/o నారాయణ 4)తెలుగు నాగలింగేశ్వర్ S/o హనుమన్న 5)రమ్య W/o గని సీతారామి రెడ్డి 6)హరిజన్ జీవరత్నం S/o మాదెప్ప 7)హరిజన్ ఏలీషా S/o మాదెప్ప 8)హరిజన్ చిన్న నాగన్న S/o తిమ్మప్ప 9)S.రాముడు S/o తిమ్మప్ప 10)సోమ్మ W/o సీతారామి రెడ్డి [illegible]	-	-	-	-	-	-	-	-
2	263	పట్టా	మెట్ట	0.75	[illegible]	-	-	-	-	-	-	-	-
3	264	పట్టా	మెట్ట	2.275	[illegible]	-	-	-	-	-	-	-	-
4	265	పట్టా	మెట్ట	1.475	[illegible]	-	-	-	-	-	-	-	-
5	343	పట్టా	మెట్ట	0.475	[illegible]	-	-	-	-	-	-	-	-
6	346	పట్టా	మెట్ట	3.25	[illegible]	-	-	-	-	-	-	-	-
7	347	పట్టా	మెట్ట	1.10	[illegible]	-	-	-	-	-	-	-	-
8	348	పట్టా	మెట్ట	1.20	[illegible]	-	-	-	-	-	-	-	-
9	365	పట్టా	మెట్ట	1.15	[illegible]	-	-	-	-	-	-	-	-
	విస్తీర్ణం 9.575												

Bund Canal

2) D1/19/B/2023
గ్రామము: తనగాల మండలం: వడ్డేపల్లి జిల్లా:జోగులాంబ గద్వాల

క్రమ సం.	సర్వే నం. / సబ్ డివిజన్	పట్టా/ఇనాం etc.	భూ వర్గీకరణ మెట్ట/ తరి	సేకరించవలసిన విస్తీర్ణం (ఎ.సెం)	పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు	సరిహద్దులు				చెట్లు		నిర్మాణము	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	267	పట్టా	మెట్ట	0.225	[illegible]	-	-	-	-	-	-	-	-
2	275	పట్టా	మెట్ట	1.20	[illegible]	-	-	-	-	-	-	-	-
3	276	పట్టా	మెట్ట	0.075	[illegible]	-	-	-	-	-	-	-	-
4	298	పట్టా	మెట్ట	4.525	1) గ్రామ కంఠం	-	-	-	-	-	-	-	-
5	299	పట్టా	మెట్ట	3.575	[illegible]	-	-	-	-	-	-	-	-
6	325	పట్టా	మెట్ట	1.125	[illegible]	-	-	-	-	-	-	-	-
7	326	పట్టా	మెట్ట	0.225	[illegible]	-	-	-	-	-	-	-	-
8	327	పట్టా	మెట్ట	1.425	[illegible]	-	-	-	-	-	-	-	-
9	328	పట్టా	మెట్ట	0.10	[illegible]	-	-	-	-	-	-	-	-
10	337	పట్టా	మెట్ట	0.175	[illegible]	-	-	-	-	-	-	-	-
11	338	పట్టా	మెట్ట	1.35	[illegible]	-	-	-	-	-	-	-	-
12	339	పట్టా	మెట్ట	1.725	[illegible]	-	-	-	-	-	-	-	-
13	340	పట్టా	మెట్ట	1.425	[illegible]	-	-	-	-	-	-	-	-
14	343	పట్టా	మెట్ట	0.825	[illegible]	-	-	-	-	-	-	-	-
15	345	పట్టా	మెట్ట	2.875	[illegible]	-	-	-	-	-	-	-	-
16	348	పట్టా	మెట్ట	3.525	[illegible]	-	-	-	-	-	-	-	-
17	365	పట్టా	మెట్ట	0.70	[illegible]	-	-	-	-	-	-	-	-
18	374	పట్టా	మెట్ట	1.90	[illegible]	-	-	-	-	-	-	-	-
19	375	పట్టా	మెట్ట	1.975	[illegible]	-	-	-	-	-	-	-	-
20	381	పట్టా	మెట్ట	0.475	[illegible]	-	-	-	-	-	-	-	-
21	382	పట్టా	మెట్ట	0.775	[illegible]	-	-	-	-	-	-	-	-
22	384	పట్టా	మెట్ట	0.425	[illegible]	-	-	-	-	-	-	-	-
23	385	పట్టా	మెట్ట	0.075	[illegible]	-	-	-	-	-	-	-	-
24	388	పట్టా	మెట్ట	3.825	1) గ్రామ కంఠం	-	-	-	-	-	-	-	-
25	389	పట్టా	మెట్ట	0.525	[illegible]	-	-	-	-	-	-	-	-
	విస్తీర్ణం 31.85												

FRL Canal

3) D1/19/2023
గ్రామము: తనగాల మండలం: వడ్డేపల్లి జిల్లా:జోగులాంబ గద్వాల

క్రమ సం.	సర్వే నం. / సబ్ డివిజన్	పట్టా/ఇనాం etc.	భూ వర్గీకరణ మెట్ట/ తరి	సేకరించవలసిన విస్తీర్ణం (ఎ.సెం)	పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు	సరిహద్దులు				చెట్లు		నిర్మాణము	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	275	పట్టా	మెట్ట	0.05	[illegible]	-	-	-	-	-	-	-	-
2	298	పట్టా	మెట్ట	24.75	1) గ్రామ కంఠం	-	-	-	-	-	-	-	-
3	299	పట్టా	మెట్ట	13.35	[illegible]	-	-	-	-	-	-	-	-
4	325	పట్టా	మెట్ట	0.125	[illegible]	-	-	-	-	-	-	-	-
5	326	పట్టా	మెట్ట	15.00	[illegible]	-	-	-	-	-	-	-	-
6	327	పట్టా	మెట్ట	12.225	[illegible]	-	-	-	-	-	-	-	-
7	328	పట్టా	మెట్ట	2.30	[illegible]	-	-	-	-	-	-	-	-
8	329	పట్టా	మెట్ట	8.20	[illegible]	-	-	-	-	-	-	-	-
9	330	పట్టా	మెట్ట	13.75	[illegible]	-	-	-	-	-	-	-	-
10	331	పట్టా	మెట్ట	7.50	[illegible]	-	-	-	-	-	-	-	-
11	332	పట్టా	మెట్ట	13.85	[illegible]	-	-	-	-	-	-	-	-
12	333	పట్టా	మెట్ట	53.875	[illegible]	-	-	-	-	-	-	-	-
13	334	పట్టా	మెట్ట	9.95	[illegible]	-	-	-	-	-	-	-	-
14	335	పట్టా	మెట్ట	10.45	[illegible]	-	-	-	-	-	-	-	-
15	336	పట్టా	మెట్ట	13.025	[illegible]	-	-	-	-	-	-	-	-
16	337	పట్టా	మెట్ట	19.80	[illegible]	-	-	-	-	-	-	-	-
17	338	పట్టా	మెట్ట	0.875	[illegible]	-	-	-	-	-	-	-	-
18	339	పట్టా	మెట్ట	3.125	[illegible]	-	-	-	-	-	-	-	-
19	340	పట్టా	మెట్ట	3.00	[illegible]	-	-	-	-	-	-	-	-
20	341	పట్టా	మెట్ట	11.425	[illegible]	-	-	-	-	-	-	-	-
21	342	పట్టా	మెట్ట	19.775	[illegible]	-	-	-	-	-	-	-	-
22	343	పట్టా	మెట్ట	21.50	[illegible]	-	-	-	-	-	-	-	-
23	344	పట్టా	మెట్ట	11.70	[illegible]	-	-	-	-	-	-	-	-
24	345	పట్టా	మెట్ట	1.30	[illegible]	-	-	-	-	-	-	-	-
25	346	పట్టా	మెట్ట	4.675	[illegible]	-	-	-	-	-	-	-	-
26	365	పట్టా	మెట్ట	0.175	[illegible]	-	-	-	-	-	-	-	-
27	374	పట్టా	మెట్ట	3.775	[illegible]	-	-	-	-	-	-	-	-
28	375	పట్టా	మెట్ట	21.725	[illegible]	-	-	-	-	-	-	-	-
29	376	పట్టా	మెట్ట	13.60	[illegible]	-	-	-	-	-	-	-	-
30	377	పట్టా	మెట్ట	10.375	[illegible]	-	-	-	-	-	-	-	-

(మిగతా 11వ పేజీలో)

రాజకీయ అక్కసుతోనే తెలంగాణకు అన్యాయం

- సెమీ కండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో కేంద్రం వివక్ష
- కనీస సంసిద్ధతలేని ఆంధ్రప్రదేశ్‌కు ఎలా కేటాయిస్తారు?
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి న్యాయం చేయాలి: శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణకు రాజకీయ అక్కసుతోనే కేంద్రం అన్యాయం చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆరోపించారు. సెమీ కండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో వివక్ష చూపి రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని బుధవారం మండిపడ్డారు. 'ప్రపంచ స్థాయి అధునాతన సిస్టమ్ అండ్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మహేశ్వరంలో పదెకరాల భూమి కేటాయించాం. అతి తక్కువ సమయంలోనే అన్ని అనుమతులిచ్చాం. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తుది ఆమోదం లభిస్తే పనులు మొదలుపెట్టేందుకు సదరు ఇన్వెస్టర్ సిద్ధంగా ఉన్నారు. అయినా కేంద్రం పట్టించుకోలేదు' అని విమర్శించారు. అన్ని రకాలుగా అర్హతలున్నా తెలంగాణను విస్మరించి కనీస సంసిద్ధతలేని ఏపీకి ప్రాజెక్టును ఎలా కేటాయిస్తారని శ్రీధర్ బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు.

ప్యాకేజీ-6 మోటార్లను ఆన్ చేయాలి: హరీశ్



హైదరాబాద్/సిద్దిపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ-6(నంది పంప్‌హౌస్) వద్ద ఉన్న మోటార్లను తక్షణమే ఆన్ చేసి, ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను నింపాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం లేఖ రాశారు. మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండ పోచమ్మసాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపితే 5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా వెంటనే నీటి పంపింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరిలోని వరద నీరు వస్తోందని, నీటిని ఎత్తిపోయడానికి ఇదే సరైన సమయమని హరీశ్ లేఖలో పేర్కొన్నారు. మరోవైపు, సిద్దిపేటలో పర్యటించిన ఆయన, రాఘవాపూర్‌లో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులతో మాట్లాడారు. యూరియా కోసం రైతులు ధర్నాలు చేసే దుస్థితిని ప్రభుత్వాలు కల్పించాయని మండిపడ్డారు.

వికలాంగుల సంక్షేమ పథకాలపై చర్చకు సిద్ధమా?

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షునికి ముత్తినేని వీరయ్య సవాల్

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర, కేంద్రం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య సవాల్ విసిరారు. వికలాంగులకు కేంద్రం చేస్తున్న మోసంపై ఎక్కడైనా చర్చించడానికి సిద్ధమని ఓ ప్రకటనలో తెలిపారు.

మంత్రి ఆదేశాలు బేఖాతరు
ముగ్గురు అర్చకులపై క్రమశిక్షణా చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఆదేశాలు బేఖాతరు చేసిన ముగ్గురు అర్చకులపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యలు చేపట్టారు. ముందస్తు అనుమతి లేకుండా అర్చకులు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ప్రత్యేక పూజలు, యాగాలు, హోమాలు, ఇతరాత్ర కార్యక్రమాల్లో పాల్గొనవద్దని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్ ఇటీవలే మెమో జారీ చేశారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల తరహా వేతనాలు పొందుతున్నందున నిబంధనలు అతిక్రమించే అర్చకులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని మెమోలో స్పష్టం చేశారు. అయితే జోగులాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న విక్రాంత్ శర్మ, వెంకట కృష్ణ, కృష్ణ మూర్తి ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఓ ప్రైవేటు కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో నిబంధనలు అతిక్రమించారన్న కారణంతో ముగ్గురు అర్చకులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ కృష్ణవేణి ఆలయ ఈవోకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి, సమూహ ఆలయాల ఈవో ఆర్.పురేందర్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను జములమ్మ ఆలయ ఈవోగా బదిలీ చేస్తూ అదనపు కమిషనర్ కృష్ణవేణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపూర్ గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయ ఈవో ఎ.దీప్తిని జోగులాంబ ఆలయ ఈవోగా నియమించారు.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరడానికి ప్రవేశ గడువును పెంచారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీలతో పాటు పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ, డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో చేరడానికి చివరి తేదీ ఆగస్టు 30 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం కోసం విశ్వవిద్యాలయం హెల్ప్ డెస్క్ నంబర్లు 040-23680222/333/444/555, టోల్‌ఫ్రీ నెంబర్. 18005990101లో సంప్రదించొచ్చని లేదా www.braouonline.in, www.braou.ac.in వెబ్‌సైట్ సందర్శించాలని రిజిస్ట్రార్ సూచించారు.

తెలంగాణలో త్వరలో టూరిస్ట్ పోలీసులు

- మొదటి దశలో 80 మంది నియామకం
- సెప్టెంబరు 27 నుంచి అమలు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పర్యాటకుల భద్రత కోసం ప్రత్యేకంగా టూరిస్ట్ పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని డీజీపీ జితేందర్ తెలిపారు. మొదటి దశలో పర్యాటక ప్రాంతాల్లో 80 మంది పోలీసులు పనిచేయనున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతగిరి, సోమశిల, రామప్ప, యాదగిరి గుట్ట, పోచంపల్లి, నాగార్జునసాగర్, బుద్ధవనం, భద్రాచలం, అమ్రాబాద్ వంటి ముఖ్య పర్యాటక కేంద్రాల్లో వీరు సేవలందిస్తారని వివరించారు. ఈ వ్యవస్థ ద్వారా స్వదేశీ, విదేశీ పర్యాటకులకు మెరుగైన భద్రత కల్పించవచ్చని, ఇది పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తుందని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ పర్యాటక శాఖ, పోలీసు శాఖల మధ్య సమన్వయ సమావేశం బుధవారం డీజీపీ కార్యాలయంలో జరిగింది.

దేశభక్తి పెంచేలా స్వాతంత్ర్య దిన కార్యక్రమాలు

- పది, ఇంటర్ టాపర్లకు నగదు పురస్కారాలు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దేశభక్తి పెంచేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని, అందులో ఎన్‌సీసీ పెరేడ్‌తోపాటు దేశభక్తి పెంచేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ బుధవారం డీఈవోలకు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పది, ఇంటర్‌లో జిల్లా టాపర్లుగా నిలిచిన ఇద్దరు బాల, బాలికలకు రూ. 10 వేల చొప్పున నగదు పురస్కారాలు అందించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. కార్యక్రమాల ఏర్పాటు, నగదు పురస్కారాల కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు.

(10వ పేజీ తరువాయి)

31	378	పట్టా	మెట్ట	13.525	1)బి.తిమ్మప్ప S/o సీతారాముడు 2)బోయ వెంకమ్మ S/o బోయ తిమ్మన్న 3)నాయకి వెంకటేశ్వరమ్మ W/o నాయకి రాముడు 4)బోయ లాయమ్మ W/o బజారి 5)N.ఆంజనేయులు S/o S.రాముడు 6)N.వెంకటగిరి S/o S.రాముడు 7)N.తిరుమలేష్ S/o N.రాముడు 8)N. ప్రసాద్ S/o లక్ష్మణస్వామి	-	-	-	-	-	-	-	-
32	379	పట్టా	మెట్ట	11.325	1)బోయ బొమ్మరప్ప చిన్న కృష్ణ S/o బోయ బొమ్మరప్ప రాముడు 2)బోయ లాయమ్మ W/o బజారి 3)కుర్వ చిన్న మల్లన్న S/o కుర్వ చిన్న వెంకన్న 4)బోయ చిన్న నాయుడు S/o బోయ పెద్ద లింగన్న 5)బండు శ్రీనివాస్ S/o బండు నారాయణ లేట్ 6)తుడుం వంశీ S/o తుడుం ఆగమయ్య 7)తుడుం భూషణ్ S/o తుడుం ఆదన్న 8)బండు నవీనా కుమారి S/o శ్రీనివాస్	-	-	-	-	-	-	-	-
33	380	పట్టా	మెట్ట	21.875	1)కుర్వ నర్సింహులు S/o చిన్న గోవిందు 2)కుర్వ సుజాత W/o చిన్న మల్లయ్య 3)కుర్వ వెంకటేష్ S/o గోవిందు 4)బోయ శివయ్య S/o తిమ్మయ్య 5)బోయ రాముడు S/o తిమ్మప్ప 6)కె.నరసింహులు S/o కేశన్న 7)కె.హనుమన్న S/o కేశన్న 8)కె.కుష్మారమ్మ W/o జయపాల్ 9)కె.పద్మావతి W/o వెంకటన్న 10)కె.పద్మ W/o కె.నగేష్	-	-	-	-	-	-	-	-
34	381	పట్టా	మెట్ట	15.475	1)నాయకి వెంకటేశ్వరమ్మ W/o నాయకి రాముడు 2)S.వెంకటగిరి S/o N.రాముడు 3)N.ప్రసాద్ S/o లక్ష్మణ్ స్వామి 4)N.తిరుమలేష్ S/o N.రాముడు	-	-	-	-	-	-	-	-
35	385	పట్టా	మెట్ట	6.225	1)కుర్వ తిరుమలేష్ S/o కుర్వ మాదన్న 2)కుర్వ చిన్న నరసింహులు S/o కుర్వ మాదన్న	-	-	-	-	-	-	-	-
36	386	పట్టా	మెట్ట	7.975	1)కుర్వ బడేసాబ్ S/o కేశన్న 2)కె.పెద్ద మల్లయ్య S/o కేశన్న 3)కె.చిన్న మల్లన్న S/o కేశన్న 4)కె.నర్సింహులు S/o కేశన్న 5)కె.హనుమన్న S/o కేశన్న	-	-	-	-	-	-	-	-
37	387	పట్టా	మెట్ట	20.10	1)బలిజ నాగరాజు S/o చిన్న వీరయ్య 2)కుర్వ రాంబాబు S/o కుర్వ తిమ్మప్ప 3)కుర్వ నర్సింహులు S/o చిన్న గోవిందు 4)కుమ్మరి మద్దిలేటి S/o గట్టన్న 5)కుమ్మరి నర్సింహులు S/o గట్టన్న 6)కుర్వ నగేష్ S/o చిన్న గోవిందు 7)కుర్వ వెంకటేష్ S/o గోవిందు 8)కుర్వ రాముడమ్మ W/o కె.తిమ్మన్న 9)కుర్వ శివరాజు S/o కె.ఈరన్న 10)కుమ్మరి రఘు S/o గట్టన్న 11)కుమ్మరి కృష్ణ S/o గట్టన్న 12)కుమ్మరి జయమ్మ W/o కుమ్మరి నర్సింహులు	-	-	-	-	-	-	-	-
38	388	పట్టా	మెట్ట	48.975	1) ప్రభుత్వ భూమి	-	-	-	-	-	-	-	-
39	389	పట్టా	మెట్ట	16.25	1)ఈడిగ కేశన్న గౌడ్ S/o ఈడిగ రామన్న 2)కుర్వ చిన్న తిమ్మన్న S/o నాగన్న 3)కుర్వ మద్దిలేటి S/o భీమన్న 4)కుర్వ లక్ష్మన్న S/o కుర్వ భీమన్న 5)కుర్వ మాణిక్యమ్మ W/o రామకృష్ణ 6)సునీత W/o ఈడిగ రామాంజనేయులు గౌడ్ @ ధనుంజయ గౌడ్ 7)కుర్వ వెంకటస్వామి S/o దాసరి నాగన్న అలియాస్ నాగన్న 8)కుర్వ పరమేష్ S/o కుర్వ వెంకటేష్ 9)కుర్వ పెద్ద బాబు S/o కుర్వ తిమ్మన్న 10)ఈడిగ సరస్వతి W/o ఈడిగ కేశన్న గౌడ్ 11)ఈడిగ రామాంజనేయులు S/o బుడ రామన్న 12)కుర్వ గోవిందమ్మ W/o కుర్వ చిన్న రాముడు	-	-	-	-	-	-	-	-
	మొత్తం	506.95											

Feeder Canal

4) D1/19/C/2023

గ్రామము: తనగాల మండలం: వడ్డెపల్లి జిల్లా: జోగులాంబ గద్వాల

క్రమసం	సర్వే నం / సబ్ డివి	పట్టా/ఇనాం ఇత.	మెట్ట/తరి	భూసేకరణ ప్రతిపాదిత విస్తీర్ణం	పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు	సరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు		నిర్మాణము	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	247	పట్టా	మెట్ట	0.80	1)గని పురందర్ రెడ్డి S/o మల్లా రెడ్డి 2)గని వెంకట్రామి రెడ్డి S/o మల్లా రెడ్డి 3)యత్తి జమ్మ W/o రమేష్ రెడ్డి 4)వడికల వేద్యవతి W/o వడికల శ్రీనివాస్ 5)తల్ల సరిత W/o తాళ్ల మల్లేష్	-	-	-	-	-	-	-	-
2	249	పట్టా	మెట్ట	1.65	1)వెంకటమ్మ W/o శంకరప్ప గౌడ్ 2)సరోజమ్మ W/o జనార్దన్ గౌడ్ 3)నాయకి నరసమ్మ S/o చిన్నన్న 4)బంగారు భాగ్యమ్మ W/o తిప్పా రెడ్డి 5)వెంకటేశ్వరమ్మ W/o యంగన్న 6)జయమ్మ W/o తిప్పా రెడ్డి 7)బోయ శేషన్న S/o బోయ పెద్ద గట్టన్న 8)బోయ కృష్ణ S/o నాగన్న 9)లక్ష్మీ బాయి W/o కిషన్ రావు 10)హరిజన్ బుజ్జమ్మ W/o హరిజన మారెప్ప 11)వెంకటేష్ నాయుడు S/o రంగన్న 12)శివమ్మ W/o తిమ్మప్ప 13)సంధ్య మెసెక్ S/o సంధ్య అబ్రహం 14)సంధ్య పోగు సురేష్ S/o సంధ్య పోగు అబ్రహం 15)బోయ పరశురాముడు S/o బోయ ఆంజనేయులు 16)కుర్వ ఉద్దండ S/o నాగన్న 17)బోయ శారద W/o బోయ చిన్న రాయుడు 18)బోయ కుమార్ నాయుడు S/o బోయ ఆంజనేయులు 19)కుర్వ కృష్ణ S/o కుర్వ ఉద్దండు	-	-	-	-	-	-	-	-
3	250	పట్టా	మెట్ట	1.675	1)G.సీతారామి రెడ్డి S/o తిమ్మా రెడ్డి 2)కటిక జనార్దన్ S/o కటిక మాపోజీ రావు 3)కటిక సూర్య నారాయణ S/o మాపోజీ 4)లక్ష్మీ బాయి W/o కిషన్ రావు 5)కటిక శివాజీ రావు S/o మాపోజీ రావు	-	-	-	-	-	-	-	-
4	251	పట్టా	మెట్ట	1.20	1)G.సీతారామి రెడ్డి S/o తిమ్మా రెడ్డి 2)హరిజన్ తిమ్మప్ప S/o నాగన్న 3)హరిజన్ తిమ్మన్న S/o [illegible] 4)కుర్వ శంకరన్న S/o శేషన్న 5)హరిజన్ తిమ్మక్క W/o కిష్టన్న 6)హనుమన్న S/o పోలుబల్లు 7)కె.నరసింహులు S/o కె.నాగన్న	-	-	-	-	-	-	-	-
5	294	పట్టా	మెట్ట	0.85	1)ఎ.సీతారామి రెడ్డి S/o తిమ్మా రెడ్డి 2)హరిజన్ చిన్న తిప్పన్న S/o తాదన్న 3)బోయ అనంతమ్మ W/o లేట్ బోయ ఎల్లప్ప అలియాస్ బోయ ఎద్దుల ఎల్లప్ప 4) ప్రభుత్వం భూమి	-	-	-	-	-	-	-	-
6	299	పట్టా	మెట్ట	0.475	1)హరిజన్ బొజ్జన్న S/o తిమ్మన్న 2)H.మారెమ్మ W/o బతుకన్న 3)హరిజన్ గట్టన్న S/o చిన్న దుబ్బన్న 4)హరిజన్ తిప్పమ్మ W/o పోట్ల మారెప్ప 5)హరిజన రంగమ్మ W/o ఒంటి నాగన్న 6)హరిజన్ నాగరాజు S/o రాజానందం 7)హరిజన్ ఉమ్మయ్య S/o చిన్న దుబ్బన్న 8)హరిజన్ సురేష్ S/o చెన్నయ్య 9)సంధ్య రాజన్న S/o శాంతిన్నా 10)యేసన్నా S/o సాంతిన్నా 11)సంధ్యపోగు రమేష్ S/o ఎలియా 12)సంధ్యపోగు దేవరాజ్ S/o ఎలియా	-	-	-	-	-	-	-	-
7	300	పట్టా	మెట్ట	3.65	1)హరిజన మాతమ్మ W/o నాగన్న 2)హరిజన దేవదాసు S/o శేషన్న 3)యేసురత్నం S/o బుచ్చన్న 4)హరిజన్ సాగరాజు S/o రాజానందం 5)సంధ్య రాజన్న S/o శాంతిన్నా 6)యేసన్నా S/o సాంతిన్నా 7)సంధ్య శారదమ్మ W/o Sadya Israyel 8)S.కమలాకర్ S/o S.కృష్ణ 9)S.దయాకర్ S/o S.కృష్ణ	-	-	-	-	-	-	-	-
8	301	పట్టా	మెట్ట	2.825	1)హరిజన్ యెలిషా S/o తిమ్మప్ప 2)హరిజన పద్మమ్మ W/o H.వరదరాజ్ 3)హరిజన్ రాజు S/o దేవదాసు 4)హరిజన్ ఆదము S/o బడేసాబు 5)S.దేవన్న S/o దండు శీలన్న 6)హరిజన్ మద్దూరి తిమ్మప్ప S/o పెద్ద శేషన్న 7)హరిజన దేవదానం S/o శేషన్న 8)హరిజన్ అనుమన్నా S/o సోమన్న 9)హరిజన్ పెద్ద గుంటన్న S/o హరిజన పెద్ద గోంగన్న 10)వరదరాజు S/o సంధ్య తిమ్మన్న 11)హరిజన్ అబ్రహాం S/o లచ్చన్న 12)సంధ్య దేవన్న S/o గోకారి 13)సంధ్య పోగు జయరాజు S/o బడేసాబ్ 14)హరిజన్ నాహోన్ S/o శేషన్న 15) సంధ్య రాజు S/o పెద్దయ్య 16)సంధ్యపోగు తిమ్మప్ప S/o జమ్మన్న 17)హరిజన్ సరోజమ్మ W/o యేసన్న 18)హరిజన్ ఆశీర్వాదం S/o హరిజన్ చిన్న శేషన్న 19)హరిజన్ రాజు S/o హరిజన చిన్న శేషన్న 20)హరిజన్ ఫల్లన్న S/o హరిజన్ తిమ్మప్ప 21)హరిజన్ రాజు S/o హరిజన్ తిమ్మప్ప 22)హరిజన్ నాగన్న S/o హరిజన్ సుంకన్న 23)నర్సమ్మ W/o మోసన్న 24)హరిజన్ జయిలి W/o సుంకన్న 25)సంధ్య పుల్లన్న S/o రాముడు	-	-	-	-	-	-	-	-
9	302	పట్టా	మెట్ట	4.725	1)హరిజన్ యెలిషా S/o తిమ్మప్ప 2)హరిజన పరుశురాముడు S/o తిమ్మప్ప 3)హరిజన్ రాజు S/o దేవదాసు 4)హరిజన్ సుజనమ్మ S/o సామేలు	-	-	-	-	-	-	-	-
10	303	పట్టా	మెట్ట	0.625	5)గాంధీ S/o మారెప్ప 6)హరిజన్ అబ్రహాం S/o పెగన్న 7)హరిజన్ చిన్న రాముడు S/o యల్లన్న 8)హరిజన్ తిప్పన్న S/o పెగన్న 9)S.దేవన్న S/o పెద్ద రామన్న 10)చిన్న గట్టన్న S/o దుబ్బన్న 11)వరదరాజు S/o సంధ్య తిమ్మన్న 12)హరిజన జయమ్మ W/o వర్ధన్న 13)హరిజన్ సరోజమ్మ W/o యేసన్న 14)హరిజన ప్రకాశం W/o పోట్లన్న 15)హరిజన్ నాగన్న S/o హరిజన సుంకన్న 16)మారెన్నా S/o తిమ్మన్న 17)హరిజన్ రాజమ్మ W/o యల్లన్న 18)రామన్న S/o దుబ్బన్న 19)జమ్మన్న S/o జమ్మన్న 20)సంధ్య పుల్లన్న S/o రాముడు 21)సంధ్య సంతోషమ్మ W/o S.కృష్ణయ్య 22)సంధ్యపోగు రమేష్ S/o ఎలియా 23)సంధ్య దేవరాజు S/o ఎలియా 1)గాంధీ S/o మారెప్ప 2)H.సావరి S/o పక్కీరన్న 3)యేసురత్నం S/o బుచ్చన్న 4)కృష్ణ S/o బుచ్చన్న 5)హరిజన్ వదేష్ S/o తిమ్మన్న 6)H.దేవమ్మ W/o లక్ష్మన్న 7)శ్రీనివాసులు S/o చిన్న లాజర్ 8)వరదరాజు S/o సంధ్య తిమ్మన్న 9)వరమ్మ బతుకమ్మ W/o మారెప్ప 10)హరిజన్ మహేష్ S/o సంధ్య మాదన్న 11)హరిజన్ రామయ్య S/o హరిజన్ లామయ్య 12)వజ్రమ్మ W/o శ్రీనివాసులు 13)S.వరదరాజు S/o పెద్ద లాజర్ 14)సువర్ణ W/o ఇస్మాయిల్ 15)రాజు S/o మదిలేటి 16)హరిజన్ రత్నమ్మయ్య S/o హరిజన్ రాయుడు 17)బాసుడ్ S/o బరుకన్న 18)హరిజన్ నాగరాజు S/o మారెన్న 19)హరిజన్ గిడ్డయ్య S/o జమ్మన్న 20)హరిజన్ సోమేష్ S/o మారెన్న 21)హరిజన్ సువర్ణమ్మ W/o రత్నము 22)హరిజన్ జయన్న S/o పెదయ్య 23)హరిజన్ జయపాల్ S/o పెదయ్య 24)సంధ్య నాగరాజు S/o సంధ్య మత్తయ్య 25)సంధ్య సంతోషమ్మ W/o S.కృష్ణ 26)ముదుమల సురేష్ S/o ముదుమల రత్నం 27)హరిజన జమీలమ్మ W/o హరిజన సోమన్న 28)పారాంది S/o S.ధనుంజయ	-	-	-	-	-	-	-	-
	మొత్తం	18.475											

Cistern Canal

5) D1/19/D/2023

గ్రామము: తనగాల మండలం: వడ్డెపల్లి జిల్లా: జోగులాంబ గద్వాల

క్రమసం	సర్వే నం / సబ్ డివి	పట్టా/ఇనాం ఇత.	మెట్ట/తరి	భూసేకరణ ప్రతిపాదిత విస్తీర్ణం	పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు	సరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు		నిర్మాణము	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1.	388	పట్టా	మెట్ట	0.60	1) ప్రభుత్వభూమి	-	-	-	-	-	-	-	-
			మొత్తం	0.60									
			మొత్తం	567.45									

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా, ప్రత్యేక ఉపకలెక్టరు, జె.ఎల్.ఐ.పి., గద్వాల, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వడమైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, జె.ఎల్.ఐ.పి., గద్వాల గారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

సం/-	సం/-	సం/-
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ గద్వాల	అదనపు కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా	కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO.NO:478/LA-PP/ADVT/PUBLICATION/2025-26

భూ మాయ చేశారు!

పుప్పాలగూడలో రూ.6 వేల కోట్ల భూకుంభకోణం

- ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న కాందిశీకుల భూముల్లో రూ.30 వేల కోట్ల విలువైన రియల్‌ఎస్టేట్ వెంచర్లు

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)



ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న పుప్పాలగూడ సర్వేనంబరు 277, 278, 280, 281, 282, 340, 341, 342లో సుమారు 101.12 ఎకరాలకుపైగా కాందిశీకుల భూములు ఉన్నాయి. నానక్‌రామ్ గూడ ఔటర్ రింగు రోడ్డు టోల్‌గేట్‌కు పక్కన.. సర్వీసు రోడ్డుకు అనుకుని ఉన్న అత్యంత విలువైన భూములు ఇవి. ఇక్కడ ఎకరా ఎంత లేదన్నా రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. గతంలో వీటిపై వివాదాలు ఎన్నో జరిగినప్పటికీ న్యాయస్థానాల్లో ప్రైవేటు వ్యక్తుల వాదనలు నిలబడలేదు. ఈ సర్వే నంబర్లలోని కొంత భూమికి హక్కుదారులమని, కబ్జాలో కూడా తామే ఉన్నామంటూ కొందరు గతంలో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు 1994లో అప్పటి జాయింట్ కలెక్టర్ ఈ సర్వేనంబర్లలోని కొన్ని భూములకు డబ్బు కట్టించుకుని అప్పటికే కబ్జాలో ఉన్న వారికి కేటాయించేందుకు మెమో జారీ చేశారు. అయితే అప్పటి కలెక్టర్ దీన్ని వ్యతిరేకించి.. జాయింట్ కలెక్టర్ ఆదేశాలను నిలిపివేశారు. చివరకు ఈ వ్యవహారం ప్రభుత్వం వద్దకు వెళ్లింది. సీసీఎల్ఏ స్థాయిలో ఈ పక్రియ కొన్నేళ్లు నిలిచిపోయింది. అనంతరం.. ఆయా భూముల క్రయవిక్రయాలు నిషేధిస్తూ 2005 జూన్‌లో అప్పటి సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేశారు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఈ భూములన్నింటినీ అప్పట్లోనే 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టింది. అయితే.. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న అత్యంత ఖరీదైన ఈ భూములపై గత ప్రభుత్వ హయాంలో కొందరు పెద్దల కన్ను పడింది! వారు ఏం మాయ చేశారో ఏమోగానీ.. నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో కొన్నింటిని 2021లో ఆ జాబితా నుంచి తొలగింపజేయడం ద్వారా క్లియరెన్స్ తెచ్చుకున్నారు. ఆ భూముల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలకు హెచ్ఎండీఏ ద్వారా ఏడాదిలోగా చకచకా అనుమతులు ఇప్పించుకున్నారు. సాధారణ వ్యక్తులు ఎవరైనా చిన్న ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే రకరకాల కొర్రీలు పెట్టి ఏళ్ల తరబడి తమ చుట్టూ తిప్పించుకునే అధికారులు.. నిషేధిత జాబితాలో ఉన్న ఈ రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో వాణిజ్య/నివాస ప్రాజెక్టు నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేయడం గమనార్హం. నాలుగేళ్లుగా ఈ దందా కొనసాగుతుండగా.. 2025లో ప్రభుత్వం ఈ సర్వే నంబర్లలో కొన్నింటిని మళ్లీ నిషేధిత జాబితాలో పెట్టడం గమనార్హం. కానీ.. ఇప్పటికే ఆ భూమిలోని దాదాపు 60 ఎకరాల్లో రెండు కంపెనీలకు సంబంధించిన భారీ ప్రాజెక్టులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వాటిలో బహుళ అంతస్తుల భారీ భవన నిర్మాణాలు 70 శాతానికిపైగా పూర్తయ్యాయి. ఆ రెండు ప్రాజెక్టుల వెనుకా గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన నేతలు ఉన్నారు. వారంతా ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారు.

1.4 కోట్ల చదరపు అడుగుల్లో...

పుప్పాలగూడ సర్వేనంబరు 277, 282, 340, 341, 342పార్టులలోని దాదాపు 30 ఎకరాలకుపైగా భూమి నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ.. అనుమతులు సంపాదించి వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఇక్కడ 7.95 ఎకరాల్లో 'వెస్టర్న్ విండ్సర్ పార్క్' (రెరా నంబరు పి02400045581), 13.14 ఎకరాల్లో 'వెస్టర్న్ స్ప్రింగ్స్' (రెరా నంబరు పి0240005326), 7.75 ఎకరాల్లో 'వెస్టర్న్ మెరీనా' (రెరా నంబరు పి02400045581) పేరుతో భారీ టవర్లు నిర్మిస్తోంది. 41 అంతస్తులతో దాదాపు 1.40 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు విలువ దాదాపు రూ.20 వేల కోట్ల దాకా ఉంటుంది. సర్కారు ఇవి ప్రభుత్వ భూములని పేర్కొంటూ నిషేధిత జాబితాలో పెట్టినా.. ఈ భూములపై 26 సివిల్ కేసులు పెండింగ్‌లో ఉన్నా కూడా నిర్మాణాలకు హెచ్ఎండీ 2022లో అనుమతులు ఇవ్వడం గమనార్హం. ఒకవేళ వారు కోర్టుల ద్వారా లేదా ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఈ భూముల్లో నిర్మాణాలకు అనుమతులు తెచ్చుకున్నాయనుకున్నా.. వాటిని మళ్లీ నిషేధిత జాబితాలో ఎందుకు పెట్టారో చెప్పాలి.

ఎవరిదీ కంపెనీ ?

కాందిశీకుల భూములకు దర్జాగా అనుమతులు తీసుకుని భారీ భవంతులు నిర్మిస్తున్న వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలో అనేక మంది పెద్దల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో కొందరు తెరపై కనిపిస్తుండగా మరికొందరు తెరవెనుక ఉండి కథ అంతా నడిపారు. ఈ కంపెనీకి మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డితో పాటు మరికొందరు రాజకీయ నేతల బంధువులు ప్రమోటర్లుగా ఉన్నారు. రంజిత్‌రెడ్డి కుమారుడు గడ్డం రాజ్ ఆర్యన్ రెడ్డి ఈ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నారు. వీరితో పాటు మాజీ ఎంపీ బంధువులు కూడా భాగస్వాములుగా ఉన్నారు. అప్పట్లో ఈ ఇద్దరు నేతలూ ఈ భూముల వ్యవహారంలో చక్రం తిప్పారు.

డీఎస్ఆర్ఎస్ఎస్ఐ కంపెనీదీ అదే దారి

మరో మాజీ ఎంపీ బంధువు అయిన డి.రఘురామిరెడ్డికి చెందిన డీఎస్ఆర్ ఎస్ఎస్ఐ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సంస్థ కూడా ఇలాగే అనుమతులు పొంది.. పుప్పాలగూడలోని 278, 280, 281 తదితర సర్వే నంబర్లలోని దాదాపు 30 ఎకరాల కాందిశీకుల భూముల్లో 30 అంతస్తుల భారీ నిర్మాణాలు చేపడుతోంది. దాదాపు 70 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు విలువ ఎంత లేదన్నా రూ.10వేల కోట్లకుపైగానే ఉంటుందని అంచనా. ఈ రెండు కంపెనీలకూ.. మాజీ హెచ్ఎండీఏ కమిషనర్, ఐఏఎస్ అర్వింద్‌కుమార్, మాజీ ప్లానింగ్ డైరెక్టర్ శివబాల కృష్ణ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారనే అభియోగాలు వినిపిస్తున్నాయి.

లోకాయుక్తాలో ఫిర్యాదు.. ఈడీకి కూడా..

ఈ భూముల అన్యాక్రాంతంపై విచారణ జరపాలని ప్రముఖ న్యాయవాది ఇమ్మనేని రామారావు లోకాయుక్తాలో ఇటీవల ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిగా నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్ కుమార్ , డైరెక్టర్ శివ బాలకృష్ణ వారికి నిర్మాణ అనుమతులు ఇవ్వడానికి సహాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారించిన లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి ధర్మాసనం.. దీనిపై విచారణ చేపట్టి సెప్టెంబరు 28లోగా నివేదిక సమర్పించాలని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారవర్గాల్లో మల్లగుల్లాలు మొదలయ్యాయి. ఈ వ్యవహారాలను సమర్థించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. మరోవైపు ఈడీకి కూడా ఈ అంశంపై ఫిర్యాదులు అందాయి.

కేంద్రం కూడా..

పుప్పాలగూడ ప్రభుత్వ భూముల నిషేధిత జాబితాను 20 ఏళ్ల కాలంలో అధికారులు మూడుసార్లు సవరించగా 2021లో జరిగిన సవరణలపైనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. 2005లో జారి చేసిన నిషేధిత జాబితాలో ఈ సర్వే నంబర్లలోని మొత్తం భూమి 101.02 ఎకరాలు ప్రభుత్వ భూమి అని పేర్కొగా 2021లో జరిగిన నిషేధిత జాబితా సవరణలో అది కాస్తా 17.30 ఎకరాలకు పరిమితమైంది. మళ్లీ 2025 జూన్‌లో చేసిన సవరణలో 64.30 ఎకరాలు ప్రభుత్వ భూమిగా పేర్కొన్నారు. 2021 సవరణ జాబితాలో సర్వేనంబరు 277లో 7.30 ఎకరాలు, సర్వేనంబరు 278లో 6 ఎకరాలు, సర్వేనంబరు 342లో 4 ఎకరాల ప్రభుత్వ భూములే ఉన్నట్లు చూపించారు. 2025 జూన్ నాటి జాబితాలో మాత్రం.. సర్వేనంబరు 282, 341 మినహా మిగతా సర్వేనంబర్లలో ప్రభుత్వ భూములు ఉన్నట్లు చూపారు. ఒక వేళ చట్ట ప్రకారమే ఈ భూములు ప్రైవేటు వ్యక్తులపరమైతే మళ్లీ 2025 జూన్‌లో ఈ భూములను మళ్లీ నిషేధిత జాబితాలో ప్రభుత్వం ఎందుకు పెట్టింది? రూ.వేల కోట్ల విలువైన ఈ భూముల వ్యవహారంపై వస్తున్న ఆరోపణలను నిగ్గుతేల్చాలంటే ఉన్నతస్థాయి దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. ఈ భూములు కేంద్ర హోంశాఖ పరిధిలో ఉన్న భూములు కావడంతో మొత్తం వ్యవహారంపై కేంద్రం కూడా దృష్టిసారించాల్సిన అవసరముంది.

తొలగించినపుడు కారణాలు ఉండవా?

ఏవైనా భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టినప్పుడు.. ఎందుకు పెడుతున్నారో కారణాలు పేర్కొంటారు. వాటిని ఎవరైనా పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. కానీ ఆ జాబితాను సవరించినపుడు కారణాలు చెప్పకుండానే ఏకపక్షంగా అధికారులు కొన్ని సర్వేనంబర్లు తొలగిస్తుంటారు. దీంతో ఆకస్మాత్తుగా ప్రభుత్వ భూములు ఈ నిషేధిత జాబితా నుంచి మాయం అవుతున్నాయి. ఈ భూములను ప్రభుత్వం క్రమబద్ధీకరించినా, న్యాయస్థానం ఉత్తర్వుల కారణంగా తొలగించినా.. ఆ వివరాలను కూడా జాబితా సవరణ చేసేటపుడు పెట్టాలి. కానీ అలాంటిది జరగడం లేదు. రూ. వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల విషయంలో ప్రభుత్వాలు జవాబుదారీతనం లేని విధంగా వ్యవహరిస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

20 ఏళ్లలో మూడుసార్లు

పుప్పాలగూడలోని ప్రభుత్వ భూములకు సంబధించి 2005 నుంచి 2025 మధ్య కాలంలో అధికారులు మూడుసార్లు నిషేధిత జాబితాలను సవరించారు. మొదట 06-06-2005న అప్పటి సీసీఎల్ఏ సర్వేనంబరు 277, 278, 280, 281, 282, 340, 341, 342లో సుమారు 101.12 ఎకరాలను 22-ఏ కింద నిషేధిత జాబితాలో పెడుతూ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి ఈ భూములపై క్రయ విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. తరువాత 29-09-2021న జిల్లా కలెక్టర్ మరోసారి జాబితాను సవరించారు. ఆ తరువాత ఇటీవల 01-06-2025న జిల్లా కలెక్టర్ మరోసారి నిషేధిత జాబితాను సవరిస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాశారు. ఈ మేరకు 06-06-2025న ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో ఈ నిషేధిత జాబితాను పెట్టారు.

కోదండరాం, అలీఖాన్‌కు షాక్

(మొదటిపేజీ తరువాయి)



వేయడానికి అవకాశం ఇద్దామనే ఉద్దేశంతోనే ఆ రోజు స్టే ఇచ్చాం. హైకోర్టు రూలింగ్‌ను అడ్డుకోవడం కోసం కాదు" అని ధర్మాసనం పేర్కొంది. కాబట్టి ఇప్పుడు ఆ ఆదేశాలను సవరిస్తున్నట్టు వెల్లడించింది. గత ఏడాది ఆగస్టులో ఇచ్చిన ఉత్తర్వుల్లో 'స్టే'కు సంబంధించిన వాక్యాన్ని తొలగిస్తున్నట్టు తెలిపింది. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్‌ల నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రావణ్, కుర్రా సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం ఈ సంచలన తీర్పు వెలువరించింది. అయితే వారి పేర్లను ప్రభుత్వం మరోసారి సిఫారసు చేయవచ్చని, వారి నామినేషన్లను స్వీకరించవచ్చని తెలిపింది. కానీ, ఏ నామినేషన్ వేసినా ఈ అంశంపై తుది తీర్పునకు అనుగుణంగానే ఉంటుందని స్పష్టం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రావణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర మంత్రివర్గం గవర్నర్‌కు సిఫారసు చేయగా.. వారికి రాజకీయ నేపథ్యం ఉందంటూ ఆ ఇద్దరి పేర్లను అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించడంతో వివాదం మొదలైంది. గవర్నర్ నిర్ణయాన్ని వారిద్దరూ వేర్వేరుగా హైకోర్టులో సవాల్ చేశారు. అయితే హైకోర్టులో కేసు నడుస్తుండగానే రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. గతేడాది జనవరి 13న కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా మంత్రివర్గం సిఫారసు చేసింది. దీనికి గవర్నర్ ఆమోదం తెలిపారు.

మరోసారి హైకోర్టుకు వెళ్లడంతో..

దాసోజు శ్రావణ్, సత్యనారాయణ మరోసారి హైకోర్టుకు వెళ్లగా.. వీరి నామినేషన్లను తిరస్కరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ గతేడాది మార్చి 17న హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పు వెలువరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేసింది. అనంతరం కోదండరాం, అలీఖాన్‌ల పేర్లను రాష్ట్ర మంత్రివర్గం మరోసారి సిఫారసు చేసింది. ఇందుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో వారు ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. దీంతో శ్రావణ్, సత్యనారాయణ గతేడాది ఆగస్టు 4న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్లపై బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరు పక్షాల వాదనల అనంతరం.. గతంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై తామిచ్చే తీర్పునకు అనుగుణంగా ఎమ్మెల్సీల నియామకం ఉంటుందని పేర్కొంది. గతంలో హైకోర్టు తీర్పుపై స్టే విధించడాన్ని అవకాశంగా తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం నామినేట్ చేసినవారు ప్రమాణ స్వీకారం కూడా చేశారని పిటిషనర్ల తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాము మధ్యంతర ఉత్తర్వు జారీ చేయడమే తప్పు అని తేలిందని న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ వ్యాఖ్యానించారు. అయితే వారిద్దరి పేర్లను మళ్లీ సిఫారసు చేయవచ్చునని, తాజా నామినేషన్లు స్వీకరించవచ్చని అభిప్రాయపడ్డారు. కానీ, భవిష్యత్తులో ఏ తాజా నామినేషన్ వేసినా ఈ పిటిషన్‌పై తుది తీర్పునకు అనుగుణంగానే ఉంటుందని ధర్మాసనం పేర్కొంటూ తదుపరి విచారణను సెప్టెంబరు 17కు వాయిదా వేసింది.

ధర్మం గెలిచింది..

సుదీర్ఘ పోరాటం తర్వాత ధర్మం గెలిచిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తీర్పు కాపీ పూర్తిగా వచ్చిన తర్వాత మిగతా వివరాలు తెలుస్తాయని, సెప్టెంబరు 17న ఏం చెబుతుందో చూడాలని వ్యాఖ్యానించారు. కాగా, సుప్రీంకోర్టు తీర్పు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెంపపెట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆ పార్టీల అప్రజాస్వామిక విధానాలను ఎంతమాత్రం సాగనివ్వబోమని చాటిచెప్పిన న్యాయవ్యవస్థకు బీఆర్ఎస్ సలాం చేస్తోందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. మహోన్నత భారత రాజ్యాంగాన్ని గౌరవించకుంటే పరాభవం తప్పదని కేంద్రంలోని బీజేపీ ఇప్పటికైనా గుర్తించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించి గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీల 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు.

అడవి పునరుద్ధరణకు సమగ్ర ప్రణాళిక

- 6 నుంచి 8 వారాల్లో నివేదిక ఇస్తాం
- కంచ గచ్చిబౌలి కేసులో సుప్రీంకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూ వ్యవహారంలో అటవీ పునరుద్ధరణకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలియజేసింది. అయితే, మంచి ప్రణాళికతో వస్తే రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించడమే కాక సుమోటోగా తీసుకున్న చర్యలను కూడా ఉపసంహరించుకుంటామని సీజేఐ జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. సీజేఐ జస్టిస్ గవాయి, జస్టిస్ కె వినోద్ చంద్రన్‌తో కూడా ద్విసభ్య ధర్మాసనం కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, మేనక గురుస్వామి, బీ ద ఛేంజ్ వెల్ఫేర్ సొసైటీ పిటిషన్ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు, పి.మోహిత్‌రావు, మరో పిటిషన్ తరఫున ఎస్.నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. కంచ గచ్చిబౌలి ప్రాంతంలో ప్రస్తుతం పనులన్నీ ఆగిపోయాయని, ఈ అంశంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని ధర్మాసనానికి తెలిపారు అడవులు, చెరువులను కాపాడేందుకు ప్రస్తుతం ఓ సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఇందుకు తమకు మరికొంత సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన జస్టిస్ బీఆర్ గవాయి ఎటువంటి ప్రణాళికలని ప్రశ్నించగా.. తమ ప్రణాళికలను రికార్డు రూపంలో న్యాయస్థానానికి సమర్పించేందుకు ఆరు నుంచి ఎనిమిది వారాల గడువు కావాలని అభిషేక్ కోరారు. సీజేఐ స్పందిస్తూ.. మంచి ప్రతిపాదనతో వస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. మంచి ప్రతిపాదనతో వస్తే ప్రశంసిస్తామని, రాష్ట్రంపై సుమోటోగా తీసుకున్న చర్యలను ఉపసంహరించుకుంటామని, పర్యావరణ పరిరక్షణే తమకు ముఖ్యమని వ్యాఖ్యానించారు. కంచ గచ్చిబౌలి ప్రాంతంలో నాశనమైన అడవిని ఎట్టి పరిస్థితుల్లో పునరుద్ధరించాల్సిందేనని పునరుద్ఘాటించారు. అయితే, తన పదవీ విరమణ లోపే ఆ ప్రణాళికలు రూపొందించాలంటూ సీజేఐ చమత్కరించారు.


సబిత, కృపానందంను నిర్దోషులుగా ప్రకటించడం చెల్లదు

ఓఎంసీ కేసులో సీబీఐ కోర్టు తీర్పుపై హైకోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ అప్పీల్ దాఖలు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో అప్పటి పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి బీ కృపానందం, అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషులుగా ప్రకటించడం చెల్లదని సీబీఐ పేర్కొంది. ఓఎంసీ కేసులో ఏ-8 కృపానందం, ఏ-9 సబితపై కేసు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ నాంపల్లి సీబీఐ కోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న బీవీ శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి గాలి జనార్ధన్ రెడ్డి, అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, ఓఎంసీ కంపెనీ, గాలి జనార్ధన్‌రెడ్డి సన్నిహితుడు మెఫుజ్ అలీఖాన్‌ను మాత్రం సీబీఐ కోర్టు దోషులుగా ప్రకటించింది. ఆ తర్వాత వారు హైకోర్టుకు వెళ్లి బెయిల్ పొంది జైలు నుంచి విడుదలయ్యారు. మరో నిందితురాలు (ఏ-6), ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ (డిశ్చార్జి పిటిషన్)ను ఇటీవలే హైకోర్టు కొట్టేసింది. ఆమె విచారణను ఎదుర్కోవాల్సిందే అని స్పష్టం చేసింది. కాగా, ఈ కేసులో కృపానందం, సబితను నిర్దోషులుగా ప్రకటిస్తూ మే 6న సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేయాలని హైకోర్టులో సీబీఐ అప్పీల్ దాఖలు చేసింది. వారిద్దరి విషయంలో సీబీఐ కోర్టు పొరపాటు చేసిందని, కేవలం ఊహలు, అంచనాల ఆధారంగా వారికి కేసు నుంచి విముక్తి కల్పించిందని సీబీఐ ఆరోపించింది. కృపానందం, సబితలకు వ్యతిరేకంగా స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోవడంలో సీబీఐ కోర్టు విఫలమైందని పేర్కొంది. గాలి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలోని ఓఎంసీకి అక్రమంగా గనుల లీజు కేటాయించడంలో వారి పాత్ర సైతం ఉందని స్పష్టం చేసింది. కాగా ప్రజాప్రతినిధుల క్రిమినల్ కేసులు విచారించే రోస్టర్ ఉన్న జస్టిస్ కే లక్ష్మణ్ సెలవులో ఉండటంతో ఈ అప్పీల్ పిటిషన్ బుధవారం జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఓఎంసీ కేసుకు సంబంధించి గతంలో తాను న్యాయవాదిగా కొంతమందికి ప్రాతినిధ్యం వహించానని పేర్కొన్న జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి.. విచారణను ఈ నెల 18కి వాయిదా వేశారు.

గంటల్లోనే చెక్కుల క్లియరెన్స్

అక్టోబరు 4 నుంచి అమలు.. ప్రస్తుతం 2 రోజుల వరకు సమయం



ముంబై: బ్యాంకుల్లో చెక్కుల క్లియరెన్స్ మరింత వేగవంతం కానుంది. ప్రస్తుతం బ్యాంక్‌లో సమర్పించిన చెక్కు క్లియరెన్స్‌కు 2 రోజుల సమయం పడుతుండగా.. ఈ అక్టోబరు 4 నుంచి ఆ ప్రక్రియ కొద్ది గంటల్లోనే పూర్తికానుంది. ఇందుకోసం చెక్కుల ట్రంకేషన్ సిస్టమ్‌ను (సీటీఎస్) ప్రస్తుతం అనుసరిస్తున్న బ్యాచ్ ప్రాసెసింగ్ పద్ధతి నుంచి కంటిన్యుయస్ క్లియరింగ్ అండ్ సెటిల్‌మెంట్ ఆన్ రియలైజేషన్ పద్ధతికి మార్చనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. బ్యాచ్-ప్రాసెసింగ్ విధానంలో నిర్దిష్ట సమయం వరకు వచ్చిన చెక్కులన్నింటినీ ఒక బ్యాచ్‌గా ప్రాసెస్ చేసి, క్లియర్ చేస్తారు. ఈ విధానంలో చెక్కు క్లియరెన్స్‌కు రెండు రోజుల వరకు సమయం పడుతుంది. కొత్తగా ప్రవేశపెడుతున్న కంటిన్యుయస్ క్లియరింగ్ అండ్ సెటిల్‌మెంట్ ఆన్ రియలైజేషన్ పద్ధతిలో బ్యాంక్‌లు ప్రజెంటేషన్ సెషన్‌లో (ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు) కస్టమర్లు సమర్పించిన చెక్కులను ఎప్పటికప్పుడు స్కాన్ చేసి, క్లియరింగ్ హౌస్‌కు పంపుతాయి. తద్వారా కొన్ని గంటల సమయంలోనే చెక్కు క్లియర్ కానుంది. చెక్కు ద్వారా చెల్లింపులు జరిపేవారికి, సొమ్ము అందుకునేవారికీ ఈ విధానం లాభదాయకం కానుంది.

రెండు దశల్లో అమలు

కంటిన్యుయస్ క్లియరింగ్‌కు మారే ప్రక్రియ రెండు విడతల్లో జరగనుంది. అక్టోబరు 4 నుంచి తొలి విడత, 2026 జనవరి 3 నుంచి రెండో విడతను అమలు చేయనున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. తొలి విడతలో డ్రాయీ బ్యాంక్‌లు తమ వద్దకు వచ్చిన చెక్కులకు అంగీకారం లేదా తిరస్కారాన్ని కన్ఫర్మేషన్ సెషన్ ముగిసేలోపు (రాత్రి 7 గంటలు) తెలియజేయాల్సి ఉంటుంది. లేదంటే ఆ చెక్కును అంగీకరించినట్లుగా భావించి, పరిష్కరించడం జరుగుతుంది. రెండో విడతలో డ్రాయీ బ్యాంక్‌లు తమకు అందిన చెక్కుల సెటిల్‌మెంట్‌పై అంగీకారం లేదా తిరస్కారాన్ని 3 గంటల్లో తెలియజేయాల్సి ఉంటుంది. చెక్కు సెటిల్‌మెంట్ అనంతరం క్లియరింగ్ హౌస్ ఆ చెక్కు అంగీకారం లేదా తిరస్కార సమాచారాన్ని ప్రజెంటింగ్ బ్యాంక్‌కు (కస్టమరు చెక్కు సమర్పించిన బ్యాంక్) వెల్లడించాల్సి ఉంటుంది. నిర్దేశిత తేదీ నుంచి కొత్త విధానంలోకి మారేందుకు బ్యాంక్‌లు తమ సీటీఎస్‌ను సిద్ధం చేసుకోవాలని ఆర్‌బీఐ కోరింది.



మార్కెట్లోకి కొత్త బెంజ్

ధర రూ. 1.35 కోట్లు

న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ భారత్‌లో తన కార్ల పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. 'మెర్సిడెస్ ఏఎంజీ సీఎల్‌ఈ 53 4మ్యాటిక్‌ప్లస్ కూపే'ను బుధవారం మన మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ధర రూ.1.35 కోట్లు. ఈ కారు జీరో నుంచి 100 కి.మీ వేగాన్ని కేవలం 4.2 సెకన్లలో అందుకోగలదని, గంటకు గరిష్ఠంగా 250 కి.మీ వేగంతో దూసుకెళ్లగలదని కంపెనీ వెల్లడించింది.

డీహెచ్‌ఎఫ్ఎల్ కేసులో వధావన్ సోదరులపై సెబీ నిషేధం

న్యూఢిల్లీ: దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (డీహెచ్‌ఎఫ్ఎల్) మాజీ సీఎండీ కపిల్ వధావన్, మాజీ డైరెక్టర్ ధీరజ్ వధావన్‌తో పాటు మరో నలుగురిపై సెబీ భారీ వేటు వేసింది. కంపెనీ నిధులను మళ్లించడంతో పాటు అకౌంటింగ్ అక్రమాలకు పాల్పడినందుకుగాను వారిని సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి ఐదేళ్ల వరకు నిషేధించడమే కాకుండా రూ.120 కోట్ల జరిమానా కూడా విధించింది. అంతేకాదు, వారిని ఐదేళ్లపాటు ఏ లిస్టెడ్ కంపెనీలోనూ కీలక పదవిని చేపట్టకుండా నిషేధిస్తున్నట్లు మంగళవారం సెబీ ఆదేశాలు జారీ చేసింది. కపిల్, ధీరజ్‌లతోపాటు డీహెచ్ఎఫ్ఎల్ మాజీ నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాకేశ్ వధావన్, నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సారంగ్ వధావన్, మాజీ జాయింట్ ఎండీ, సీఈఓ హర్షిల్ మెహతా, మాజీ సీఎఫ్ఓ సంతోష్ శర్మపైనా సెబీ వేటు పడింది.

ఎస్‌బీఐ ఐఎంపీఎస్ ఛార్జీలు పెంపు

రేపటి నుంచి అమలు



న్యూఢిల్లీ: వడ్డీయేతర ఆదాయం పెంచుకునే ప్రయత్నంలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆగస్టు 15 నుంచి ఇమీడియెట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) ఛార్జీలను సవరిస్తోంది. ఈ సవరణ ఆన్‌లైన్ చెల్లింపులకు ఒకలా, బ్రాంచ్ నెట్‌వర్క్ ద్వారా చేసే చెల్లింపులకు ఒకలా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇప్పటి వరకు ఉన్న ఉచిత ఐఎంపీఎస్ చెల్లింపుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25,000కు కుదించారు. ఆగస్టు 15 నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.25,000 నుంచి రూ.లక్ష వరకు జరిగే ఐఎంపీఎస్ చెల్లింపులపై రూ.2+జీఎస్‌టీ, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జరిగే చెల్లింపులపై రూ.6+జీఎస్‌టీ, రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు జరిగే చెల్లింపులపై రూ.10+జీఎస్‌టీ వసూలు చేయనున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఇక బ్రాంచిల ద్వారా జరిగే ఐఎంపీఎస్ చెల్లింపులపై వసూలు చేసే ఛార్జీల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. ఎప్పటిలానే ఈ చెల్లింపులపై కనిష్ఠంగా రూ.2+జీఎస్‌టీ, గరిష్ఠంగా రూ.20+జీఎస్‌టీ వసూలు చేస్తారు. అయితే వేతన ఖాతాదారులకు మాత్రం ఎప్పటిలా ఈ సేవలు ఉచితమని ఎస్‌బీఐ తెలిపింది. కెనరా బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు కూడా ఆగస్టు 15 నుంచి తమ ఐఎంపీఎస్ ఛార్జీలను సవరిస్తున్నాయి.

ఎల్ఐసీలో 3% వాటా విక్రయం?

రూ. 17,000 కోట్ల వరకు సమీకరణ!!



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో కేంద్రం 2.5-3 శాతం వాటా విక్రయించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియలో భాగంగా ఎల్ఐసీలో తొలి విడతగా మోదీ సర్కారు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ఈ వాటాను విక్రయించాలనుకుంటోంది. ఇందుకు సంబంధించి వచ్చే రెండు వారాల్లోగా రోడ్ షోలను ప్రారంభించనున్నట్లు తెలిసింది. మోతీలాల్ ఓస్వాల్, ఐడీబీఐ క్యాపిటల్ ఈ ప్రక్రియకు మర్చంట్ బ్యాంకర్లుగా వ్యవహరించే అవకాశం ఉంది. రోడ్‌షో అనంతరం విక్రయించనున్న వాటా, ధరలపై ప్రభుత్వం తుది నిర్ణయానికి రానుందని తెలిసింది. బుధవారం ఎల్ఐసీ షేరు 3.50% తగ్గి రూ.884.30 వద్ద ముగిసింది. ఈ లెక్కన కంపెనీలో వాటా విక్రయం ద్వారా ప్రభుత్వం రూ.14,000-17,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎల్ఐసీలో కేంద్ర ప్రభుత్వం 96.5% వాటా కలిగి ఉంది. ఎల్ఐసీ తన పబ్లిక్ షేర్‌హోల్డింగ్ వాటాను ప్రస్తుతమున్న 3.5% నుంచి 2027 మార్చి 16 నాటికి 10 శాతానికి పెంచుకోవాలని సెబీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్రం ఎల్ఐసీలో వాటాల ఉపసంహరణకు సిద్ధమయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.47,000 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో మూడో వంతు వరకు ఎల్ఐసీ వాటా ద్వారానే సమకూరే అవకాశం ఉంది.

హైదరాబాద్‌లో 800 పడకల ఆస్పత్రి

● ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, అజింక్యా డివై పాటిల్ హెల్త్‌కేర్ భాగస్వామ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్‌లోని నిజాంపేటలో 800 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఉమ్మడి నిర్వహణపై ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, అజింక్యా డీవై పాటిల్ హెల్త్‌కేర్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో హెల్త్‌కేర్ సర్వీసుల ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయాలన్న ఉమ్మడి లక్ష్యంతో చేతులు కలిపిన రెండు సంస్థలు అందుబాటు ధరల్లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సంరక్షణ సేవలందించేందుకు కృషి చేయనున్నట్టు తెలిపాయి. ఉభయ సంస్థలకు ఆయా విభాగాల్లో గల నైపుణ్యాలను జోడించి నిర్వహించనున్న ఈ ఆస్పత్రి క్రిటికల్, ఎమర్జెన్సీ కేర్; కార్డియాక్ సైన్సులు, అంకాలజీ, రేడియేషన్ అంకాలజీలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తుంది. దశలవారీగా జరిగే ఈ అభివృద్ధి క్రమంలో ఒక్కో దశ అందుబాటులోకి వస్తున్న కొద్దీ అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్ చైర్మన్ దండు శివరామరాజు తెలిపారు. ఉభయ సంస్థలు తమ పరిధిని విస్తరించుకుంటూ సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని అజింక్యా డివై పాటిల్ హెల్త్‌కేర్ చైర్మన్ డాక్టర్ అజింక్యా పాటిల్ అన్నారు.

ఆర్ అండ్ డీలో పెట్టుబడులు కీలకం: ఫార్మెక్సిల్

న్యూఢిల్లీ: ప్రపంచ ఫార్మా మార్కెట్ మరింత అనుసంధానం అవుతున్న దశలో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై మరిన్ని పెట్టుబడులు పెట్టడం పైనే భారత ఫార్మా భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని భావిస్తున్నట్టు ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషి చెప్పారు. దీనికి తోడు ఏఐ ఆధారిత ఔషధ డిస్కవరీ, డిజిటల్ హెల్త్ టెక్నాలజీలు, సుస్థిర తయారీ విధానాలు అభివృద్ధి చేసుకోవడం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. అధిక విలువ గల బయో సిమిలర్లు, ఆర్ఫాన్ ఔషధాలు, ఆధునిక డెలివరీ వ్యవస్థలకు మనం కల్పిస్తున్న ప్రాధాన్యత వల్ల ఆర్థికంగా మన స్థితి బలోపేతం కావడంతో పాటు ఫార్మా సేవలు అంతగా అందుబాటులో లేని మార్కెట్లకు జీవనాధార ఔషధాల సరఫరాను విస్తరించవచ్చునని సంస్థ డైరెక్టర్ జనరల్ రాజా భాను చెప్పారు.

'అరాజెన్'లో ఎస్‌బీఐ లైఫ్, అవెండస్‌కు వాటా

● రూ.300 కోట్లతో 2.5 శాతం కొనుగోలు

హైదరాబాద్: కాంట్రాక్టు పద్ధతిలో ఔషధ పరిశోధన, అభివృద్ధి, తయారీ (సీఆర్‌డీఎంఓ) రంగంలో ఉన్న అరాజెన్ లైఫ్ సైన్సెస్ కంపెనీ ఈక్విటీలో తాజాగా అవెండస్ ఫ్యూచర్ లీడర్స్ ఫండ్ 3, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ 2.5 శాతం వాటా కొనుగోలు చేశాయి. ఇందుకోసం ఈ రెండు సంస్థలు రూ.300 కోట్ల వరకు చెల్లించినట్టు సమాచారం. జీవీకే రెడ్డి కుటుంబంనుంచి ఈ వాటాను కొనుగోలు చేసినట్టు అవెండస్ కంపెనీ వర్గాలు చెప్పాయి. చైనా+1 వ్యూహంలో భాగంగా అనేక అంతర్జాతీయ ఫార్మా కంపెనీలు పరిశోధన, అభివృద్ధి, తయారీ కార్యకలాపాలను భారత్‌కు తరలిస్తున్నాయి. ఈ చర్య 'అరాజెన్ లైఫ్ సైన్సెస్'కు ఉపయోగపడుతుందనే అంచనాతో ఎస్‌బీఐ లైఫ్, అవెండస్ గ్రూప్ ఈ వాటా కొనుగోలు చేసినట్టు భావిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,350 ▼	92,900 ▼	1,25,000 ▼
విజయవాడ	1,03,200 ▲	97,000 ▲	1,18,750 ▲
విశాఖపట్నం	1,02,980 ▼	93,750 ▼	1,25,000 ▼
రాజమండ్రి	1,01,400 ▼	92,950 ▼	1,18,000 ▲
ప్రొద్దుటూరు	1,00,550 ▲	92,510 ▲	1,17,500 ▲
ముంబై	1,00,100 ▲	91,690 ▲	1,15,275 ▲

సెన్సెక్స్ 304 పాయింట్లు అప్

ముంబై: ఈక్విటీ మార్కెట్ బుధవారం లాభాల బాట పట్టింది. సెన్సెక్స్ 304.32 పాయింట్ల వృద్ధితో 80,539.91 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 131.95 పాయింట్లు పెరిగి 24,619.35 వద్ద ముగిసింది. జూలై నెలలో ద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల కనిష్ఠానికి జారుకోవడంతో వినియోగం మళ్లీ పుంజుకోనుందన్న అంచనాలు ఇందుకు దోహదపడ్డాయి.ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 16 పైసలు పెరిగి రూ.87.47 వద్ద ముగిసింది.

ఫ్రాక్టల్ అనలిటిక్స్ రూ.4,900 కోట్ల ఐపీఓ: కృత్రిమ మేధ (ఏఐ) సేవలందించే ఫ్రాక్టల్ అనలిటిక్స్ పబ్లిక్ ఆఫరింగ్‌కు (ఐపీఓ) అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. దేశంలో ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలనుకుంటున్న తొలి ఏఐ కంపెనీ ఇదే. ముంబై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీ ఐపీఓలో భాగంగా రూ.1,279.3 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.3,620.7 కోట్ల ఈక్విటీ వాటా షేర్ల విక్రయం ద్వారా మొత్తం రూ.4,900 కోట్లు సమీకరించాలనుకుంటోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	548	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	114
వరంగల్	100	గుంటూరు	119
కరీంనగర్	100	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	95
కర్నూలు	100	నెల్లూరు	100
విశాఖపట్నం	108	అనంతపురం	100
గోదావరి	114		

స్పోర్ట్స్

మెరిసిన యాస్తిక, రాధ

● తొలి వన్డేలో భారత్ 'ఏ' గెలుపు


యాస్తిక (59)

బ్రిస్బేన్: ఓపెనర్ యాస్తికా భాటియా (59) హాఫ్ సెంచరీతో, స్పిన్నర్ రాధా యాదవ్ (3/45)తో మూడు వికెట్లతో సత్తా చాటడంతో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో జరిగిన తొలి వన్డేలో భారత్ 'ఏ' మూడు వికెట్లతో నెగ్గింది. బుధవారం జరిగిన పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా మహిళలు 47.5 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటయ్యారు. అనికా (92 నాటౌట్), ట్రినమన్ (51) రాణించారు. టిటాస్, మిన్ను మణి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత మహిళలు 42 ఓవర్లలో 215/7తో లక్ష్యాన్ని ఛేదించారు. షఫాలీ (36), ధారా (31), రాఘవీ (25 నాటౌట్), కెప్టెన్ రాధా యాదవ్ (19) తలో చేయి వేశారు.

అర్జున్‌కు ఇంకో డ్రా

చెన్నై: తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసికి చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీలో వరుసగా మూడో డ్రా ఎదురైంది. బుధవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో జీఎం అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. తెల్లపావులతో ఆడిన ఇరిగేసి 35 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. రే రాబ్సన్ (అమెరికా)పై నిహాల్ సరీన్, విదిత్ గుజరాతీపై కార్తికేయన్ గెలిచారు. ఏడు రౌండ్లు ముగిసే సరికి అర్జున్ మొత్తం 4 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. కాగా, చాలెంజర్స్ విభాగంలో జీఎం హారిక ద్రోణవల్లి ఐదో ఓటమి చవిచూసింది. సహచరుడు హర్షవర్ధన్ చేతిలో హారిక, ప్రణేష్ చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు.


భారత షట్లర్లకు కఠిన డ్రా

పేలవ ఫామ్‌లో సింధు, లక్ష్య సేన్

వరల్డ్ చాంపియన్‌షిప్స్



పారిస్: బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత షట్లర్లకు కఠిన సవాళ్లు ఎదురు కానున్నాయి. ఈ నెల 25 నుంచి 31 వరకు జరిగే మెగా టోర్నీ డ్రాను బుధవారం విడుదల చేశారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్‌కు తొలి రౌండ్‌లోనే వరల్డ్ నెం:1 షి యు కి (చైనా) రూపంలో గండం ఎదురుకానుంది. పారిస్ ఒలింపిక్స్ సెమీస్‌లో ఓటమి తర్వాత లక్ష్య సేన్ మళ్లీ పుంజుకోలేకపోయాడు. 2021 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో సేన్ కాంస్యం సాధించాడు. మరో భారత షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ కూడా ఫామ్‌లో లేడు. తొలి రౌండ్ గట్టెక్కినా.. రెండో రౌండ్‌లో వరల్డ్ నెం:2 ఆండ్రెస్ అంటాన్‌సెన్ రూపంలో ముప్పు పొంచి ఉంది. కాగా, 2019 చాంపియన్ పీవీ సింధు మాత్రమే మహిళల సింగిల్స్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహిస్తోంది. తొలి రౌండ్‌లో కలోయనా నల్‌బంటోవా (బల్గేరియా)తో సింధు తలపడనుంది. ఫామ్ కోసం తంటాలు పడుతున్న సింధు.. ప్రీక్వార్టర్స్‌లో రెండో సీడ్ వాంగ్ జి యి (చైనా)ను ఢీకొనాల్సి రావచ్చు. ఈ టోర్నీలో సింధు స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు సాధించింది. ఈ ఏడాది ఇండియా ఓపెన్ క్వార్టర్స్ చేరడమే సింధు అత్యుత్తమ ప్రదర్శన. కాగా, పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంటకు తొలి రౌండ్ బై లభించింది. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి జోడీ టోర్నీ నుంచి తప్పుకోగా.. రితుపర్ణ-శ్వేతపర్ణ, ప్రియ కొన్‌జెంగ్‌బమ్-శ్రుతి మిశ్రా జంటలు బరిలో నిలవనున్నాయి. మిక్స్‌డ్‌లో రుత్విక గద్దె-రోహన్ కపూర్, ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో ద్వయాలు ఆడనున్నాయి.




గుల్వీర్ తన రికార్డును తానే..

న్యూఢిల్లీ : గుల్వీర్ సింగ్ పురుషుల మూడు వేల మీటర్ల రేస్‌లో తన జాతీయ రికార్డును తానే అధిగమించాడు. మంగళవారం రాత్రి బుడాపెస్ట్‌లో జరిగిన హంగేరియన్ అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో గుల్వీర్ 7 నిమిషాల 34.49 సె.లలో గమ్యం చేరి ఐదో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏడు నిమిషాల 38.26 సె.లలో నెలకొల్పిన గత జాతీయ రికార్డును గుల్వీర్ అధిగమించాడు. కాగా..పురుషుల ఐదు వేల మీటర్లు, 10 వేల మీటర్ల జాతీయ రికార్డులు కూడా 27 ఏళ్ల గుల్వీర్ పేరిటే ఉండడం విశేషం.

సుశీల్ బెయిల్ రద్దు

వారం రోజుల్లో లొంగిపోవాలి..
సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : జాతీయ జూనియర్ రెజ్లింగ్ మాజీ చాంపియన్ సాగర్ ధన్కడ్ హత్య కేసులో..ఒలింపిక్ పతక విజేత రెజ్లర్ సుశీల్ కుమార్ బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈమేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత సుశీల్‌కు బెయిల్ ఇస్తూ మార్చి నాలుగున ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కనబెట్టింది. సుశీల్ కుమార్ వారం రోజుల్లో లొంగిపోవాలని సూచించింది. సాగర్ ధన్కడ్ హత్య కేసులో సుశీల్‌తోపాటు మరో 17 మంది అభియోగాలు ఎదుర్కొంటున్నారు.

ఏమిటీ కేసు?

ఆస్తి వివాదం నేపథ్యంలో..మే, 2021న న్యూఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో సాగర్ ధన్కడ్, అతడి స్నేహితులు ఇద్దరిపై సుశీల్ కుమార్ తదితరులు దాడి చేసినట్టు కేసు నమోదైంది. తీవ్ర గాయాలతో సాగర్ మరణించినట్టు పోస్టుమార్టంలో తేలింది. దాంతో అదే నెలలో పోలీసులు సుశీల్‌ను అరెస్ట్ చేశారు. సాగర్ హత్య కేసులో సుశీల్ కీలక పాత్ర పోషించినట్టు 2022 అక్టోబరులో ఢిల్లీ ట్రయల్ కోర్టులో దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో పోలీసులు పేర్కొన్నారు. కాగా..మూడున్నర సంవత్సరాలు జైలులో ఉన్న సుశీల్ గత మార్చిలో బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. అతడి వాదనలు విన్న హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే సుశీల్‌కు బెయిల్ ఇవ్వడాన్ని సాగర్ తండ్రి అశోక్ ధన్కడ్ సుప్రీంకోర్టులో సవాలు చేశాడు.




కామన్వెల్త్ క్రీడల బిడ్ దాఖలుకు ఐవోఏ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: కామన్వెల్త్ క్రీడల (2030) నిర్వహణ కోసం బిడ్‌లు దాఖలు చేయడానికి భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధికారికంగా ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం)లో ఈ నిర్ణయం తీసుకొంది. అహ్మదాబాద్ వేదికగా 2030 క్రీడల నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణ లేఖను భారత్ ఈపాటికే అందజేసింది. అయితే, ఫైనల్ బిడ్‌ను ఈనెల 31లోపు దాఖలు చేయాల్సి ఉంది. నవంబరులో ఆతిథ్య హక్కులను ఖరారు చేయనున్నారు. భారత్‌కు పతకాల పంట పండించే అన్ని క్రీడా విభాగాలతో గేమ్స్‌ను సమగ్రంగా నిర్వహించాలనుకొంటున్నట్టు ఐవోఏ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ క్రీడల నిర్వహణ కోసం రేసులో ఉన్న కెనడా తప్పుకోవడంతో.. భారత్‌కే ఆతిథ్య హక్కులు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 2010 క్రీడలకు ఆతిథ్యమిచ్చిన ఢిల్లీతోపాటు భువనేశ్వర్‌ను కూడా పోటీల నిర్వహణకు పరిశీలిస్తున్నట్టు ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపింది. 2026 గ్లాస్గో క్రీడలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ఖర్చు నియంత్రణలో భాగంగా హాకీ, రెజ్లింగ్, షూటింగ్, బ్యాడ్మింటన్ లాంటి అంశాలను తొలగించారు. అయితే, భారత్ ఆతిథ్యమిచ్చే క్రీడల్లో మాత్రం అన్నింటికీ చోటు కల్పించాలనుకొంటున్నారు. దేశవాళీ క్రీడలైన కబడ్డీ, ఖో-ఖోకు కూడా స్థానం కల్పించే అవకాశాలున్నాయని ఐవోఏ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ చౌబే చెప్పాడు.

2030 కామన్వెల్త్ క్రీడల బిడ్డింగ్
ప్రతిపాదిత వేదిక: అహ్మదాబాద్ (గుజరాత్)
ఆఖరి తేదీ : ఆగస్టు 31
తుది నిర్ణయం: నవంబరు, గ్లాస్గోలో

టెస్ట్ క్రికెట్‌తో చిన్న దేశాలు దివాలా!

● సీఏ చీఫ్ గ్రీన్‌బర్గ్



న్యూఢిల్లీ: టెస్ట్ క్రికెట్ విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) చీఫ్ టాడ్ గ్రీన్‌బర్గ్ సంచలన హెచ్చరికలు చేశాడు. అన్ని జట్లూ సుదీర్ఘ ఫార్మాట్ ఆడాల్సిన అవసరం లేదన్నాడు. చిన్న దేశాలను టెస్ట్ క్రికెట్ ఆడేలా బలవంతం చేస్తే.. అవి దివాలా తీసే ప్రమాదం ఉందని చెప్పాడు. యాషెస్ తరహాలో ప్రజాదరణ ఉన్న సిరీస్‌లకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నాడు. భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలు ఆడే సిరీస్‌లకు ఎక్కువ క్రేజ్ ఉండడంతో.. వాటిపైనే ఎక్కువగా పెట్టుబడులు పెడితే ఆదాయం కూడా వస్తుందని చెప్పాడు. జట్ల మధ్య పోటీ కూడా అదే స్థాయిలో ఉంటుంది కాబట్టి.. సుదీర్ఘ ఫార్మాట్‌కు ఆదరణ కూడా లభిస్తుందన్నాడు.

రోహిత్ @ నెం.2

● వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్

దుబాయ్ : ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకుల్లో రోహిత్ శర్మ రెండో స్థానానికి ఎగబాకాడు. బుధవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌ను వెనక్కు నెట్టిన రోహిత్ 756 పాయింట్లతో రెండో స్థానం చేజిక్కించుకున్నాడు. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో విఫలం కావడంతో బాబర్ (751) ర్యాంక్ మూడుకు పడిపోయింది. భారత జట్టు టెస్ట్ కెప్టెన్ గిల్ (784 పాయింట్లు) నెం.1 స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. కోహ్లీ (736) నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. ఇక..టాప్-15లో మొత్తం ఐదుగురు భారత బ్యాటర్లుండడం విశేషం. శ్రేయాస్ 8, కేఎల్ రాహుల్ 15వ ర్యాంక్ దక్కించుకున్నారు.

పాకిస్థాన్ చెత్తాట

● 92 పరుగులకే ఆలౌట్
● విండీస్‌తో మూడో వన్డే


సీల్స్ (6/18)

తరౌబా (ట్రినిడాడ్-టుబాగో): అనిశ్చితికి మారుపేరైన పాకిస్థాన్ మరోసారి చెత్త ప్రదర్శన కనబరచింది. వెస్టిండీస్‌పై టీ20 సిరీస్‌ను సొంతం చేసుకున్న ఆ జట్టు.. మంగళవారం జరిగిన సిరీస్ నిర్ణాయక మూడో వన్డేలో కేవలం 92 పరుగులకే కుప్పకూలింది. తద్వారా 202 పరుగుల భారీ పరాజయాన్ని మూటగట్టుకుంది. తొలుత వెస్టిండీస్ 50 ఓవర్లలో 294/6 స్కోరు చేసింది. కెప్టెన్ షాయ్ హోప్ (120 నాటౌట్) సెంచరీతో కదం తొక్కాడు. జస్టిన్ గ్రీవ్స్ (43 నాటౌట్)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు హోప్ అభేద్యంగా 110 పరుగులు జోడించాడు. ఛేదనలో యువ పేసర్ జేడెన్ సీల్స్ (6/18) ధాటికి పాకిస్థాన్ 29.2 ఓవర్లలో 92 పరుగులకే చాప చుట్టేసింది. సల్మాన్ ఆఘా (30), నవాజ్ (23 నాటౌట్) ఆదుకోకపోయుంటే పాకిస్థాన్ పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. ఈ విజయంతో..1991 తర్వాత పాకిస్థాన్‌పై వెస్టిండీస్ తొలిసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్ గెల్చుకున్నట్టయింది.

పంద్రాగస్టు వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు!

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో శుక్రవారం ఉత్సవాన్ని నిర్వహించనుంది. గోల్కొండ కోటలోని రాణీ మహల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 10 గంటలకు మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఈ సందర్భంగా పోలీసు గౌరవ వందనాన్ని ఆయన స్వీకరిస్తారు. ఈ మేరకు జిల్లా కేంద్రాల్లో పతాకాన్ని ఎగురవేసే మంత్రులు, ప్రజాప్రతినిధుల పేర్లను ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా ఉదయం 9.30 గంటలకు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు.

రైతుల జీవితాలతో కేంద్రం ఆటలు: తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యూరియా, ఎరువుల సరఫరాపై రైతుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. తమ ఎంపీలు బుధవారం కూడా పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారం రావాల్సిన యూరియా సరఫరా చేయాల్సిందిగా కోరారని ఆయన తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు 9.80లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినా, ఏప్రిల్ నుంచి జూలై వరకు 32% కొరత ఏర్పడిందని చెప్పారు. మే నెలలో 45%వరకు లోటు, ఆగస్టు నెలలో 35% కొరత కొనసాగడం రైతులపై కేంద్ర నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. యూరియాలోటును తక్షణమే భర్తీచేయాలని తుమ్మల డిమాండ్ చేశారు.

మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

- ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ-2025 జాబితాలో చోటు

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమల, సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ ప్రకటించిన 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ-2025' జాబితాలో శ్రీధర్ బాబుకు చోటు లభించింది. తమ నాయకత్వంతో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ భారత్‌ను ఏఐ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తోన్న వ్యక్తులతో ఈ జాబితాను రూపొందించామని ఆ సంస్థ బుధవారం ప్రకటించింది. ఇందులో విధాన రూపకర్తల విభాగంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు కేంద్రమంత్రులు అశ్వినివైష్ణవ్, పీయూష్ గోయల్ తదితర ప్రముఖులకు చోటు కల్పించినట్టు తెలిపింది. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్‌చేంజ్‌ను ప్రారంభించడంతోపాటు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో కీలకంగా వ్యవహరించినందుకు శ్రీధర్‌బాబును ఈ జాబితాలోకి ఎంపిక చేశామని అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ పేర్కొంది. అంతేకాక, తెలంగాణలో ఏర్పాటు కానున్న ఏఐ విశ్వవిద్యాలయం అంశంలో శ్రీధర్‌బాబు పాత్రను కూడా కొనియాడింది. కాగా, అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ జాబితాలో తనకు చోటు దక్కడంపై మంత్రి శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు.

ప్రజారోగ్యంపై ఉదాసీనత వద్దు

- ఫార్మా, బల్క్‌డ్రగ్ కంపెనీలపై నిఘా ఉంచాలి: మంత్రి సురేఖ

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు ఫార్మా, బల్క్ డ్రగ్స్ కంపెనీలు ప్రమాణాలు పాటించాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ఉన్నతాధికారులతో సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ హితానికి అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమలకు అనుమతుల విషయంలో అవకతవకలపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. అవసరమైతే ప్రభుత్వం తరఫున టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని... అందుకు సంబంధించిన నివేదిక ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. కాగా పీసీబీ ఉన్నతాధికారులతో తాను నిర్వహిస్తున్న సమీక్షకు కంపెనీల ప్రతినిధులు కాకుండా చిన్నా, చితక ఉద్యోగులు హాజరు కావడం పట్ల మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీలకు అనుమతుల్లో ఉదాసీనత సరికాదని పీసీబీ అధికారులను మంత్రి హెచ్చరించారు.

డిసెంబరు దాకా ఎన్ని నీళ్లు కావాలి?

- ఇండెంట్ పెట్టండి.. ఏపీకి కృష్ణా బోర్డు లేఖ

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగు నీటి అవసరాల కోసం రానున్న డిసెంబరు దాకా ఏ మేరకు నీళ్లు కావాలో ఇండెంట్ సమర్పించాలని ఏపీని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కోరింది. ఈ మేరకు ఏపీ ఈఎన్‌సీకి బోర్డు బుధవారం లేఖ రాసింది. ఆగస్టు నుంచి డిసెంబరు దాకా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 30 టీఎంసీలు... నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి మొత్తంగా సాగునీటికి 148 టీఎంసీలు, తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల నీరు డిసెంబరు దాకా కావాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం బోర్డుకు లేఖ రాసిన విషయం విదితమే. దాంతో డిసెంబరు దాకా తాగు, సాగునీటి అవసరాల కోసం ఎంత నీరు కావాలో ఇండెంట్ సమర్పించాలని కోరుతూ బోర్డు ఎస్ఈ జి.వరలక్ష్మిదేవి బుధవారం లేఖ రాశారు.

రాఖీ పౌర్ణమికి ఆర్టీసీ బస్సుల్లో మహిళల రికార్డు స్థాయి ప్రయాణాలు

- తెలంగాణ ఆర్టీసీ చరిత్రలోనే ఇది రికార్డు



హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో 'మహాలక్ష్మి' పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకున్నారు. ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నాయి. రాఖీ పండుగ నాడు(ఈ నెల 9న) 45.62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా.. ఈ నెల 11న అత్యధికంగా 45.94 లక్షల మంది మహిళలు రాకపోకలు సాగించారు. ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం తెలంగాణ ఆర్టీసీ చరిత్రలో ఇదే తొలిసారి. గతేడాది రాఖీ పండుగకు 2.75 కోట్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయగా ఈ ఏడాది 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించారు. కాగా, రాఖీ పౌర్ణమికి మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున రాకపోకలు సాగించడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. రాఖీ పండుగకు రికార్డుస్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉద్దండపూర్ పంప్‌హౌస్ నిర్మాణ గడువు పెంపు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ఉద్దండపూర్ పంప్‌హౌస్ నిర్మాణ గడువును 2027 మార్చి 15 వరకు పొడిగిస్తూ స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్‌సీ) ఆమోదం తెలిపింది. ఈ పంప్‌హౌస్ పనులు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వద్ద ఉన్న ఉద్దండపూర్ రిజర్వాయర్ సమీపంలో జరుగుతున్నాయి. ఈ పథకం కింద నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తయ్యాయి. పంప్‌హౌస్ నిర్మాణం ప్రస్తుతం కొనసాగుతోంది. బుధవారం జలసౌధలో జరిగిన కమిటీ సమావేశంలో పలు ప్రాజెక్టుల సవరణ అంచనాలకు, గడువు పొడిగింపులకు ఆమోదం లభించింది. కరీంనగర్ జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం సమీపంలో కన్నెపల్లి నుంచి 45 వేల ఎకరాలకు నీరందించే ఎత్తిపోతల పథకం రెండో సవరణ అంచనాలకు కూడా కమిటీ ఆమోదం తెలిపింది.

కొత్త వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంపు!

(మొదటిపేజీ తరువాయి)

శాఖకు వచ్చే ఆదాయంలో సుమారు 70శాతం జీవితకాల పన్నుల నుంచే సమకూరుతోంది. తాజా పన్నుల పెంపుతో అదనంగా రూ. 2 వేల కోట్ల వరకు ఆదాయం రావొచ్చని రవాణాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

కొత్త పన్నులు.. భారం ఇలా..!

- ఇప్పటివరకు ద్విచక్ర వాహనాలకు రెండు శ్లాబుల్లో.. ఎక్స్ షోరూం ధర రూ.50 వేల వరకు ఉంటే 9%, రూ. 50 వేలకంటే ఎక్కువైతే 12% జీవితకాల పన్ను వసూలు చేశారు. తాజాగా నాలుగు శ్లాబులకు పెంచారు.
- రూ.50 వేల వరకు ధర ఉన్నవాటికి 9శాతమే కొనసాగించారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు 12శాతం, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 15శాతం, రూ.2 లక్షలపైన ధర ఉన్నవాటికి 18 శాతం జీవిత పన్నుగా నిర్ణయించారు.
- వ్యక్తిగత కార్లు, త్రీ వీలర్లు, ఇతర వాహనాలకు ఇప్పటివరకు నాలుగు శ్లాబుల్లో.. రూ.5లక్షల లోపు ధర ఉంటే 13శాతం, రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల ధర ఉంటే 14 శాతం, రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల ధర ఉంటే 17శాతం, రూ.20 లక్షలపైన ధర ఉన్న వాహనాలపై 18శాతం పన్ను వసూలు చేశారు. ఇప్పుడు ఐదు శ్లాబులకు పెంచారు.
- రూ.5 లక్షలలోపు 13%, 5 లక్షల నుంచి రూ.10 లక్షల వాహనాలకు 14% పన్నులను యథాతథంగా కొనసాగించారు. రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల ధర ఉంటే 18%, రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల విలువైన వాహనాలకు 20%, రూ.50 లక్షల కంటే ఖరీదైన వాహనాలకు 21% జీవితకాల పన్నుగా నిర్ణయించారు.

భూముల విలువల పెంపు
తొలుత ఓఆర్ఆర్ వరకు!

ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు.. క్యాబినెట్‌లో చర్చించి, విలువల పెంపుపై నిర్ణయం

- అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలు త్వరలోనే పెరగనున్నాయి. క్యాబినెట్ సమావేశంలో చర్చించిన తర్వాత భూముల విలువలను పెంచుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించినట్లు తెలిసింది. తొలుత కోర్ అర్బన్ రీజియన్ (ఓఆర్ఆర్ లోపల) పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. కోర్ అర్బన్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతం మీద సమగ్ర అధ్యయనం చేసి, ఎక్కడా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా చూసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించినట్లు తెలిసింది. భూముల విలువల పెంపుపై జిల్లా కమిటీల నుంచి నివేదికలు వచ్చాక.. వాటిపై రాబోయే మంత్రివర్గ సమావేశంలో చర్చించి, అమలుపై తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలుస్తోంది. విలువల పెంపును కోర్ అర్బన్ రీజియన్‌లో తొలుత అమలు చేసి, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలుపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు; గృహనిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలపై సీఎం సుదీర్ఘంగా చర్చించారు. వ్యవసాయ భూముల విలువలు ఇప్పటికీ కోర్ అర్బన్ రీజియన్‌లో ఎకరా రూ.20 లక్షలు ఉందని.. బహిరంగ మార్కెట్‌లో మాత్రం ఎకరా రూ.10-20 కోట్ల మధ్య ఉందనే అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఇలాంటి విలువలను రెండు, మూడు రెట్లు వరకు పెంచాలనే దానిపై క్యాబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకుందామనే అభిప్రాయాన్ని వ్యక్తం



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో పొంగులేటి

చేసినట్లు సమాచారం. అలాగే ఓఆర్ఆర్ లోపల చాలా ప్రాంతాల్లో గజం భూమి ధర (రిజిస్ట్రేషన్ బుక్ వాల్యూ) రూ.2000-2500 లోపు ఉందని, అదే భూమి గజం రూ.30-50వేల మధ్య విక్రయాలు జరుగుతున్నాయని అధికారులు వివరించినట్లు తెలిసింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని, కలెక్టర్ల నుంచి తెప్పించే నివేదికల్లో పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా భూములకు భూధార్‌నంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. వారసత్వ, ఇతర మ్యుటేషన్ల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లు భూములను సర్వే చేసిన తర్వాత వాటిని రెగ్యులర్ సర్వేయర్లు పరిశీలించాలని ఆదేశించారు. కోర్ అర్బన్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న 10సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను రేవంత్ పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులుండేలా చూడాలని సీఎం సూచించారు.

ఇళ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయండి

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పూర్తయిన ఇళ్ల ప్రారంభోత్సవానికి ఈ నెలాఖరులోగా ఏర్పాట్లు చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులకు సీఎం సూచించారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

మూడు రోజులూ అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్

రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలుంటాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేసుకోవాలని బుధవారం ఎక్స్ వేదికగా సూచించారు. క్లౌడ్ బరస్ట్ సమయంలో అనుసరించాల్సిన కార్యాచరణపై అధికారులకు సూచనలు చేశారు. అత్యధిక వర్షాలు పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వానలు, వరదల పరిస్థితులపై ప్రజలను ఎఫ్ఎం రేడియోల ద్వారా అలర్ట్ చేయాలన్నారు. అలాగే వాతావరణ పరిస్థితులను బట్టి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో పాటు, ఐటీ ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోమ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

'స్థానికం'లో
బీసీలకు 42%

రిజర్వేషన్లపై అసెంబ్లీలో నిర్ణయం

- తీర్మానం పెట్టి ఆమోదించే అవకాశం..
- 18 తర్వాత అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు
- ఘోష్ కమిషన్ నివేదికపై శాసనసభ, మండలిలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్!

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశం మళ్లీ అసెంబ్లీకే చేరుకోనుంది. అసెంబ్లీ తీర్మానం ద్వారా బీసీలకు ఈ మేరకు రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. వాస్తవానికి విద్య, ఉద్యోగాలు.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన రెండు బిల్లులు, పంచాయతీరాజ్ ఎన్నికల్లో రిజర్వేషన్‌పై ఉన్న పరిమితిని ఎత్తివేస్తూ తీసుకువచ్చిన ఆర్డినెన్సు.. కేంద్రం వద్దనే పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే స్థానిక ఎన్నికల విషయంలో కోర్టు గడువు ముంచుకొస్తుండడంతో అసెంబ్లీ వేదికగా ఈ అంశంపై నిర్ణయం తీసుకునేలా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుకు రాష్ట్ర స్థాయిలోనే చట్టబద్ధత తెచ్చే ఆలోచన జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అసెంబ్లీ ఆమోదం పొందిన ఈ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానాన్ని చర్చకు పెట్టి ఆమోదించాలని, ఆ తీర్మానం ఆధారంగా ఉత్తర్వులూ జారీ చేయాలని ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. ఏదిఏమైనా అసెంబ్లీ వేదికగా ఈ అంశంపై నిర్ణయం తీసుకునే పట్టుదలతో సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ అంశంపైన కాంగ్రెస్ పార్టీ పరంగా నిర్ణయం తీసుకునేందుకు టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) భేటీ నిర్వహించాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ల భేటీలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నెల 17న పీఏసీ భేటీ జరిగే అవకాశం ఉందని, ఆ భేటీలో మరింత స్పష్టత రానుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

18 తర్వాత అసెంబ్లీ సమావేశాలు

ఈనెల 18వ తేదీ తర్వాత అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సమావేశాలకు ముందు మంత్రివర్గం భేటీయై.. అసెంబ్లీలో ఆమోదించాల్సిన బిల్లులు, ఇతర అంశాలపైన చర్చించి ఆమోద ముద్ర వేయనుంది. బీసీలకు 42%రిజర్వేషన్లతో పాటుగా మరోకీలక అంశంపైనా చర్చించనున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి విచారణ నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నివేదికను పరిశీలించిన మంత్రివర్గం.. అసెంబ్లీలోనూ చర్చకు పెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శాసనసభ, మండలిలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. మరోవైపు.. ఈ అసెంబ్లీ సమావేశాల నుంచి శాసన మండలిని పాత అసెంబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 17 లేదా 18న సీఎం ఏర్పాట్లను పరిశీలించనున్నారు.

ప్రధాని మోదీ ఓట్ల దొంగ!

ఎన్నికల సంఘం ప్రధానికి తొత్తుగా మారింది.. ఆర్ఎస్ఎస్, బీజేపీ రాసిచ్చిన స్క్రిప్టునే ఈసీ చదువుతోంది

- దొంగ ఓట్లతో బీజేపీ 70 స్థానాలను గెలుచుకుంది
- మూడోసారి అధికారంలోకి రావడానికి అదే కారణం
- మారుమూల లోక్‌సభ నియోజకవర్గాలే వారి లక్ష్యం
- 30ఏళ్లుగా దొంగ ఓట్లను పెంచుకుంటూ పోతోంది
- దేశ ప్రజల కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీకి ఏపీ, తెలంగాణ ప్రజలు మద్దతుగా నిలవాలి
- చంద్రబాబు, జగన్ ఇద్దరూ మోదీకి దత్తపుత్రులు
- మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి లీడర్ కాదు.. రీడర్
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి



విజయవాడలో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి; చిత్రంలో ఏపీ కాంగ్రెస్ నేత మస్తాన్ వలీ

అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఓట్ల దొంగ అని, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి దొంగ ఓట్లే కారణమని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) ఆరోపించారు. ఈ ఓట్ల చోరీపై ఎన్నికల సంఘానికి, బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు దేశ ప్రజలంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. బీజేపీ మూడు దశాబ్దాలుగా మారుమూల ప్రాంతాల్లోని లోక్‌సభ నియోజకవర్గాలను ఎంపిక చేసుకుని దొంగ ఓట్లను పెంచుకుంటూ పోతోందని ఆరోపించారు. అలా దేశవ్యాప్తంగా 70వరకు లోక్‌సభ స్థానాలను చేజిక్కించుకుందని పేర్కొన్నారు. ఈ ఓట్ల చోరీలో ఏబీవీపీ, స్వదేశీ జాగరణ్ మంచ్, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ భాగస్వామ్యం అవుతున్నాయని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ రాసిచ్చిన స్క్రిప్టునే ఎన్నికల సంఘం చదువుతోందని విమర్శించారు. బీజేపీ ప్రముఖ్ రాసిచ్చిన స్క్రిప్టునే ఇటీవల ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చదివారని.. ఆయన లీడర్ కాదని రీడర్ అని ఎద్దేవా చేశారు.

ఎన్నికల సంఘం సమాధానం చెప్పడం లేదేం?

ఓట్ల చోరీపై రాహుల్‌గాంధీ ఆధారాలతో సహా లేవనెత్తిన సందేహాలపై కేంద్ర ఎన్నికల సంఘం నేరుగా ఎందుకు స్పందించడం లేదని జగ్గారెడ్డి నిలదీశారు. ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ గొంతుకనే ఈసీ వినిపిస్తోందని ఆరోపించారు. ప్రధాని కావాలన్న కాంక్షతో రాహుల్ పోరాటం చేయడం లేదని, దేశ ప్రయోజనాల కోసమే చేస్తున్నారని చెప్పారు. అసలు నెహ్రూ నుంచి రాజీవ్‌గాంధీ దాకా ప్రధాని పదవి వారి ఇంట్లోనే పుట్టిందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. దొంగ ఓట్ల వ్యవహారాన్ని రాహుల్ సాక్ష్యాధారాలతో బయటపెట్టారని, కాంగ్రెస్ పార్టీకి దమ్ముందని చెప్పేందుకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, వైఎస్ జగన్‌లలో ఎవరు అధికారంలోకి వచ్చినా అది బీజేపీ ఖాతాలోకే వెళ్తుందని పేర్కొన్నారు. మోదీకి చంద్రబాబు, జగన్ దత్తపుత్రులని.. బయటికి ఎంత కొట్టుకున్నా చివరికి మోదీ వద్దకు వెళ్లి ఉపశమనం పొందుతారని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కాంగ్రెస్‌పార్టీ బలాన్ని పెంచుకుని ప్రత్యామ్నాయశక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ పాల్గొన్నారు.

14 ఏళ్ల తరువాత
తెరుచుకున్న సర్కార్ బడి

ఓ యువకుని ఆలోచనతో పునఃప్రారంభం

- సహకరించిన దాతలు
- ప్రస్తుతం 25 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు

సుల్తానాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పద్నాలుగేళ్ల కింద మూతపడిన సర్కారు బడి మళ్లీ తెరుచుకుంది. గ్రామానికే చెందిన ఓ యువకుని ఆలోచనతో పాఠశాల పునఃప్రారంభమైంది. వినియోగంలో లేకపోవడంతో పశువుల కొట్టంలా, గోదాముల్లాగా నిరుపయోగంగా మారిపోయిన సర్కారు బడిని మరమ్మతులు చేయించి చదువులమ్మ గుడిగా మార్చేశాడు. గ్రామస్థుల దగ్గర నుంచి విరాళాలు సేకరించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాడు .పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మంచరామి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొన్ని కారణాల రీత్యా మూతపడింది. దాంతో ఆ గ్రామంలోని పిల్లలు చదువు కోసం సమీప గ్రామాల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో తల్లిదండ్రులకు పాఠశాల ఫీజులు, బస్సు చార్జీలు భారంగా మారాయి. వారి ఇబ్బందులను గమనించిన కొట్లె గట్టయ్య అనే యువకుడు పాఠశాలను తెరిపించేందుకు ఆలోచన చేశాడు. పాఠశాల నిర్వహణకు అవసరమైన సామగ్రిని దాతల సహకారంతో సమకూర్చాడు. అనంతరం జిల్లా విద్యాధికారులను సంప్రదించాడు. పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవి, ఎంఈవో ఆరేపల్లి రాజయ్య గత నెలలో పాఠశాలను పునః ప్రారంభించి, ఇద్దరు టీచర్లను నియమించారు. ప్రస్తుతం 25మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 14 ఏళ్ల క్రితం మూతపడ్డ పాఠశాలను తిరిగి తెరిపించేందుకు యువకుడు చేసిన కృషిని, దాతల సహకారాన్ని విద్యా శాఖ అధికారులు, ప్రజలు అభినందించారు.



14 ఏళ్ల అనంతరం తెరుచుకున్న ప్రభుత్వ పాఠశాల

ప్రాజెక్టుల వద్దే ఉండాలి

- 72 గంటలపాటు పర్యవేక్షించాలి
- క్షేత్రస్థాయి ఇంజనీర్లకు ఉత్తమ్ ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇంజనీర్లందరూ క్షేత్రస్థాయిలోని రిజర్వాయర్లు, కాల్వలు, చెరువుల వద్దే మకాం వేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. రానున్న 72 గంటల పాటు రాత్రింబవళ్లు వాటిని పర్యవేక్షించాలని సూచించారు. ఉన్నత స్థాయి ఇంజనీర్లు కూడా సంబంధిత ప్రాజెక్టుల వద్ద నిరంతరం అందుబాటులో ఉండి.. జిల్లా యంత్రాంగానికి నిర్ణయాలు తీసుకోవడంలో సహకరించాలన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈఎన్సీలు, సీఈలు, ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలతో సచివాలయం నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే 24 గంటల్లో భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మెదక్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, ములుగు, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో అతిభారీ వర్షాలు, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో వచ్చే 72 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో ఏ అధికారి కూడా క్షేత్రస్థాయి(హెడ్‌క్వార్టర్)ని వదిలి వెళ్లరాదని, సెలవు కూడా పెట్టరాదని ఆదేశించారు. గ్రామ స్థాయిలోని అత్యంత చిన్న చెరువు నుంచి రాష్ట్రంలోని అతిపెద్ద జలాశయం వరకు సాగునీటి వనరులన్నింటినీ అతి సమీపం నుంచి పర్యవేక్షించాలన్నారు. ఏదైనా ప్రమాదం నెలకొని ఉన్నా, పరిస్థితులు నియంత్రణ కోల్పోతున్నా తక్షణమే జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత సీఈ, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శికి సమాచారం అందించాలన్నారు. కాల్వలు, చెరువులకు గండ్లు పడ్డట్టు గుర్తిస్తే.. తక్షణమే నష్టనివారణ చర్యలు తీసుకోవాలన్నారు. జలాశయాలు, ఇతర సున్నిత ప్రదేశాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి గస్తీ నిర్వహించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఉత్తమ్ ఆదేశించారు. వరదల నిర్వహణకు సంబంధించిన అత్యవసర పనులకు క్షేత్ర స్థాయి ఇంజనీర్లు ఉన్నతాధికారుల నుంచి అనుమతుల కోసం నిరీక్షించవద్దని మంత్రి ఉత్తమ్ అన్నారు. జీవో 45 ద్వారా దఖలు పడిన అధికారాలను వినియోగించుకొని జారీ చేసిన నిధులను ఖర్చు చేసేందుకు వారికి విచక్షణాధికారాలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా, ప్రాజెక్టుల వారీగా ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కాగా, ప్రస్తుతానికి పరిస్థితి నియంత్రణలోనే ఉందని, క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టుల పర్యవేక్షణను మరింతగా ఉధృతం చేస్తామని అధికారులు బదులిచ్చారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉత్పన్నమైతే స్పందించడానికి తాను రెండుమూడు రోజులు ఫోన్‌లో అందుబాటులో ఉంటాననిమంత్రి చెప్పారు.

తెలంగాణకు కేంద్ర సహాయం

భారీ వర్షాల నేపథ్యంలో అమిత్ షా భరోసా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన అన్ని రకాల సహాయక చర్యలు అందిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో వరద పరిస్థితి, వాగులు, నదుల ఉధృతి వంటి అంశాలను కిషన్ రెడ్డి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అమిత్ షా స్పందిస్తూ, రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఉపయోగించుకోవాలని సూచించారు. అదనపు బలగాలు అవసరమైతే పంపడానికి కేంద్రం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కిషన్ రెడ్డి సూచించారు. అలాగే, బీజేపీ కార్యకర్తలు వరద బాధితులకు ఆహారం, తాగునీరు, పాలు, మందుల వంటి అత్యవసర వస్తువులను అందించాలని కోరారు.

వైద్య సిబ్బందికి సెలవులు రద్దు

3 రోజులు అప్రమత్తంగా ఉండాలి: దామోదర

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో వైద్య సిబ్బందికి ప్రభుత్వం సెలవులు రద్దు చేసింది. ఈ మూడు రోజుల పాటు ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. బుధవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఆర్ఎంవోలు, వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది కచ్చితంగా ఆసుపత్రుల్లోనే ఉండాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. అందరికీ సెలవులు రద్దు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు.

హుస్సేన్‌సాగర్ ఫుల్

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఏడు గేట్ల ద్వారా 1.89 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది. ఎగువన జూరాలలోకి 90వేల క్యూసెక్కుల వరద వస్తోంది. నాగార్జున సాగర్‌లోకి 2.28 లక్షల కూసెక్కుల నీరు వస్తుంటే అంతకుమించి 2.69 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పులిచింతలకు 3.15 లక్షల క్యూసెక్కుల వరద వస్తుంటే అంతే నీటిని బయటకు వదులుతున్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టు నాలుగు గేట్లు తెరుచుకున్నాయి. 14వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. గోదావరి ప్రాజెక్టులకు వరద పెరుగుతోంది. సింగూరు నీటి మట్టం గరిష్ఠస్థాయికి చేరుకుంది. ' ప్రాజెక్టులోకి 5వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. శ్రీరాంసాగర్‌కు 12789 క్యూసెక్కులు, ఎల్లంపల్లికి 24,723 క్యూసెక్కుల వరద వస్తోంది. కాళేశ్వరం వద్ద గోదావరి 6.55 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. మేడిగడ్డకు 1.57 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. అంతే నీటిని బయటకు వదులుతున్నారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ పూర్తిగా నిండిపోయింది. 1704 క్యూసెక్కుల నీరు వస్తుంటే.. 869 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లు ఎత్తి 3,854 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం వద్ద మూసీ వరద ఉధృతికి నేలవాలిన వరి పైరు



సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం గంట వారిగూడెం వద్ద కల్వర్టు మీద నుంచి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగు

వరుణుడి దరువు!

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో జనాలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పలుచోట్ల వరి, పత్తి పంట నీట మునిగింది. వరద ఉధృతికి వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 12 మండలాల్లో 11 నుంచి 19 సెం.మీ మధ్య, 50 మండలాల్లో 6 నుంచి 11 సెం.మీ మధ్య, మూడు మండలాల్లో 20 సెం.మీకు పైగా వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు మండలాలు మినహా.. మిగతా 616 మండలాల్లో వర్షంపాతం రికార్డయింది. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా కుండపోతగా వర్షం పడింది. ఆ జిల్లాలోని కన్నెపల్లి మండలంలో 24 సెం.మీ, భీమినిలో 23.8 సెం.మీ, ఆసిఫాబాద్ జిల్లాలో 21.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం పడింది. అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు ముందే హెచ్చరించడంతో జనం ఎక్కువగా ఇళ్లకే పరిమితమయ్యారు. యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని రుద్రవెల్లి-జూలూరు బ్రిడ్జి వద్ద, వలిగొండ మండలం సంగెం-బొల్లేపల్లి బ్రిడ్జి వద్ద మూసీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు. నల్లగొండ కలెక్టరేట్ సమీపంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఏర్పాటు చేసిన సెప్టిక్ ట్యాంకు.. వరద తీవ్రతకు ఓ పక్కకు ఒరిగిపోయింది. మంచిర్యాల జిల్లాలో పాల్వాయి పురుషోత్తంరావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా కన్నెపల్లి మండలం సాలిగాంలో ఇళ్లలోకి నీరు చేరింది. మంచిర్యాల జిల్లాలోని భీమిని మండలం ఖర్జి భీంపూర్‌లో చెరువు మత్తడి తెగింది. ఆదిలాబాద్ జిల్లా తర్నం లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో జైనథ్, బేల మండలాలకు రాకపోకలు నిలిపివేశారు. కుంటాల, పొచ్చెర, గాయత్రి, కనకాయి జలపాతాలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో మూడు రోజులపాటు సందర్శనను నిలిపివేశారు. ఉమ్మడి వరంగల్ జిలా పర్వతగిరి మండలం నారాయణపురం ఆకేరువాగులో మంగళవారం గల్లంతైన కందికట్ల



మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం సాలిగాంలో ఇళ్లలోకి చేరిన పాల్వాయి పురుషోత్తంరావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్

ఉప్పలయ్య (65) అనే పశువులకాపరి మృతదేహం లభ్యమైంది. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల శివారులోని ఎస్సారెస్పీ కాలువకు గండిపడింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం దొడ్ల-మల్యాల గ్రామాల మధ్యలోని జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొండాయి, మల్యాల, ఐలాపురం తదితర గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ యాకుత్‌పుర దగ్గర్లో గౌస్ (35) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు వరద కాల్వలో పడటంతో హైడ్రా అధికారులు అతడిని బయటకు తీశారు.

శిథిలమైన స్కూలుకు తాళం

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలోని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని మండల విద్యాధికారి అక్కడికొచ్చి పాఠశాలకు తాళం వేసి.. సెలవు ప్రకటించారు. పులిచింతల బ్యాక్‌వాటర్‌తో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి అడుగు మేర నీరు చేరింది. ఈ నీటిని మోటార్లతో కరకట్ట ఆవలకు ఎత్తిపోస్తున్నారు.

విమానాల రాకపోకలకు అంతరాయం

వాతావరణం అనుకూలించకపోవడంతో శంషాబాద్ విమానాశ్రయంలో బుధవారం విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. మరో మూడు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీఎంఆర్ అధికారుల వివరాల ప్రకారం.... ఢిల్లీ, అహ్మదాబాద్, కోల్‌కతా, పట్నా, గోవా, చెన్నై, ముంబై నుంచి రావాల్సిన విమానాల్లో ఐదింటిని వైజాగ్‌కు, మూడింటిని బెంగళూరుకు, ఒక విమానాన్ని తిరుపతికి మళ్లించారు. వీటిలో ఏడు విమానాలు తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాయి.



మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీనికితోడు రాష్ట్రంపై నైరుతి రుతుపవణాలు చురుగ్గా ఉన్నాయని, ఫలితంగా రాగల నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని హెచ్చరించింది. గురువారం మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని రెడ్ అలర్ట్ జారీ చేసింది. కొత్తగూడెం, భూపాలపల్లి, కామారెడ్డి, మహబూబాబాద్, మేడ్చల్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. ఆదిలాబాద్, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, గద్వాల, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, పెద్దపల్లి, సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. 19వ తేదీ వరకు వర్షాలు పడతాయని పేర్కొంది. గురువారం సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షం పడితే సెలవు ప్రకటించుకోవాలని రంగారెడ్డి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి సూచించారు.

గర్భిణిని తాళ్లతో దాటించి.. వరుడిని భుజంపై ఎత్తుకొని

మంచిర్యాల జిల్లా తాండూరు మండలం నర్సాపూర్ గ్రామ పరిధిలోని దొడ్డిగూడేనికి చెందిన గర్భిణికి పురిటినొప్పులు రావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో వాగు దాటడం కష్టమైంది. అంబులెన్స్ వచ్చినా వాగు దగ్గరే ఆగిపోవడంతో మాదారం ఎస్సై సౌజన్య, తాండూరు ఎస్సై కిరణ్ వచ్చి తాళ్ల సాయంతో గర్భిణిని వాగుదాటించి అంబులెన్స్ ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. ఇక వధువు ఇంట జరిగే పెళ్లి కోసం బంధుమిత్రుల కోలాహలం మధ్య ఆర్భాటంగా బయటుదేరిన వరుడికి మార్గమధ్యలో వరద పోటుతో దారి మూసుకుపోయింది. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రానికి మేళతాళాల మధ్య బయలుదేరిన జగిత్యాల జిల్లా గుంజపడుగకు చెందిన వరుడు, ఆయన కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఆ మండల కేంద్ర సమీపంలోని లోలెవల్ వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆగిపోయారు. వధువు తరఫువారొచ్చి వరుడిని భుజాలపై మోసుకొని కల్వర్టు దాటించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.